అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
మంగళవారం 4-4-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 93
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
www.navatelangana.com
10 పేజీలు వెల : 6.50

రాహుల్‌కు బెయిల్



అప్పీల్ పై 13న విచారణ

సూరత్ : పరువు నష్టం కేసులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ఉపశమనం లభించింది. సూరత్‌లోని సెషన్స్ కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. మోడీ ఇంటిపేరును కించపరిచేలా వ్యాఖ్యలు చేసినందుకు దాఖలైన క్రిమినల్ కేసులో రెండేండ్ల జైలు శిక్ష విధిస్తూ సూరత్‌లోని కింది కోర్టు ఇచ్చిన తీర్పును రాహుల్ అప్పీల్ చేశారు. దీనిపై సెషన్స్ కోర్టు సోమవారంబెయిల్ మంజూరు చేసింది. అలాగే ఈ కేసులో ...5లో

వాట్సాప్‌లో టెన్త్ పేపర్...

పరీక్ష ప్రారంభమైన కొద్దిసేపట్లోనే..

- వికారాబాద్ జిల్లా తాండూర్‌లోని నెంబర్ వన్ పాఠశాలలో ఘటన
- అధికారుల సమగ్ర విచారణ
- నలుగురిని సస్పెండ్ చేసిన కలెక్టర్
- పరీక్ష విధుల నుంచి ఒకరి తొలగింపు



నవతెలంగాణ-తాండూరు


పదో తరగతి పరీక్ష ప్రశ్నాపత్రం వాట్సాప్ గ్రూప్‌లో ప్రత్యక్షం కావడం సంచలనం సృష్టించింది. పరీక్ష ప్రారంభమైన కొద్దిసేపట్లోనే ప్రశ్నాపత్రం బయటకు రావడంతో లీక్ అయినట్టు తీవ్ర చర్చ జరిగింది. అయితే, ఉపాధ్యాయుడు ఫోన్‌లో ఫొటో తీసి వాట్సాప్‌లో షేర్ చేయడంతో పేపర్ బయటకు వచ్చిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఐదుగురిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో సోమవారం జరిగింది. అధికారులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

తాండూర్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ నెంబర్ వన్ పాఠశాలలో 260 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. 258 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 9 గంటల ఐదు నిమిషాలకు విద్యార్థులను పరీక్షా కేంద్రం లోపలికి పంపారు. ఉదయం 9:30 నిమిషాలకు పరీక్ష ప్రారంభమైంది. 9:37 నిమిషాలకు ప్రశ్నాపత్రం ప్రభుత్వ ఉపాధ్యాయుని ఫోన్ ద్వారా వాట్సాప్ గ్రూపులోకి వచ్చింది. అయితే, పేపర్ లీకేజీ అనేది పరీక్ష ప్రారంభానికి ముందు జరగలేదని, సీసీ కెమెరాలు మధ్య ఉదయం 9:15 నిమిషాలకు పేపర్ సీల్ ఓపెన్ చేసి విద్యార్థులకు ఇచ్చినట్టు అధికారులు తెలిపారు. 9 గంటల 35 నిమిషాల ...5లో

పది పరీక్షలు యథాతథం

విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన

- తొలిరోజు 2,165 మంది గైర్హాజరు వివరాలు 5లో



సామాజిక న్యాయ పరిరక్షణే లక్ష్యం



కులాల మధ్య భిన్నాభిప్రాయాలుండొచ్చు.. కానీ వివక్షే కీలకం

జాతీయ సదస్సులో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్



మన ఐక్యతే కీలకం

న్యూఢిల్లీ : సామాజిక న్యాయం పరిరక్షణ అందరి బాధ్యతని, అందుకు ఐక్యతే కీలకమని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ పేర్కొన్నారు. సోమవారం నాడిక్కడ ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ సోషల్ జస్టిస్ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు జరిగింది. ఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో జరిగిన ఈ సదస్సులో కొంత మంది భౌతికంగా, మరికొంత మంది ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. "సామాజిక న్యాయ కోసం జరిగే పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లటం, సామాజిక న్యాయం సాధనకు జాతీయ సంయుక్త కార్య క్రమం" అనే అంశంపై జరిగిన సదస్సులో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ అధ్యక్షోపన్యాసం చేశారు. సామాజిక న్యాయాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, అందుకు అందరు కలిసి ఉండాలని కోరారు. ఇది ఒక రాష్ట్రానికి సంబంధించిన అంశం కాదనీ, అలాగని కొన్ని రాష్ట్రాలకు సంబంధించినది కాదని, సామాజిక న్యాయం అన్ని రాష్ట్రాలకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. భారత సమాజ నిర్మాణంతో కలిసి ఉందని తెలిపారు. కులాలు, వర్గాల సమస్యల పట్ల రాష్ట్రాల మధ్య కొన్ని భిన్నాభిప్రాయాలు ఉండొచ్చునీ, కాని కుల వివక్ష అనేది ముఖ్యమైన అంశమని అన్నారు. వివక్ష, అంటరానితనం, బానిసత్వం, అన్యాయం వంటి విషానికి సామాజిక న్యాయమే మందు అని పేర్కొన్నారు. సామాజిక న్యాయంలో భాగంగానే రిజర్వేషన్లు వచ్చాయని తెలిపారు. బీజేపీ ఎస్‌డబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేస్తుందనీ, ఇది సామాజిక న్యాయం కాదని అన్నారు. పేదలకు ఏదైనా ఆర్థిక సహాయం చేస్తే, దాన్ని ఆర్థిక న్యాయమంటారని, సామాజిక న్యాయం ...2లో



ఉద్యమాలకు సిద్ధం కావాలి...

దేశంలో సామాజిక న్యాయం హామీ కోసం ఉద్యమాన్ని కొనసాగించాలి.సామాజిక న్యాయ ఉద్యమంలో సమానత్వం, ఆత్మ గౌరవం వంటి అంశాలు చాలా కీలమైనవి.సామాజిక న్యాయంలో కీలకమైన రిజర్వేషన్లు ఆర్థిక సాధికారితకు నాంది పలకాలి. రిజర్వేషన్లతో వచ్చిన ఆర్థిక సాధికారిత శతాబ్దాలుగా కుల అణచివేతకు గురైన వారికి ఆత్మ గౌరవాన్ని ఇస్తుంది. దీంతో సామాజిక అణచివేతకు ముగింపు పడుతుంది. ఇది అవసరం. ఆర్థిక వృద్ధి లేనిదే ఆర్థిక సాధికారిత సాధ్యం కాదు. అయితే ఆర్థికాభివృద్ధి అనేది కొంత మందికి మాత్రమే సంబంధించినదిగా ఉంది. మిగతా ప్రజానీకం దీనికి బయట ఉన్నారు. దేశంలోని 40.5 శాతం సంపద ఒక శాతం వద్దే ఉంది. కింద నున్న 50 శాతం ప్రజల్లో కేవలం మూడు శాతం సంపద మాత్రమే ఉంది. దేశంలో ప్రస్తుతం ఈ పరిస్థితి దాపురించింది. ఆర్థిక సాధికారిత సామాజిక న్యాయానికి హామీ ఇవ్వాలి. కార్పొరేట్, కమ్యూనల్ బంధంతో ఒకపక్క ఆర్థిక దాడి, మరోపక్క మతోన్మాద దాడి జరుగుతున్నది. దీన్ని ఎదుర్కోవాల్సి ఉంది.రిజర్వేషన్లు అంతం చేయాలని చూస్తున్నారు.లౌకిక ప్రజాస్వామ్యం, ఆర్థిక సార్వభౌమాధికారం, సామాజిక న్యాయం, సమాఖ్యవాదాన్ని పరిరక్షించుకోవడం చాలా ముఖ్యం.

సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి


సామాజిక వాస్తవికతను అర్థం చేసుకోవాలి...

ఎక్కువ మంది వెనుకబడిన వర్గాలకు చెందిన వారు ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక కాకపోవడానిక గల కారణాలను గుర్తించాలి. . విద్య అనేది కేవలం చైతన్య వంతులను చేయడానికి మాత్రమే కాదు. యువతలో స్ఫూర్తిని నింపడానికి ఉపయోగించాలి.సామాజిక న్యాయమనేది చాలా సుదీర్ఘమైన అంశం. కనుక సామాజిక వాస్తవికతను అర్థం చేసుకోవాలి.



బీఆర్ఎస్ నేత కె కేశవరావు

సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటం కీలకమైనది. రాజకీయ, ఆర్థిక సంస్కరణ జరగాలి.కుల సమాజం, వర్గ దోపిడీ అంతం కావాలి.కుల రహిత, వర్గ రహిత సమాజం నిర్మించాలి.ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి.



సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

పేదలకు దారి చూపేది ఎర్రజెండానే

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 1,50,000 గుడిసెలు

- ఇంటి నిర్మాణానికి కేంద్రం రూ.10లక్షలు,రాష్ట్రం రూ.5లక్షలు ఇవ్వాలి :తమ్మినేని





వివరాలు 5లో..

దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయం

త్వరలోనే అమరజ్యోతిని ప్రారంభిస్తాం : సీఎం కేసీఆర్




(ఫైల్)

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ స్వయం పాలన ఆకాంక్షలకు ఊపిరిలూదిన సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని సీఎం వారి త్యాగాలను స్మరించుకున్నారు. దొడ్డి కొమురయ్య అమరత్వం అందించిన చైతన్య స్ఫూర్తి మలి దశ తెలంగాణ ఉద్యమంలోనూ కొనసాగిందని సీఎం తెలిపారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధనకోసం పార్లమెంటరీ పంథాలో సాగిన శాంతియుత పోరాటంలో సబ్బండ వర్గాలు తమ వంతుగా ఉద్యమించాయని, తమ ఆకాంక్షలను చాటడంలో దొడ్డి కొమురయ్య స్ఫూర్తి ఇమిడి వున్నదని సీఎం ఒక ప్రకటనలో తెలిపారు. అమరవీరుల త్యాగాలను తెలంగాణ ప్రభుత్వం నిత్యం స్మరించుకుంటూ వారి ఆశయ సాధనకోసం శ్రమిస్తున్నదని తెలిపారు. బీసీ కుల వత్తులను పరిరక్షిస్తూ వారిని ప్రగతి పథంలో నడుపేందుకు, వారికి అన్ని విధాలా సాయం చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాయని తెలిపారు. గొల్ల కుర్మల ...5లో

సిట్ ఇంటరాగేషన్

- టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలోనే చైర్మెన్ జనార్ధన్‌రెడ్డి స్టేట్‌మెంట్ రికార్డు



నవతెలంగాణ -సిటీబ్యూరో

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. సోమవారం టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ జనార్ధన్‌రెడ్డి స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డు చేశారు. అదనపు సీపీ, సిట్ చీఫ్ ఏఆర్ శ్రీనివాస్, ఏసీపీ నర్సింగ్‌రావు నేతృత్వంలో మధ్యాహ్నం టీఎస్‌పీఎస్సీ కార్యాలయానికి చేరుకున్న సిట్ బృందం వివిధ అంశాలపై సుదీర్ఘంగా వివరాలు సేకరించినట్టు తెలిసింది. కాన్ఫిడెన్షియల్ సెక్షన్ భద్రత, పర్యవేక్షణలో చైర్మెన్, సెక్రెటరీ, సెక్షన్ అధికారుల మధ్య పూర్తిగా సమన్వయలోపం ఉన్నట్టు సిట్ అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్టు తెలిసింది. కాన్ఫిడెన్షియల్ సెక్షన్ బాధ్యత చైర్మెన్‌పై ఉండటంతో ఇందుకు సంబంధించి జనార్ధన్‌రెడ్డిని వివరణ కోరినట్టు తెలిసింది. కమిషన్‌లో ...5లో


ఉద్యోగుల ఖర్చు పెరిగింది

- సమ్మె నోటీసు ఉపసంహరించుకోండి
- 6 శాతం ఫిట్‌మెంట్‌కు ఓకే
- 'ఎస్మా' పరిధిలో ఉన్నారు.. మర్చిపోవద్దు : విద్యుత్ ఉద్యోగుల జేఏసీకి యాజమాన్యం లేఖ 5లో..

ఒక్క ఛాన్స్ ప్లీజ్..అవినీతిరహిత భారతాన్ని నిర్మిస్తా..అంటూ మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చి ఎనిమిదేండ్లు దాటినా..అవినీతి అనకొండలా బుసలు కొడుతూనే ఉంది. అదానీ, కార్పొరేట్ల సంగతి అలా ఉంచితే...క్లర్క్ మొదలుకుని కలెక్టర్ల వరకూ కోట్లకు పడగలెత్తి...అధికారంలో ఎంతగా బొక్కితే అంతగా తమ గోడల్లో, బంకర్లుగా తయారుచేసుకున్న స్థలాల్లో కూడబెడుతున్నారు. మరి వారిపై కొరడా ఎందుకు ఝుళిపించటంలేదు.? అధికారులు,రాజకీయ నేతలు కలిసి కామన్ మ్యాన్ అవసరాలను షరాబులా కాటాపై లెక్కకట్టి మరీ దోచుకుంటుంటే..మోడీ మాత్రం దర్యాప్తు సంస్థల్ని ప్రత్యర్థి పార్టీలను, విరాళాలు ఇవ్వని సంస్థలను భయపెట్టడం వల్లే అవినీతి పడగలెత్తుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే మోడీ ఏమంటున్నారంటే...

మోడీ పాలనలో అవినీతి మరకలు

- ఐఏఎస్‌లపై 581 కేసులు
- ఐదేండ్లలో ఐఏఎస్‌లపై 44 సీబీఐ కేసులు, ఐపీఎస్‌లపై 12 కేసులు





న్యూఢిల్లీ : దేశంలో అవినీతికి అడ్డుకట్ట వేస్తామనీ చెప్పిన మోడీ సర్కారు ఆ హామీని మాత్రం చేతల్లో చూపెట్టలేకపోతున్నది. గత యూపీఏ పాలనలో అవినితిని లేవనెత్తుతూ ప్రసంగాలు చేసే మోడీ సర్కారు తమ పాలనలో నమోదవుతున్న అవినీతి కేసులను మాత్రం బయటకు రాకుండా చేస్తున్నదని రాజకీయ విశ్లేషకులు అన్నారు. రాజకీయ నాయకులు చేసే పనులకు ఉన్నతాధికారులు బలి కావాల్సిన దుస్థితి ఏర్పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు గతంలో మోడీ సర్కారు వెల్లడి చేసిన గణాంకాలను ఈ సందర్భంగా ...2లో

అవినీతే అవరోధం...

మీ పని చేసుకుంటూ పోండి

- సీబీఐ అధికారులకు ప్రధాని మోడీ హితబోధ
- ఘనంగా సీబీఐ డైమండ్ జూబ్లీ వేడుకలు



నవతెలంగాణ- న్యూఢిల్లీ బ్యూరో

దేశాభివృద్ధికి అవినీతే పెద్ద అవరోధంగా మారిందనీ, సీబీఐ అధికారులు తమ పనిపై మరింత దృష్టి సారించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశించారు. సోమవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో సీబీఐ డైమండ్ జూబ్లీ వేడుకల సందర్భంగా షిల్లాంగ్, పూణే, నాగ్‌పూర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన సీబీఐ కాంప్లెక్స్‌లను ప్రారంభించారు. ఉత్తమ దర్యాప్తు ...5లో

బస్‌పాసుల్లో శ్లాబులు ఎత్తివేత

- ఇకపై కిలోమీటర్ల లెక్కే...: టీఎస్ఆర్టీసీ నిర్ణయం 2లో..

ప్రపంచ గమనం

జూలియన్ అసాంజేకు మద్దతివ్వని ఆస్ట్రేలియా ప్రభుత్వం



వాషింగ్టన్: అమెరికా యుద్ధ నేరాలను బయటపెట్టిన జూలియన్ అసాంజేని అమెరికా తరలించి, శిక్షించదలచిన అమెరికా ప్రయత్నానికి తమ లేబర్ ప్రభుత్వం మద్దతునిస్తున్నట్టు ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్ ప్రకటించింది. ఆవిధంగా తమ దేశ పౌరుడిని రక్షించటానికి తమకు ఏ మాత్రం ఆసక్తిలేదని వాంగ్ చెప్పకనే చెప్పినట్టయింది. ఈ మధ్య కాలంలో ఆస్ట్రేలియా, చైనాకు వ్యతిరేకంగా అమెరికా పన్నుతున్న వ్యూహంలో భాగమైంది. అమెరికాలోని శాన్ డియాగోలో అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ ఆస్ట్రేలియా ప్రధాని ఆంతోనీ అల్బనీస్, బ్రిటీష్ ప్రధాని రిషి సునాక్ గత నెలలో సమావేశమై ఆస్ట్రేలియా 368 బిలియన్ డాలర్ల విలువగల అణుశక్తితో నడిచే జలాంతర్గాములను సమకూర్చుకుంటుందని ప్రకటించారు. ఇది ఆకస్ అనే చైనా వ్యతిరేక త్రైపాక్షిక ఒప్పందంలో భాగంగా జరిగింది.

వికీలీక్స్ సంస్థ వ్యవస్థాపకుడైన అసాంజేపై అమెరికా చేస్తున్న దాడి పట్ల ఆస్ట్రేలియా మౌనంగా ఉండటం ఆ దేశ లేబర్ ప్రభుత్వ దివాళాకోరు విధానాన్ని ప్రతిబింబిస్తోంది. ఈవిషయంపై నిలదీసినప్పుడు "గొడవలేని దౌత్యనీతి"ని ఉపయోగిస్తున్నామని అల్బనీస్ ప్రభుత్వం బుకాయిస్తుంది. ఇప్పటికే అస్సాంజే కేసు ఎన్నో ఏండ్లుగా కొనసాగుతోందని, దాన్ని ఒక కొలిక్కి తేవలసిన అవసరం ఉందని వాంగ్ అభిప్రాయ పడింది. 'ఒక కొలిక్కి తీసుకురావటం' అంటే చాలా అర్థాలు ఉంటాయి. డాక్టర్లు అస్సాంజే ఆరోగ్యం వేగంగా క్షీణిస్తున్నదని ఎప్పుడో ప్రకటించారు. అలా అనారోగ్యంతో ఆయన బ్రిటన్‌లో అత్యంత భద్రతగల బెల్మార్ష్ జైలులో మరణించవచ్చు. లేక అయనను అమెరికాకు బలవంతంగా తరలించి రహస్య విచారణ పేరుతో 175సంవత్సరాల జైలు శిక్షను విధించవచ్చు. ఇలా అస్సాంజేను 'చట్టబద్ధం'గా తొక్కిచంపటాన్ని ఆస్ట్రేలియా ప్రభుత్వం సమర్థిస్తోంది. వాస్తవంలో చట్టాన్ని, న్యాయాన్ని పట్టించుకోకుండా అస్సాంజేని బలిపశువుని చేశారు. లండన్‌లోని ఈక్వెడార్ రాయబార కార్యాలయంలో అస్సాంజే అంతర్జాతీయంగా గుర్తించబడిన రాజకీయ కాందిశీకుడిగా ఉన్నప్పుడు అప్పటి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాలతో సీఐఏ అతనిని అపహరించి హత్య చేయాలనే ప్రయత్నం జరిగింది. ఇదంతా ఎలా చట్టపాలన అవుతుందో వాంగ్ కే తెలియాలి.

జార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్.. ఐదుగురు మావోయిస్టులు మృతి

రాంచీ: జార్ఖండ్‌లో సోమవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల కథనం ప్రకారం పలాము చత్రా సరిహద్దులో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. కాల్పుల్లో గౌతం పాసవాన్‌తో పాటు మరో నలుగురు మృతి చెందారు. ఘటనాస్థలిలో రెండు ఏకే-47 తుపాకులతో పాటు భారీగా ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించిన గౌతం పాసవాన్‌పై రూ.25 లక్షల రివార్డు ఉంది. మరో ఇద్దరు మావోయిస్టులపై రూ.5 లక్షల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. పలాము ఛత్రా సరిహద్దుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో సిఆర్‌పిఎఫ్ కోబ్రా యూనిట్‌తో కలిసి జాయింట్ టీమ్ ఆపరేషన్ ప్రారంభించామని అంతఘర్ అదనపు ఎస్‌పి కోమన్ సిన్హా తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు చనిపోయారన్నారు. కొయెలిబెడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సుమన్ సింగ్ అంచల, సంజయ్ కుమార్ ఉసెండి, పరుశరాం ధంగల్‌లను అరెస్టు చేశామని తెలిపారు.

సమగ్ర విచారణ జరపాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వికారాబాద్ జిల్లా తాండూర్‌లో పదో తరగతి పరీక్ష ప్రశ్నాపత్రం బయటికి రావడంపై సమగ్ర విచారణ జరపాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. లక్షలాది మంది విద్యార్థులు ఈ పరీక్షలను రాస్తున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారికి ఎలాంటి నష్టం జరగకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరీక్షలపై నమ్మకం కోల్పోతున్న విద్యార్థులు : ఏఐఎస్ఎఫ్

పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీపై సమగ్ర విచారణ జరపాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. వరుస లీకేజీలతో పరీక్షల పట్ల విద్యార్థులు నమ్మకం కోల్పోతున్నారని తెలిపారు. లీకేజీకి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ లోపం : పీడీఎస్‌యూ

పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం, విద్యాశాఖ అధికారుల లోపం స్పష్టంగా కనిపిస్తున్నదని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ విమర్శించారు. పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనపై విద్యాశాఖ మంత్రి, ముఖ్యమంత్రి తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని తెలిపారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి : పీడీఎస్‌యూ

పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పి మహేష్, ప్రధాన కార్యదర్శి ఎస్‌వి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. లీకైందని నిర్ధారణ అయితే సంబంధిత బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు.

దోషులను కఠినంగా శిక్షించాలి : పీడీఎస్‌యూ

పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనపై విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మామిడికాయల పరశురాం, ప్రధాన కార్యదర్శి ఇడంపాక విజయ్‌కన్నా డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పాఠశాల విద్యాశాఖలో నలుగురు అధికారుల బదిలీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాఠశాల విద్యాశాఖలో నలుగురు అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ (ఎస్ఐఈటీ) డైరెక్టర్‌గా ఎస్ విజయలక్ష్మి బాయి, వయోజన విద్య సంచాలకులుగా జి ఉషారాణి, తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శిగా ఉన్న సిహెచ్ రమణకుమార్‌కు తెలంగాణ మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులుగా పూర్తి అదనపు బాధ్యతలతోపాటు జవహర్ బాలభవన్ డైరెక్టర్, ప్రత్యేక అధికారిగా నియమించామని తెలిపారు. ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులుగా ఎ కృష్ణారావుకు పూర్తి స్థాయి బాధ్యతలను అప్పగిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన సెలవులో ఉన్నారని, వచ్చాక ఈ బాధ్యతలను నిర్వహిస్తారని తెలిపారు.

పోలవరం ముంపుపై తక్షణమే సర్వే చేపట్టాలి

పీపీఏ, ఏపీకి కేంద్ర జలసంఘం ఆదేశాలు

- సంయుక్త సర్వే నిర్వహణా నిర్లక్ష్యంపై గరంగరం
- తెలంగాణ ఒత్తిడితో అధ్యయనానికి నియమిత కాలపరిమితి విధింపు
- పోలవరం ప్రాజెక్టు అథారిటీకి స్పష్టమైన ఆదేశాలు
- ఏప్రిల్ 10న ఏపీ, తెలంగాణతో భేటీ
- అనంతరం చేపట్టాలని దిశానిర్దేశం
- గోపాలకృష్ణ కమిటీని ఒప్పుకునేది లేదని తెగేసి చెప్పిన ఒడిషా, చత్తీస్‌గఢ్
- కొత్తగా అధ్యయనం చేసి సర్వే, ప్రజాభిప్రాయం సేకరణ చేపట్టాలని పట్టు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పోలవరం ప్రాజెక్టు ముంపుపై తక్షణమే సర్వే చేపట్టాలని ప్రాజెక్టు అథారిటీకి, ఏపీ సర్కారుకు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. తెలంగాణ ప్రభుత్వం పట్టువదలకుండా చేస్తున్న ఒత్తిడి నేపథ్యంలో ముంపుపై అధ్యయనం కోసం నియమిత కాలపరిమితిని విధించింది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ముంపుతోపాటు, ఇతర అనేక సాంకేతిక అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ తెలంగాణ, ఏపీ, ఒడిషా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలు సుప్రీంకోర్టును ఆశ్రయించడం, ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాలతో ఏకాభిప్రాయం సాధించాలని కోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఇప్పటికే సీడబ్ల్యూసీ రెండుసార్లు అన్ని రాష్ట్రాలతో సమావేశం నిర్వహించింది. అలాగే మరోసారి ఢిల్లీలో సోమవారం మూడో భేటీని ఏర్పాటు చేసింది. ఆయా రాష్ట్రాల అభిప్రాయాలను, అభ్యంతరాలపై మరోసారి చర్చించింది. కేంద్ర జల సంఘం చైర్మన్ కుష్విందర్ వోరా అధ్యక్షతన సాగిన ఈ సమావేశంలో పోలవరం ప్రాజెక్టు ముంపు సమస్యలు, ఇతర సాంకేతిక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో తెలంగాణ మరోసారి తన వాదనలను బలంగా వినిపించింది.

తెలంగాణ వాదనలు..

1. పోలవరం ప్రాజెక్టు ముంపుపై సర్వే నిర్వహణను ఏపీ తాత్సారం చేస్తుండడాన్ని తెలంగాణ తీవ్రంగా నిరసించింది. సీడబ్ల్యూసీ గతంలో ఆదేశాలు జారీ చేసినా ఏపీ అసంబద్ధ వాదనలతో సర్వేకు ముందుకు రాకపోవడాన్ని తప్పుబట్టింది.

2. పోలవరం ఎఫ్ఆర్ఎల్ లెవల్‌లో నీటిని నిల్వ చేసినప్పుడు తెలంగాణ భూభాగంలో ఏర్పడుతున్న ముంపును గుర్తించాలి. అదేవిధంగా డ్రైనేజీ, స్థానిక ప్రవాహాలు నిలచిపోవడం వల్ల వాటిల్లే ప్రభావాలపై, జూలై 2022 వరదలపై తాజాగా ఉమ్మడి అధ్యయనం చేపట్టాలి.

3. ముఖ్యంగా మణుగూరు భార జల కేంద్రం, చారిత్రక భద్రాచలం, ఆలయం రక్షణకు చర్యలు చేపట్టాలి. కొత్తగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలి. భద్రాచలం పట్టణంలో ఎనిమిది అవుట్ ఫాల్ రెగ్యులేటర్ల స్థాయిని ధృవీకరించాలి.

4. పోలవరం ప్రాజెక్టు కారణంగా కిన్నెరసాని, ముర్రేడువాగు నదుల నీటి పారుదల రద్దీకి సంబంధించి ఎన్జీటీ ఉత్తర్వులను అనుసరించి ఆ రెండు వాగులతో పాటూ ఆరు నుంచి ఏడు ఇతర పెద్ద స్థానిక ప్రవాహాలపై కూడా సర్వే చేయాలి.

5. రాబోయే వర్షాకాలం దృష్ట్యా జాయింట్ సర్వేపై మరింత సమయం కోల్పోకుండా సత్వరమే చర్యలు ప్రారంభించాలి.

6. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో చేసిన విధంగా ఏదైనా ఏజెన్సీతో పీపీఏ ఆధ్వర్యంలో సంయుక్త సర్వేను తక్షణమే చేపట్టాలి.

7. పూడిక ప్రభావంతో సహా నది క్రాస్-సెక్షన్లను కొత్తగా తీసుకుని జాయింట్ సర్వే చేసి ముంపును అంచనా వేయాలి.

8. పోలవరం ప్రాజెక్ట్ కారణంగా తెలంగాణలో వచ్చే జూలై 2022 వరదల ప్రభావాన్ని సీడబ్ల్యూసీ అంగీకరించడం లేదు. కానీ బచావత్ ట్రిబ్యునల్ అవార్డ్ ఆపరేషన్ షెడ్యూల్ నిబంధనలకు కట్టుబడి ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత ఆ ప్రభావం ఉండదని చెబుతున్నది. అయితే పోలవరం బ్యాక్ వాటర్ వల్ల వరద ప్రభావం ఉంటుంది. ఈ నేపథ్యంలో జాయింట్ సర్వే తర్వాత పూణేలోని సీడబ్ల్యూసీ, పీఆర్ఎస్, ఇతర నిపుణులతో వీలైనంత త్వరగా సంబంధిత మోడల్ అధ్యయనాలను చేయించాలి.

9. సుప్రీంకోర్టు నిర్దేశించిన విధంగా రాష్ట్రాల సమస్యలను, ఆందోళనను పరిష్కరించాలంటే పైన పేర్కొన్న చర్యలన్నీ చాలా అవసరం.

10. అప్పటివరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్ట్‌లో నీటిని నిల్వ చేయడం కానీ, జలాశయాన్ని నిర్వహించడం కానీ ఎట్టిపరిస్థితుల్లో చేపట్టకూడదు.

సత్వరమే సర్వేను చేపట్టాలి

జాయింట్ సర్వే అంశంపై భేటీలో తెలంగాణ ప్రధానంగా పట్టుబట్టింది. పోలవరం బ్యాక్ వాటర్స్ ఎఫెక్ట్‌పై ఉమ్మడి సర్వే చేపట్టాలని తెలంగాణ డిమాండ్‌ను జనవరి 25న నిర్వహించిన రెండవ సాంకేతిక సమావేశాల్లోనే సీడబ్ల్యూసీ అంగీకరించింది. ఆ నిర్ణయాలను మినిట్స్‌లో నమోదు కూడా చేసింది. ఏపీని సమన్వయం చేసుకుంటూ సంయుక్త సర్వే చేపట్టాలని పీపీఏకు అప్పుడే ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ ఇప్పటివరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై ప్రస్తుత సమావేశంలో తెలంగాణ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. దీంతో సీడబ్ల్యూసీ వెంటనే స్పందించింది.

ఉమ్మడి సర్వేకు పూర్తికి నియమిత కాలపరిమితిని విధిస్తూ పీపీఏకు అల్టీమేటం జారీ చేసింది. అందులో భాగంగా తొలుత ఏప్రిల్ 10వ తేదీన తెలంగాణ, ఏపీతో సమావేశం నిర్వహించాలని పీపీఏను ఆదేశించింది. ముంపుపై ఇరు రాష్ట్రాలు గతంలో చేసిన అధ్యయనాలపై, రూపొందించిన మ్యాపులపై చర్చించాలని దిశానిర్దేశం చేసింది. తదనంతరం ఉమ్మడి సర్వేను సత్వరమే చేపట్టాలని నొక్కి చెప్పింది. ఇదిలావుండగా సమావేశానికి హాజరైన ఒడిషా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలు సైతం పలు డిమాండ్లను సీడబ్ల్యూసీకి నివేదించాయి. ముంపునకు సంబంధించి గోపాలకృష్ణ కమిటీ ఇచ్చిన నివేదికను ఎట్టిపరిస్థితులలోనూ అంగీకరించేది లేదనీ, కొత్తగా అధ్యయనం చేసి సర్వే, ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని డిమాండ్ చేశాయి. సీడబ్ల్యూసీ చైర్మెన్ కుష్విందర్ వోరా అధ్యక్షతన కొనసాగిన ఈ సమావేశంలో తెలంగాణ నుంచి ఇంజినీర్ ఇన్ చీఫ్ నాగేంద్రరావు, చీఫ్ ఇంజినీర్ కొత్తగూడెం శ్రీనివాస్‌రెడ్డి, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే, తెలంగాణ ఇంటర్‌స్టేట్ బోర్డు గోదావరి డైరెక్టర్ సుబ్రమణ్య ప్రసాద్, ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డి, పోలవరం చీఫ్ ఇంజినీర్ సుధాకర్‌బాబు, ఒడిషా రాష్ట్రం నుంచి ఈఎన్సీ అశుతోష్‌దాస్, ఛత్తీస్‌గఢ్ చీఫ్ ఇంజినీర్ నగరియాతోపాటు కేంద్ర జల సంఘం, పోలవరం అథారిటీ అధికారులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయ పరిరక్షణే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

కాదని తెలిపారు. కొంత మంది పేదలు, అన్ని కులాల్లో పేదలతో సమానం కాదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల్లో పేదలు ఆర్థిక, సామాజిక అణచివేతకు గురవుతున్నారని తెలిపారు. రిజర్వేషన్ ప్రతిభకు వ్యతిరేకమని చెప్పిన బీజేపీ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌కు మద్దతు ఇస్తుందని ఎద్దేవా చేశారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉన్న బీజేపీ, 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ తీసుకురావడంలో లాజిక్ ఏంటని ప్రశ్నించారు. ఇది ప్రతిభకు వ్యతిరేకం కాదా? అని ప్రశ్నించారు. కర్నాటకలో 4 శాతం ముస్లిం రిజర్వేషన్ కోటాను రద్దు చేసి, 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటాను పొందుపరిచారని విమర్శించారు. బీజేపీ ఓట్ల కోసమే పని చేస్తుందని, కర్నాటకలో సామాజిక న్యాయం హత్యకు గురయిందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలకు రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయాలని, న్యాయ వ్యవస్థలో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదోన్నతల్లో కూడా ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని,

కేంద్ర ప్రభుత్వం కుల జనగణన చేయాలని, గణాంకాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాము ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేశామని, అలాగే సామాజిక న్యాయం పర్యవేక్షణ కమిటీని కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. మేధావులు, న్యాయ నిపుణులు, అధికారులతో ఉన్న ఇలాంటి కమిటీలు అన్ని రాష్ట్రాల్లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ మాట్లాడుతూ సామాజిక భద్రత అవసరమనీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు న్యాయం జరగాలని అన్నారు. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ మాట్లాడుతూ ఆర్థిక, రాజకీయ రిజర్వేషన్లు కావాలని అన్నారు. వివిధ రంగాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు.

బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజశ్వి యాదవ్ మాట్లాడుతూ కుల గణన చేయాలని డిమాండ్ చేశారు. తాము కూడా సామాజిక న్యాయంపై కార్యక్రమం నిర్వహిస్తామని, అందురూ పాల్గొనాలని కోరారు. ఎస్‌పి అధినేత, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ సామాజిక విముక్త సమాజం స్థాపనకు అందరం కలిసి పని చేయాలని అన్నారు. ప్రస్తుతం సామాజిక న్యాయం అవసరం ఉందని తెలిపారు.

నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా మాట్లాడుతూ అందరి కోసం దేశం అభివద్ధి కావాలనీ, ఏండ్ల తరబడి అణచివేతకు గురవుతున్న, పేదరికంలో మగ్గిపోతున్నవారికి మంచి జీవితం ఇవ్వడమే లక్ష్యంగా ఉండాలన్నారు. అందుకోసం అందరం ఐక్యంగా ఉండాలని సూచించారు.

జస్టిస్ వి. ఈశ్వరయ్య స్వాగతోపన్యాసం చేస్తూ ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ సోషల్ జస్టిస్ అనేది ప్రతిదీ ప్రతి ఒక్కరి కోసం అనే లక్ష్యంతో ఏర్పడిందని అన్నారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని, దాన్ని వాస్తవంగా అమలు చేయాలని కోరారు. స్వేచ్ఛా, సమానత్వాలతో ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం అందించడమే రాజ్యాంగం స్ఫూర్తి అని పేర్కొన్నారు. అదే గౌరవమని అన్నారు. జనగణనలో కుల గణన చేయాలని, న్యాయ, శాసన, పరిపాలనలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం కావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఒబిసి రిజర్వేషన్, మహిళ రిజర్వేషన్లను కల్పించాలని అన్నారు. ఈ సదస్సులో ఎంపీ పి. విల్సన్ (డీఎంకె), డెరెక్ ఓబ్రెయిన్ (టీఎంసీ), ఛగన్ భుజ్‌బాల్ (ఎన్‌సీపీ), ఈటి. మహ్మద్ బషీర్ (ఐయుఎంఎల్), మనోజ్ కుమార్ ఝా (ఆర్‌జేడీ), సంజయ్ సింగ్ (ఆప్), రాజ్ కుమార్ సైనీ (ఎల్ఎస్‌పీ), మహాదేవ్ జంకర్ (ఆర్ఎస్‌పీ), వీరప్ప మొయిలీ (కాంగ్రెస్), వి.తిరుమలవన్ (వీకేసీ), వైకో (ఎండీఎంకె), దేవరాజన్ (ఫార్వర్డ్ బ్లాక్), పిఎజిఎఎఎం జాతీయ కన్వీనర్ బిఎన్ వాఘూ, ఎఐఎఫ్ఒబిసిఈడబ్ల్యుఎ ప్రధాన కార్యదర్శి జి.కరుణానిధి, బిఎంఎసిఈఎఫ్ అధ్యక్షుడు వామన్ మేష్‌రామ్, పిపిఐడి నేత బి.డి బ్రోకర్, రాజ్యాంగ పరిరక్షణ సంఘర్ష సమితి కన్వీనర్ అనిల్ జైహింద్, పివిఎస్ఎస్ఎం ఆర్గనైజర్ బహుదూర్ సింగ్ లోధి, ద్రావిడర్ ఖజగం అధ్యక్షుడు కె.వీరమణి, ఢిల్లీ యూనివర్శిటీ ప్రొఫెసర్లు లక్ష్మణ్ యాదవ్, రతన్ లాల్, సూరజ్ మండల్, సీనియర్ జర్నలిస్టులు దిలీప్ మండల్ ప్రసంగించారు. ఈ సదస్సును జస్టిస్ వీరేంద్ర సింగ్ యాదవ్ ముగించారు.

ఫార్మా కంపెనీల లాభాల కోసమే ఔషధాల ధరల పెంపు

- 10 నుంచి జాతాల రూపంలో ఉద్యమిస్తాం : తెలంగాణ మెడికల్, సేల్స్ రిప్రజెంటెటీవ్స్ యూనియన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫార్మా కంపెనీల లాభాల కోసమే కేంద్రంలోని బీజేపీ సర్కారు 380 ఔషధాల ధరలను 10 శాతం నుంచి 12.2 శాతానికి పెంచిందని తెలంగాణ మెడికల్, సేల్స్ రిప్రజెంటీటివ్స్ యూనియన్ (టీఎంఎస్ఆర్‌యూ) విమర్శించింది. ఈ మేరకు సోమవారం యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.భానుకిరణ్, ఐ.రాజుభట్ ఒక ప్రకటన విడుదల చేశారు. సామాన్యుల నడ్డి విరిచి వారికి ఆరోగ్యాన్ని అందని ద్రాక్షగా మార్చే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ నెల 10 నుంచి ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జాతాలు నిర్వహించి ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ప్రజలు ఆరోగ్యంపై చేసే ఖర్చులో 70 శాతం మందులపైనే ఖర్చు చేస్తున్నారనీ, ప్రస్తుత పెంపుతో వారిపై మరింత భారం పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గతేడాది 10 శాతం ధరలను పెంచిన కేంద్రం ప్రస్తుతం మరో 12 శాతం పెంచడం ప్రజారోగ్యంపై బీజేపీకున్న చిత్తశుద్ధిని తెలుపుతున్నదని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై ఉద్యమాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తామని తెలిపారు. పెంచిన మందుల ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలనీ, మందులపై జీరో జీఎస్టీ అమలు చేయాలని కోరారు. ప్రభుత్వరంగ మందులు, వ్యాక్సిన్ కంపెనీలను పునరుద్ధరించాలనీ, జీడీపీలో ఐదు శాతం వైద్యారోగ్య రంగానికి కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.

మోడీ పాలనలో అవినీతి మరకలు

(మొదటిపేజీ తరువాయి)

ఉటంకించారు. కేంద్రం సమాచారం ప్రకారం.. గతేడాదిలో ఐఏఎస్ అధికారులపై 581 అవినీతి కేసులు నమోదయ్యాయి. 2019-20లో ఐఏఎస్ అధికారులపై 753 ఫిర్యాదులు వచ్చాయి. 2018-19లో ఆ సంఖ్య 643గా ఉన్నది. 2017-18లో 623 కేసులు, 2016-17లో 484 కేసులు, 2015-16లో 380 ఫిర్యాదులు ఐఏఎస్ అధికారులకు వ్యతిరేకంగా నమోదయ్యాయి. 2016 నుంచి 2021 మధ్య ఐఏఎస్ అధికారులపై సీబీఐ సైతం 44 కేసులను నమోదు చేయగా, ఐపీఎస్ అధికారులపై 12 కేసులను నమోదు చేసింది.

సీబీఐ నేర నిరూపణ రేటు 67 శాతం

సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) నివేదిక ప్రకారం.. 2021లో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ నమోదు చేసిన కేసుల్లో నేర నిరూపణ రేటు 67.56 శాతంగా ఉన్నది. అంతకుముందు ఏడాది ఇది 69.83 శాతంగా ఉన్నది. 2021లో సీబీఐ మొత్తం 680 రెగ్యులర్ కేసులను నమోదు చేసింది. అలాగే, 67 ప్రాథమిక దర్యాప్తులను జరిపింది. ఇక 2020లో ఈ సంఖ్య 589 రెగ్యులర్ కేసులు, 87 ప్రాథమిక దర్యాప్తులుగా ఉన్నది. 2021లో 360 కేసుల్లో కోర్టు తీర్పులు వెలువడ్డాయి. ఇందులో 202 కేసులు నేర నిరూపణ కాగా.. 82 కేసుల్లో నిందితులు నిర్దోషులుగా తేలారు. ఈ ఏడాది ముగింపు నాటికి మొత్తం 10,232 కేసులు వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే, 982 కేసుల్లో దర్యాప్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 2020లో ఈ సంఖ్య 1117గా ఉన్నది.

భారత్‌లో అవినీతి పంజా

మోడీ పాలనలో అవినీతి చాపకింద నీరులా ప్రవహిస్తున్నది. ఈ విషయాన్ని పలు అంతర్జాతీయ నివేదికలు ప్రతి ఏడాదీ ఎత్తిచూపుతున్నాయి. అయితే, మోడీ అనుకూల మీడియా మాత్రం ఈ విషయాన్ని దేశప్రజలకు తెలియకుండా దాచిపెడుతున్నది.

భారత్‌లో అవినీతి వ్యాపిస్తున్న విషయంపై 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ' తన నివేదికలో పేర్కొన్నది. గతేడాది ప్రపంచవ్యాప్తంగా 180 దేశాలకు ఈ నివేదికలో ర్యాంకులను కేటాయించారు. ఇందులో భారత ర్యాంకు 40గా ఉండటం ఆందోళనకరం. ఆసియా పసిఫిక్ దేశాల్లో అవినీతి వ్యాపిస్తున్నదనీ, దానిని కట్టడి చేయడానికి తీసుకుంటున్న చర్యలు మాత్రం నిర్లక్ష్యానికి గురవుతున్నాయని 'అవినీతి అవగాహన సూచిక'లో ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ వెల్లడించింది. ఇందులో భారత్ పొరుగుదేశాలైన ఆఫ్ఘనిస్తాన్ 24వ స్థానం, మయన్మార్ 23, పాకిస్థాన్ 27, శ్రీలంక36, మలేషియా 47వ ర్యాంకులో ఉన్నాయి.

2021లో అవినీతి నిరోధక చట్టం కింద వివిధ నేరారోపణలకు సంబంధించి 457 కేసులు నమోదయ్యాయి. ఇందులో 549 మంది ప్రభుత్వ ఉద్యోగులు, 221 మంది గెజిటెడ్ అధికారులు ఉండటం గమనార్హం. ఏడాది చివరినాటికి అవినీతి నిరోధక చట్టం కింద ప్రాసిక్యూషన్‌కు అనుమతి కోసం 177 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని సీబీఐ నివేదించింది. 6,697 కేసుల విచారణ పెండింగ్‌లో ఉన్నది. డిపార్ట్‌మెంటల్ విచారణలు 921 ఉన్నాయి. అంతకముందు ఏడాది ఇవి 1341గా ఉన్నాయి.

బస్‌పాసుల్లో శ్లాబులు ఎత్తివేత

- ఇకపై కిలోమీటర్ల లెక్కే...:టీఎస్‌ఆర్టీసీ నిర్ణయం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీలో ఇప్పటి వరకు ఉన్న బస్‌పాస్ శ్లాబుల్ని ఎత్తేసి, వాటి స్థానంలో కిలోమీటర్ల లెక్కన పాసులు ఇవ్వాలని యాజమాన్యం నిర్ణయించింది. వీటిని మొదటగా ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ప్రవేశపెడుతున్నారు. పెరిగిన టోల్ చార్జీలను కూడా బస్‌పాస్ ఎమౌంట్‌తోనే కట్టించుకుంటారు. ఈ మేరకు టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం నెలవారీ బస్‌పాస్ దారులకు టోల్‌ప్లాజా రుసుం వేరుగా వసూలు చేస్తున్నారు. బస్‌పాస్ చూపించి.. ప్రతి రోజూ టోల్‌ప్లాజా టికెట్‌ను వారు తీసుకోవాల్సి ఉండేది. తాజాగా ఆ విధానాన్ని సంస్థ ఎత్తివేసింది. రాష్ట్రంలో ప్రస్తుతం 15వేల వరకు నెలవారీ బస్‌పాస్‌లున్నాయి. 100 కిలోమీటర్ల లోపు రెగ్యులర్‌గా ప్రయాణించే వారికి 'మంత్లీ సీజన్ టికెట్' పేరుతో పాస్‌లను సంస్థ ఇస్తోంది. నిత్యం ప్రయాణించే ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు ఈ పాస్‌లను ఎక్కువగా తీసుకుంటున్నారు. సాధారణ చార్జీతో పోల్చితే... ఈ పాస్ తీసుకుంటే 33 శాతం రాయితీని ఇస్తున్నారు. 20 రోజుల చార్జీతో 30 రోజుల పాటు ప్రయాణించే అవకాశాన్ని ఇప్పటి వరకు కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్ సర్వీస్ నెలవారీ బస్ పాసుల్లో శ్లాబ్ విధానం అమల్లో ఉంది. ఉదాహరణకు.. ఒక ప్రయాణీకుడు 51 కిలోమీటర్లు ప్రయాణిస్తే శ్లాబ్ విధానం ద్వారా 55 కిలోమీటర్లకు నెలవారీ బస్‌పాస్‌ను మంజూరు చేసే వారు. ఇకపై 51 కిలోమీటర్లకే బస్‌పాస్‌ను ఇస్తారు. దానితో పాటే టోల్ ప్లాజా రుసుం కూడా ఒకేసారి వసూలు చేస్తారు. దీనివల్ల ప్రయాణీకులకు లాభం కలుగుతుందని ఎమ్‌డీ సజ్జనార్ పేర్కొన్నారు.

సింగరేణి టర్నోవర్ రూ.32,830 కోట్లు

ఉత్పత్తి వ్యయం తగ్గించండి

- కేంద్రం వేలం పెట్టిన 4 బొగ్గు గనులు మనకే...: సీఎమ్‌డీ ఎన్ శ్రీధర్ వెల్లడి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కాలరీస్ కంపెనీ 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.32,830 కోట్ల టర్నోవర్ సాధించినట్టు ఆ సంస్థ సీఎమ్‌డీ ఎన్ శ్రీధర్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం(2021-22)లో సాధించిన రూ.26,619 కోట్ల రూపాయల టర్నోవర్‌పై 23 శాతం వద్ధిని నమోదు చేశామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 750 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలనీ, నాలుగు కొత్త ప్రాజెక్టుల నుండి 100 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయడం కీలకమని సీఎమ్‌డీ ఎన్ శ్రీధర్ తెలిపారు. సోమవారం సింగరేణి భవన్‌లో జరిగిన సంస్థ డైరెక్టర్లు, సలహాదారులు, ఏరియా జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్రం వేలంలో పెట్టిన నాలుగు బొగ్గు బ్లాకులు సింగరేణికే వచ్చే అవకాశం ఉందన్నారు. మరో 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ తో పాటు భారీగా సోలార్ విస్తరణ చేపట్టాలనీ, ఉత్పత్తి వ్యయం తగ్గించి, ఉత్పాదకత పెంచుకుంటేనే మనుగడ సంస్థ మనుగడ నిలకడగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సింగరేణి ఉద్యోగులు, అధికారులు, కార్మిక సంఘాల నాయకులకు అభినందనలు తెలిపారు. రాష్ట్రావతరణ తర్వాత 10 కొత్త గనులను ప్రారంభించుకొని, థర్మల్, సోలార్ విద్యుత్ రంగాల్లో కూడా ప్రవేశించడంతో ఈ అభివద్ధి సాధ్యమైందన్నారు. బొగ్గు అమ్మకాలను 8 రాష్ట్రాలకు విస్తరింపచేశామన్నారు. బొగ్గు అమ్మకాల ద్వారా రూ.28,459 కోట్లు, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ద్వారా జరిపిన విద్యుత్ అమ్మకాల ద్వారా రూ.4,371 కోట్ల టర్నోవర్ సాధ్యమైందని వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 75 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, వచ్చే రెండేండ్లలో 80 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని సింగరేణి చేరుకోనున్నదనీ, మరో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణం పూర్తయి ఉత్పత్తి ప్రారంభిస్తుందనీ తెలిపారు. 2026-27 నాటికి 50 వేల కోట్ల టర్నోవర్ మైలురాయిని సింగరేణి చేరుకుంటుందన్నారు. సమావేశంలో డైరెక్టర్లు ఎస్. బలరామ్ (ఫైనాన్స్ అండ్ పర్సనల్), డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణ రావు, ఎన్.వి.కె. శ్రీనివాస్ (ఆపరేషన్స్), అడ్వైజర్ సురేంద్ర పాండే (ఫారెస్ట్రీ), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ జె. ఆల్విన్, జీఎం (కోఆర్డినేషన్) ఎం.సురేష్, జి.ఎం(సీపీపీ) సి. హెచ్. నరసింహారావు, జి.ఎం(మార్కెటింగ్) కె. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధి ఇలా...

క్రమ సంఖ్య	అమ్మకాలు	2022-23	2021-22	వృద్ధి శాతం
1	బొగ్గు	28,459	22,740	25
2	విద్యుత్	4,371	3,879	13
3	మొత్తం	32,830	26,619	23



త్వరలో 'మన నగరం' కార్యక్రమం

- అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలపై ప్రచారం
- పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి
- కూల్‌రూఫ్ పాలసీని ప్రారంభించిన మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో 'మన నగరం' అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు పురపాలక, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు చెప్పారు. అన్ని పురపాలక సంఘాల్లోనూ ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఇప్పటి వరకు ఆయా పట్టణాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ, భవిష్యత్ ప్రణాళికలపై చర్చ, ప్రచారం నిర్వహించడం ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని పురపాలకశాఖ పరిపాలనా కమిషనర్ అండ్ డైరెక్టర్ (సీడీఎంఏ) ప్రధాన కార్యాలయంలో తెలంగాణ కూల్‌రూఫ్ పాలసీ 2023-28ని ఆయన ఆవిష్కరించారు. ఇండ్లపై కూల్‌రూఫ్ ఏర్పాటుతో అధిక వేడిని నియంత్రించుకోవచ్చని చెప్పారు. ఇకపై 600 చదరపు గజాలు, అంతకంటే ఎక్కువ స్థలంలో కట్టే భవనాలకు కూల్ రూఫ్ తప్పనిసరి అనీ, అప్పుడే నిరంభ్యంతర సర్టిఫికెట్లు (ఎన్‌ఓసీ) ఇస్తామని తెలిపారు. దీర్ఘకాలిక ప్రయోజనాల కోసమే ఈ పాలసీని తీసుకొస్తున్నామన్నారు. టీఎస్ బీపాస్‌తో దేశంలో ఎక్కడాలేని విధంగా భవన నిర్మాణ అనుమతులు ఇస్తున్నామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో హైదరాబాద్‌లో వంద చదరపు కిలోమీటర్ల మేరకు కూల్ రూఫ్ అమలుచేస్తామని చెప్పారు. ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్లకూ దీన్ని అమలు చేస్తామన్నారు. 2030 నాటికి రాష్ట్రంలో 200 చదరపు కిలోమీటర్ల కూల్ రూఫ్‌టాప్ ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కూల్‌రూఫ్ వల్ల మీటరుకు రూ.300 మాత్రమే ఖర్చవుతుందని వివరించారు. ఇప్పటికే కట్టిన భవనాలపై కూడా కూల్‌రూఫ్ విధానం అమలుచేయొచ్చనీ, దీన్ని ప్రోత్సహించేందుకు అవసరమైన ప్రోత్సాహకాలను ప్రకటించాలని ఆయన అధికారులను ఆదేశించారు. విద్యుత్ వాహనాల వినియోగం పెరగాలన్నారు. భవన నిర్మాణ వ్యర్థాల రీసైక్లింగ్ ద్వారా పునరుత్పత్తి చేసేలా హైదరాబాద్‌లో రెండు ప్లాంట్‌లు ఏర్పాటుచేశామనీ, వీటిని మరింత అభివృద్ధి చేసి కూల్‌రూఫ్‌కు ఉపయోగపడేలా ప్రత్యేక టైల్స్ ఉత్పత్తి సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలని కోరారు. దీనికోసం రియల్టర్ల వద్ద పనిచేసే సిబ్బంది, ఇతరులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కూల్‌రూఫ్ విధానంలో ఇండ్లపై నిర్మించే పై కప్పు వల్ల గది ఉష్ణోగ్రతలు బాగా తగ్గుతాయనీ, పైకప్పులకు ఉపయోగించే సామగ్రిలో కొన్ని మార్పులు చేయడం, ప్రత్యేక రసాయనాల వినియోగంతో 5 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఉష్ణోగ్రత తగ్గుతుందని అంచనా వేశామన్నారు. కూల్‌రూఫ్ విధానంలో సూర్యకిరణాలు తిరిగి వాతావరణంలోకే పరావర్తనం చెందడం ద్వారా ఇంటి లోపలకు వేడి రావడం తగ్గుతుందనీ, దీనికోసం శ్లాబ్‌పైన కూల్ పెయింట్ వేయడం, వినైల్ షీట్లు పరచడం, టైల్స్ వేసుకోవడం, భవనాల పైన మొక్కలు పెంచడం, సౌర విద్యుత్తు ఫలకాల ఏర్పాటు వంటి చర్యలతో ఉష్ణోగ్రతలు తగ్గుతాయని వివరించారు. కార్యక్రమంలో సీడీఎంఏ సత్యనారాయణ, పురపాలకశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అర్విందకుమార్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ లోకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరోనా మాదిరిగా పెరుగుతున్న ఆటిజం

- ప్రతి 38 మంది చిన్నారుల్లో ఒకరికి
- అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలి : ప్రభుత్వానికి డాక్టర్ ఇ.వి.వి రాజశేఖర్ సూచన
- ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆటిజం డే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆటిజం అనే న్యూరలాజికల్ సమస్య కరోనా మాదిరిగా పెరిగిపోతున్నదని ప్రముఖ సైకాలజిస్ట్, ఆటిజం థెరపిస్ట్ డాక్టర్ ఇ.వి.వి.రాజశేఖర్ హెచ్చరించారు. 2000 నుంచి ఆటిజం సోకినవారి సంఖ్య 241 శాతం పెరిగిందని తెలిపారు. 2000లో ప్రతి 160 మందిలో ఒకరికి ఉండగా..2010 నాటికి 68 మందిలో ఒకరికి, 2018 నాటికి 44 మందిలో ఒకరికి, ప్రస్తుతం ప్రతి 38 మందిలో ఒకరికి ఆటిజం వచ్చిందని తెలిపారు.

అంతర్జాతీయ ఆటిజండేను పురస్కరించుకుని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి ఎం.అడివయ్య అధ్యక్షతన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ఆటిజం సమస్య - ప్రభుత్వాల బాధ్యత' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో రాజశేఖర్ కీలకోపన్యాసం ఇచ్చారు. ఆటిజం ఉన్న పిల్లలను గుర్తించడం, వారితో ఏ విధంగా వ్యవహరించాలి? ఆటిజంలో ఉన్న రకాలేంటి? ఆటిజం కలిగిన పిల్లలను- సాధారణ పిల్లలతో కలిపి ఒకే బడిలో కొనసాగించాల్సిన అవసరత తదితర అంశాలను కూలంకుశంగా వివరించారు. ఆటిజం జబ్బు కాదనీ, దాన్ని నయం చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఆటిజం వేరు, మానసిక వైకల్యం వేరని తెలిపారు. శిశువు జన్మించిన 36 నెలల తర్వాత మాత్రమే ఆటిజాన్ని నిర్ధారించవచ్చన్నారు. చైల్డ్, క్లినికల్, రిహాబిలిటేషన్ సైకాలజిస్టులు మాత్రమే ఆటిజాన్ని గుర్తించగలుగుతారని వివరించారు. భవిష్యత్తులో ఇంటింటిని ఆటిజం కేసులు ఇబ్బంది పెట్టే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. ఆటిజం సోకిన పిల్లలను ప్రారంభదశలోనే గుర్తిస్తే ప్రయోజనం ఎక్కువగా ఉంటుందనీ, ఇందుకోసం పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులకు శాస్త్రీయమైన శిక్షణ అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం చొరవ చూపిస్తే వారికి శిక్షణ ఇచ్చేందుకు తాము సిద్ధమని ప్రకటించారు. శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి శ్రీదేవి ప్రసాద్ మాట్లాడుతూ 38 ఏండ్లుగా ఆటిజం రంగంలో సేవలందిస్తున్నట్టు తెలిపారు. 63 కారణాల ద్వారా ఇలాంటి పిల్లలు జన్మిస్తున్నట్టు గుర్తించారన్నారు. భవిష్యత్తులో ప్రతి ఏడుగురిలో ఒకరు ఆటిజంతో పుట్టే ప్రమాదముందంటూ నిపుణులు చెబుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటిజాన్ని వైకల్యంగా గుర్తించారనీ, అలాంటి వారిని తగిన రీతిలో ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని కోరారు. అడివయ్య మాట్లాడుతూ.. ఆటిజాన్ని అరికట్టేందుకు వీలుగా ఐక్యరాజ్యసమితి ఒప్పందంలో భారతదేశం సంతకం చేసిందనీ, ఆ మేరకు చర్యలు మాత్రం తీసుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో దాదాపు ఐదు లక్షల మంది ఆటిజం కలిగిన వారున్నప్పటికీ, వికలాంగుల శాఖ కమిషనర్ శైలజ రాష్ట్రంలో ఈ సమస్య అంతతీవ్రంగా లేదంటూ హైకోర్టులో చెప్పారని విమర్శించారు.



ప్రభుత్వాస్పత్రుల్లో ఆటిజం థెరపీ సెంటర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌పీఆర్‌డీ పక్షాన జిల్లాలు, మండలాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్, కోశాధికారి ఆర్.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇండ్లస్థలాలపై విధానం ప్రకటించాలి

- ప్రభుత్వానికి టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే విజ్ఞప్తి
- ప్రెస్‌క్లబ్‌లో సంతకాల సేకరణ

నవతెలంగాణ - హైదరాబాద్

రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు కేటాయించే విషయమై ప్రభుత్వం తన విధానాన్ని ప్రకటించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే) డిమాండ్ చేశాయి. రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిమంది జర్నలిస్టులు ఇండ్లస్థలాల కోసం ఎదురుచూస్తున్నారని అభిప్రాయపడ్డాయి. సోమవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే సంయుక్తంగా 'జర్నలిస్టుల ఇండ్లస్థలాల కోసం సంతకాల సేకరణ' కార్యక్రమాన్ని నిర్వహించాయి. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాతోపాటు వందలాది మంది జర్నలిస్టులు ఇందులో పాల్గొన్నారు. సంఘాలు ఏర్పాటు చేసిన భారీ బ్యానర్‌పై సంతకాలు చేశారు. అలాగే జాబితాల రూపకల్పనకు గాను జర్నలిస్టుల పేర్లు, పత్రిక, హోదా, చిరునామాలు, మొబైల్‌నంబర్లు సేకరించారు. అలాగే ఇండ్లస్థలాలు ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి.బసవపున్నయ్య మాట్లాడుతూ ఇండ్లస్థలాల కోసం గత 35 ఏండ్లుగా రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదురుచూస్తున్నారని చెప్పారు. సుప్రీంకోర్టు



తీర్పు తర్వాత ప్రభుత్వం స్పందిస్తుందని ఆశించామనీ, ఇంతవరకు తన వైఖరి చెప్పలేదని వ్యాఖ్యానించారు. లాక్‌డౌన్ తర్వాత అనేక సమస్యలను జర్నలిస్టులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని అన్నారు. హెచ్‌యూజే అధ్యక్షులు బి.అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సిగ్నేచర్ క్యాంపెయిన్‌లో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. ఆనందం, విజయానంద్, గుడిగ రఘు, బి. రాజశేఖర్, కార్యదర్శులు షేక్ సలీమ, ఈ. చంద్రశేఖర్, బి.జగదీశ్, తన్నీరు శ్రీనివాస్, కొప్పు నిరంజన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. విజయ, కె.రామకృష్ణ, పి.పాండు, బీవీఎన్ పద్మరాజు, పి.మధుకర్, పి.నాగవాణి, ఎం రమేశ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, రాష్ట్ర నాయకులు పి.బాపూరావు, హెచ్‌యూజే నాయకులు సర్వేశ్వర్‌రావు, కె. లలిత, క్రాంతి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

17 నుంచి ఐకేపీ వీఓఏల సమ్మె

- సెర్ప్ సీఈఓకు నోటీసు అందజేత

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని కోరుచూ ఐకేపీ వీఓఏలు ఈనెల 17నుంచి నిరవధిక సమ్మె చేయనున్నారు. ఈ విషయంపై సెర్ప్ సీఈఓకు తెలంగాణ ఐకేపీ వీఓఏల ఉద్యోగుల సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు ఎస్వీ.రమ మాట్లాడుతూ ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలనీ, కనీస వేతనం రూ.26వేలు, రూ. 10లక్షల సాధారణ బీమా, ఆరోగ్యబీమా కల్పించాలని కోరారు. సెర్ప్ నుంచి ఐడీ కార్డులు ఇవ్వాలనీ, ఇతర సమస్యలు పరిష్కరించాలని అనేకసార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదన్నారు. మార్చి 16,17,18 తేదీల్లో మూడు రోజులపాటు టోకెన్ సమ్మె చేసినా ప్రభుత్వం నుంచి ఏలాంటి స్పందనలేదని పేర్కొన్నారు.



తప్పనిసరి పరిస్థితుల్లో న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వీఓఏలందరూ పారిశ్రామిక వివాదాల చట్టం1947 సెక్షన్ 22, సబ్‌సెక్షన్(1) అనుసరించి ఈనెల 17 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్టు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం న్యాయమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు కె.రాజ్‌కుమార్, ఎం.నగేష్, కోశాధికారి సుమలత, ఉపాధ్యక్షురాలు వసియాబేగం తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు : ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలి.

-కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి.

-రూ.10లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి.-సెర్ప్ నుంచి ఐడీ కార్డులు ఇవ్వాలి.-గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధంలేకుండా ప్రతినెల వేతనాలు వీఓఏల వ్యక్తిగత ఖాతాలకు చెల్లించాలి.

-వీఓఏలతో ఆన్‌లైన్ పనులు చేయించకూడదు.

-వీఓఏలపైనా మహిళా సంఘాల ఒత్తిడి ఎక్కువగా ఉంటున్న కారణంగా ఎస్‌హెచ్‌జీలకు వీఎల్‌ఆర్, అభయహస్తం డబ్బులు చెల్లించాలి.

-ఎస్‌హెచ్‌జీ/వీఏ లైవ్ మీటింగ్స్ రద్దు చేయాలి.

-అర్హులైన వీఓఏలకు సీసీలుగా ప్రమోషన్స్ కల్పించాలి.

సంపాదకీయం

ప్రశ్నకూడా ప్రశ్నార్థకమే!

ప్రజాస్వామ్య వ్యవస్థలో కూడా ప్రశ్నించిన వారికి కోర్టు శిక్ష విధిస్తుందని గుజరాత్ హైకోర్టు తాజా తీర్పు తెలుపుతోంది..! ప్రధానమంత్రి మోడీ విద్యార్హత ఏమిటి? అని ప్రశ్నించినందుకు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు పాతికవేలు జరిమానా విధించింది. ప్రధాని విద్యార్హత గురించి ప్రశ్నించే అధికారం ఎవరికీ లేదని కూడా

ఈ వ్యవహారంపై తగ్గేదే లేదంటూన్నారు ఢిల్లీ ముఖ్యమంత్రి. "భారత దేశ ప్రధాని విద్యావంతుడు కావాల్సి ఉంది. ఇది 21వ శతాబ్దపు భారతదేశం. దేశ యువకులు శాస్త్ర, సాంకేతికతలను విశ్వసించేవారు. తమకు ఉద్యోగాలు, దేశానికి అభివృద్ధి కావాలని కోరుకునే వారు. విద్యావంతుడైన ప్రధాని నేతృత్వం వహించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. తక్కువ విద్య.. లేదంటే నిరక్షరాస్యుడైన ప్రధాని దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లలేరు" అని నిన్నటికి నిన్న ఢిల్లీ బహిరంగ సభలోనే కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు.

తేల్చేసింది. చదువుకోకపోవడమేమీ దోషమో, నేరమో కాదు. పైగా మన దేశంలో రాజకీయ నాయకులకు విద్యార్హత తప్పనిసరి కూడా కాదు! అలా అని ప్రధాని నిరక్షరాస్యుడని ఎవరూ అనడంలేదు. కానీ ఆయన ఎంఏ పూర్తి చేశారన్నది నిజమా, అబద్ధమా..? అన్నదే ప్రశ్న. నిజానికి ఈ వివాదం ఇప్పుడే మొదలైంది కాదు. 2016లో అరుణ్ జైట్లీ, అమిత్ షాలు ఉమ్మడిగా విలేకరుల సమావేశం పెట్టి మరీ ప్రధాని డిగ్రీ పట్టా చూపించారు. అప్పుడే అనేక అనుమానాలను రేకెత్తించిన ఆ సర్టిఫికెట్ ఇప్పుడు సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతోంది. అందులో 'యూనివర్సిటీ'కి బదులు 'యూనిబర్సిటీ' అని ఉండటంతో ఆ అనుమానాలు మరింత బలపడ్డాయి. అంతే కాదు ఆ సర్టిఫికెట్‌లో పేర్కొన్న తేది నాటికి కనిపెట్టని మైక్రోసాఫ్ట్ ఫాంట్లు, ఎంఏ "ఎంటైర్ పొలిటికల్ సైన్స్" అనే అర్ధరహిత సబ్జెక్టులు కలిసి ఆ పట్టా విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేశాయి.



వాస్తవానికి ఈ వ్యవహారంలో కేజ్రీవాల్ కక్షిదారు కాదు. ఆయన కేంద్ర సమాచార కమిషన్‌ను స.హ చట్టం ద్వారా ప్రధాని విద్యార్హతలు తెలియజేయమని దరఖాస్తు చేసుకున్నారు. అప్పుడు కేంద్ర సమాచార కమిషనర్‌గా ఉన్న మాడభూషి శ్రీధర్ ఈ వ్యవహారంలో వాస్తవాలు వెల్లడించాలని గుజరాత్, ఢిల్లీ విశ్వవిద్యాలయాలను ఆదేశించారు. వాటిని గుజరాత్ విశ్వవిద్యాలయం ఏమాత్రం లక్ష్య పెట్టలేదు. తాజాగా గుజరాత్ హైకోర్టు సైతం తన తీర్పు ద్వారా ప్రధాని విద్యార్హతలపై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయకపోగా వాటిని మరింత పెంచింది. తమ పూర్వ విద్యార్థి ఈ దేశాన్ని పాలిస్తున్నాడంటే అది ఆ విశ్వవిద్యాలయానికే గర్వ కారణం కదా! కానీ, ఆ యూనివర్సిటీ ఎందుకో స్పందించడంలేదు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చదువుకున్న ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆయన పేర ఒక పీఠమే ఉంది. అలాంటి పీఠమో, మరేదైనా మోడీ కూడా ఏర్పాటుచేసుకోవచ్చు కదా?

మోడీ డిగ్రీ ఏమైనా రహస్య పత్రమా? అందులో దేశ భద్రతకు సంబంధించిన అంశాలేమైనా ఉన్నాయా? ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రశ్నించడంపై గుజరాత్‌లోనే కేసు నమోదు కావడంలో ఉన్న మతలబు ఏంటి? ఎవరైనా ఎన్నికలలో పోటీ చేసేటప్పుడు ఎన్నికల కమిషన్‌కు అందజేసే అఫిడవిట్‌లో తమ విద్యార్హతలను కూడా ప్రస్తావించడం తప్పనిసరి. అలా మోడీ సమర్పించిన అఫిడవిట్‌లో తను పేర్కొన్న విద్యార్హతలు వాస్తవమా? కాదా? వంటి అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మోడీ డిగ్రీ సామాజిక మాధ్యమాలలో ఉంది అని సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అంటున్నారు. మరి ఆ డిగ్రీని స.హ చట్టం కింద అడిగినవారికి ఇవ్వడాని అభ్యంతరమేమిటో మాత్రం చెప్పడం లేదు. పైగా గుజరాత్ హైకోర్టు ప్రధాని డిగ్రీ గురించి ఎవరూ ప్రశ్నించకూడదని ఆదేశించడం, కేజ్రీవాల్‌కు జరిమానా విధించడం మహా విడ్డూరం! మరో వైపు మోడీ బీఏ డిగ్రీ గురించిన వ్యవహారం ఇంకా ఢిల్లీ కోర్టులో విచారణలోనే ఉంది. ఎన్నికల కమిషన్ ఎదుట దాఖలుచేసే అఫిడవిట్‌లో ఇచ్చే సమాచారం తప్పయితే శిక్షకూడా పడొచ్చు. అందుకే గుజరాత్ హైకోర్టు ఈ అంశాన్ని లేవనెత్తడానికి వీలులేదని ఆంక్ష విధించిందా? సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సైతం ప్రధానమంత్రి విద్యార్హతతో సంబంధం ఏమిటి? దీనివల్ల ప్రజాస్వామ్యానికి వచ్చిన ముప్పేమీ లేదనీ, ప్రజాహితానికి సంబంధించిన అంశం కాదనీ కొట్టిపారేస్తున్నారు. అందుకే నేటికి అవి అనుమానాలుగానే ఉన్నాయి.

ఈ వ్యవహారంపై తగ్గేదే లేదంటున్నారు ఢిల్లీ ముఖ్యమంత్రి. "భారత దేశ ప్రధాని విద్యావంతుడు కావాల్సి ఉంది. ఇది 21వ శతాబ్దపు భారతదేశం. దేశ యువకులు శాస్త్ర, సాంకేతికతలను విశ్వసించేవారు. తమకు ఉద్యోగాలు, దేశానికి అభివృద్ధి కావాలని కోరుకునే వారు. విద్యావంతుడైన ప్రధాని నేతృత్వం వహించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. తక్కువ విద్య.. లేదంటే నిరక్షరాస్యుడైన ప్రధాని దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లలేరు" అని నిన్నటికి నిన్న ఢిల్లీ బహిరంగ సభలోనే కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. నిజంగా చదవి ఉంటే ఎక్కడ చదివారో, ఏం చదివారో చెప్పడానికి ప్రధానికి సిగ్గెందుకని శివసేన అధినేత ఉద్ధవ్ థాకరే సైతం ప్రశ్నిస్తున్నారు. ప్రశ్నించే హక్కు ప్రజాస్వామ్యానికే మూలస్తంభం. జవాబుదారీతనం ఏలికల బాధ్యత. ఈ ప్రాథమిక సూత్రాన్ని ఎందుకు విస్మరిస్తున్నారో బోధపడని విషయమేమీ కాదు.

ఏప్రిల్ 5న ఢిల్లీలో

కార్మిక - కర్షక సంఘర్ష ర్యాలీ - రాజకీయ ప్రాధాన్యత

ఏప్రిల్ 5న జరుగనున్న కార్మిక, వ్యవసాయ కార్మిక రైతు సంఘర్ష ర్యాలీ దేశ ప్రజలను దోచుకుంటున్న కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు ఊపందుకోటానికి నాంది పలకనున్నది. అంతర్జాతీయ పెట్టుబడిదార్ల ఆదేశాలకు లోబడిన పాలకులకు వ్యతిరేకంగా ప్రజలను దహిస్తున్న జీవనోపాధి సమస్యలపై వర్గ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్ళటానికి వామపక్ష, ప్రజాతంత్ర ప్రత్యామ్నాయ నిర్మాణం అత్యంత కీలకం.

స్వాతంత్ర్యానంతర కాలంలో ఎన్నడూ లేనంత భారీ సమీకరణతో ఈ కార్మిక-రైతు ప్రదర్శన జరుగనున్నది. రెండవది, పాలక వర్గాల విధానాలతో ముడిపడివున్న స్థానిక సమస్యలు, ఉమ్మడి సమస్యలపై నిర్దిష్ట డిమాండ్లతో కార్మిక-రైతుకూటమి వర్గ ఐక్యతతో పోరాటాలు సాగించనున్నట్టు ఈ ప్రదర్శనలో ప్రకటించనున్నారు. భారతదేశంలో ప్రస్తుతమున్న వ్యవసాయక సంక్షోభాన్ని అధిగమించటానికి, అలాగే అంతర్జాతీయ విత్తపెట్టుబడి, గుత్త పెట్టుబడి నియంత్రణ కింద నడుస్తున్న అత్యంత దోపిడీ, దుర్మార్గ స్వభావంగల నయాఉదారవాద పాలనను అంతమొందించటానికి పునాదివర్గాల మధ్య ఐక్యత, వాటి నాయకత్వాన నిర్దిష్టమైన భారీ పోరాటాలు చేయటం అవసరం. స్వాతంత్ర్యానంతరం బడా పెట్టుబడిదారీవర్గం, భూస్వామ్యవర్గం సంయుక్తంగా సామ్రాజ్యవాదంతో జతకూడి భారతదేశంలో పాలకవర్గంగా అవతరించింది. ఈ శక్తులు భూస్వామ్య వ్యవస్థలోని జమిందార్లను పెట్టుబడిదారీ భూస్వాములు మార్చటానికి ప్రయత్నాలు చేశాయి. స్వాతంత్ర్యంవచ్చి, గడిచిన 75సంవత్సరాలలో భారతదేశం ఆధునిక పారిశ్రామిక సమాజంగా అభివృద్ధి చెందటానికి పాలకవర్గాల విధానాలు అడ్డంకి అయినాయి.



పి. కృష్ణ ప్రసాద్

దేశపాలనలో ప్రభుత్వ నియంత్రణ అంతమై, నయా ఉదారవాద విధానాలు ఆరంభమవటంతో, అంతర్జాతీయ విత్తపెట్టుబడి ఆధిపత్యం పెరిగింది. దానితో భారత గుత్తపెట్టుబడి కూడా మమేకమైంది. వ్యవసాయానికి అవసరమైన వస్తుసామాగ్రి ధరలు హద్దూపద్దు లేకుండా పెరగటంతో పాటు ద్రవ్యోల్బణం వలన జీవనవ్యయం పెరిగింది. వీటికితోడు అన్ని వ్యవసాయోత్పత్తుల ధరలు పతనం కావటంతో భారత వ్యవసాయరంగం పై కార్పొరేట్ల పట్టు బిగిసింది. వ్యవసాయం అనేది నష్టదాయక వృత్తిగా మారిపోయింది. రైతు కుటుంబాలు అప్పుల విషవలయంలో చిక్కుకున్నాయి . రైతులు, వ్యవసాయ కార్మికుల్లో ఆత్మహత్యలు అనూహ్యంగా పెరిగాయి. నయా ఉదారవాద పెట్టుబడిదారి వ్యవస్థ కింద వ్యవసాయక సంక్షోభంలో గోడ్డుగోద, భూమిపుత్ర కోల్పోయి పీకల్లోతు అప్పుల్లోకూరుకుపోయి దారుణమైన దారిద్ర్యంలోకి రైతులు దిగబడ్డారు. ఈ విధంగా దుర్భర దారిద్ర్యంలోకి నెట్టబడిన రైతులు వలస కార్మికులుగా మారుతున్నారు. ఇలా వలస కార్మికుల సంఖ్య రోజురోజుకు పెరిగి ఇప్పుడు 23 కోట్లకు చేరింది. ప్రస్తుతం ఇదే అతిపెద్ద ఏకైక వర్గంగా ఉన్నది.


1999-2004 సంవత్సరాల మధ్య ఎన్‌డీఏ నాయకత్వన ఉన్న వాజ్‌పేయి ప్రభుత్వం వ్యవసాయక సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తూ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులకు అనుమతులిచ్చింది. ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రయివేటీకరణకు, వ్యవసాయ రంగంలో బహుళజాతి కంపెనీల, గుత్త పెట్టుబడిదారీ కార్పొరేట్ల ప్రవేశానికి ఆ ప్రభుత్వం లాకులెత్తేసింది. మహారాష్ట్రలోని విదర్భ, కేరళలోని వయనాడ్, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం లాంటి కొన్ని ప్రాంతాలలో మధ్యప్రదేశ్, పంజాబ్, ఛత్తీస్‌ఘడ్ లాంటి రాష్ట్రాలలో అప్పులబాధ, రైతు ఆత్మహత్యలు పెరిగాయి. దీని పర్యవసానంగా రైతాంగంలో ఆగ్రహావేశాలు పెరిగి ప్రతిఘటనా పోరాటాలు నిర్మించ వలసిన అవసరం ఏర్పడింది. ఈ విధంగా వ్యవసాయక సంక్షోభం ఒక ముఖ్యమైన తక్షణ రాజకీయ సమస్యగా దేశ ఎజెండాలోకి వచ్చింది.

2004 ఎన్నికలలో ఎన్‌డీఏ వాజ్‌పేయి ప్రభుత్వం ఘోర పరాజయం పాలైంది. రైతాంగంలోను, గ్రామీణ ప్రజలలోను పెరిగిన అశాంతి ఈ ఓటమికి ప్రధాన కారణం. ఎన్నికల చరిత్రలో మొదటిసారి 64మంది వామపక్ష, ప్రజాస్వామిక కూటమి సభ్యులు పార్లమెంటుకు ఎన్నికైనారు. వీరి మద్దతుతో కనీస ఉమ్మడి కార్యక్రమం ఆధారంగా మొదటి యూపీఏ ప్రభుత్వం ఏర్పడింది. ఈ యూపీఏ-1 ప్రభుత్వం తీవ్రంగా ఉన్న వ్యవసాయక సంక్షోభం పరిష్కరించటానికి అనేక చర్యలు తీసుకున్నది. ఎం.ఎస్ స్వామినాథన్ ఛైర్మన్‌గా 2004లో నేషనల్ కమిషన్ ఆన్ ఫార్మర్స్ (ఎన్‌సీఎఫ్) ఏర్పాటుచేయటం, 'మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, రూ.70వేల కోట్లతో రైతుల రుణమాఫీ వంటివి ఆ చర్యలలో కొన్ని.

అన్ని పంటలకు పంట సేకరణ హామీని ఇస్తూ, పంట ఉత్పత్తి వ్యయానికి ఒకటిన్నర రెట్లుతో ఎం.ఎస్.పి.ఎ C2+50 కనీస మద్దతు ధరను ప్రతిపాదించుతూ స్వామినాథన్ కమిషన్ 2006లో తన నివేదికను సమర్పించింది. అయితే, 2014 దాకా అధికారంలో ఉన్న యూపీఏ -1, యూపీఏ- 2 ప్రభుత్వాలు ఈకీలకమైన సిఫార్సులను అమలు చేయలేదు. యూపీఏ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న పాలకపార్టీలపై అంతర్జాతీయ విత్త పెట్టుబడి- గుత్తపెట్టుబడికి ఉన్న బలమైనపట్టు దీనికి కారణం. అంతేకాకుండా, బ్యాంకులు, ఇన్సూరెన్సు కంపెనీల ప్రయివేటీకరణ, పెట్రోలియం ఉత్పత్తుల ధరలపై నియంత్రణ ఎత్తివేయటం మొదలైన కార్పొరేట్ అనుకూల విధానాలను చేపట్టింది. ఈ విధానాలను రైతుసంఘాలు, కార్మికసంఘాలు, వామపక్ష, ప్రజాస్వామికశక్తులు పార్లమెంటు లోపల, బయటా తీవ్రంగా వ్యతిరేకించాయి. అనేక ప్రభుత్వ పథకాలలో కార్పొరేట్ కంపెనీల అవినీతి విశంఖలంగా సాగటంతో యూపీఏ- 2 ప్రభుత్వ ప్రతిష్ట మసకబారింది.

పంటలన్నింటికి కనీస మద్దతు ధర ఉత్పత్తి వ్యయంపై ఒకటిన్నర రెట్లు (C2+50), ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తాననే హామీలను బీజేపీ తన ఎన్నికలు మ్యానిఫెస్టోలో చేర్చుకుని ప్రచారం చేసుకుంది. ఈ హామీలు గ్రామీణప్రాంత ప్రజలలో, మరీ ముఖ్యంగా వ్యవసాయక సంక్షోభం బారిన పడిన ప్రాంతాలలో బీజేపీ మద్దతు కూడగట్టుకోవటానికి ఉపయోగ పడ్డాయి. అయితే, ఇచ్చిన హామీలకు విరుద్ధంగా గత ఎనిమిదేళ్ళ మోడీపాలనలో పంటలకు C2+50 కనీస మద్దతు ధరను అమలు పరచలేదు, నిరుద్యోగం స్వతంత్ర భారతదేశంలో ఎప్పుడూ లేనంతగా తారస్థాయికి చేరింది. పాలకవర్గపార్టీలలో ప్రధాన పార్టీగావున్న బీజేపీ - ఆర్ఎస్ఎస్‌లు అంతర్జాతీయ విత్తపెట్టుబడి - గుత్త పెట్టుబడుల ఒత్తిడికి లొంగిపోయింది, నయాఉదారవాద విధాన సంస్కరణల అమలు వేగాన్ని పెంచింది.

ఈ విధానాలు రైతాంగంలో పేదరికాన్ని మరింత పెంచాయి. గ్రామాల నుంచి పట్టణాలకు భారీగా వలసలు పెరిగాయి. ప్రయివేటీకరణ విచ్చలవిడిగా సాగించటం, మొత్తం ఆర్థికవ్యవస్థను కార్పొరేట్లకు వీలుగా ప్రణాళిక ప్రక్రియను ధ్వంసం చేశారు. కార్పొరేటీకరణే లక్ష్యంగా పార్లమెంటులో ఏ కొద్దిపాటి చర్చకు అనుమతించకుండా మూడు వ్యవసాయ చట్టాలు చేశారు. ప్రపంచ దేశాల దారిద్ర్య సూచీలో 2014లో 56వ స్థానంలో ఉన్న భారతదేశం 2021లో 107వ స్థానానికి చేరింది. కార్మికసంఘ హక్కులు, కనీస వేతనం, ఉద్యోగ భద్రతలు నిరాకరించే లక్ష్యంతో 4 లేబర్ కోడ్స్ ను తెచ్చారు. గ్రామీణ ఉపాధి చట్టం కేటాయింపులు క్రమంగా రూ.30 వేల కోట్లకు తగ్గించారు, హామీగా ఇచ్చిన 100 సగటు పనిదినాలను హీనస్థాయికి 42 పనిదినాలకు తగ్గించారు, పనిదినానికి ఇచ్చే వేతనం కూడా నిరంతరం పెరుగుతున్న ధరలతో పోలిస్తే అత్యల్పం. జనవరి 1, 2023 నుంచి రూ.2 సబ్సిడీ బియ్యం, రూ.3 సబ్సిడీ గోధుమలు ఎత్తివేయటం ద్వారా పేదలపై దాడి తారస్థాయికి చేరింది. 2023-24 బడ్జెట్‌లో ఆహార సబ్సిడీకి రూ.90 వేల కోట్ల భారీ కోత పెట్టటంతో ఆహారభద్రతకు పెనుప్రమాదం ముంచుకొచ్చింది. ఇది ఆకలికి, ఆకలిచావులకు దారితీస్తోంది. దీనికి ప్రతిగా నయా ఉదారవాద దాడులను



ప్రతిఘటించటానికి రైతులు, గ్రామీణ కార్మికుల చొరవతో కార్మిక-రైతు కూటమి ఏర్పడింది. ఆల్ ఇండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు), సెంటర్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు)లు స్వతంత్రంగాను, అలాగే ఇతర సంఘాలతో కలిసి నిరంతరం పోరాటాలు సాగిస్తున్నాయి. ఈ పోరాటాలను, సమస్యల ఆధారంగా ఏర్పడిన ఐక్యవేదికలైన భూమి అధికార్ ఆందోళన్ (బిఎఎ), ఆల్ ఇండియా కిసాన్ సమన్వయ సమితి (ఎఐకెఎస్‌సిసి), సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) సంస్థలు పోరాటాలు సాగించాయి. మహారాష్ట్రలో సాగిన రైతుల దీర్ఘయాత్ర ప్రపంచ వ్యాపితంగా శ్రమజీవుల దృష్టిని ఆకర్షించింది. స్వతంత్ర భారతదేశంలో మొట్టమొదటి సారిగా 2018 సెప్టెంబరు 5న రెండు లక్షల మందితో సాగిన కార్మిక-రైతు సంఘర్ష ర్యాలీ కార్మికులు, రైతుల ఉత్సాహాన్ని పెంచటంలో కీలకంగా ఉంది. ఐక్య కార్మిక ఉద్యమం ఇచ్చిన చురుకైన మద్దతుతో సంయుక్త రైతాంగ ఉద్యమం మూడు వ్యవసాయ చట్టాల రద్దుతో చారిత్రక విజయం సాధించింది. గత మూడు దశాబ్దాలుగా ఉన్న నయా ఉదారవాద శక్తులకు ఇది వణుకు పుట్టించింది. అంతేగాక, నరేంద్రమోడీ ప్రభుత్వం, బీజేపీ

ఎన్నికల సంఘటనకు మించి, వివిధ రాష్ట్రాలలో, దేశం వ్యాపితంగా ప్రజలను దహిస్తున్న జీవనోపాధి సమస్యలపై పోరాటాలను అభివృద్ధి చేయటంలోను, వామపక్ష ప్రజాస్వామ్య ఫ్రంట్ నిర్మించటంలో ఏప్రిల్ 5 ర్యాలీ, నిర్ణయాత్మకమైనది. రైతుల, కార్మికుల ఐక్యపోరాట వేదికలైన సంయుక్త కిసాన్ మోర్చా, జాయింట్ ప్లాటు ఫామ్ ఆఫ్ సెంట్రల్ ట్రేడ్ యూనియన్స్‌లు మోడీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలను ఎండగట్టి, దానికి వ్యతిరేకంగా పోరాడటానికి అవసరమైన కార్యాచరణను ఇప్పటికే ప్రకటించాయి. ఇది భారత దేశ ప్రజానీకానికి, ముఖ్యంగా కష్టజీవులకు అందిస్తున్న స్పష్టమైన రాజకీయ మార్గనిర్దేశం. నయా ఉదారవాద దశను అధిగమించి, నిజమైన ఆర్థిక, రాజకీయ, సామాజిక స్వాతంత్ర్య సాధనకు ఇది మార్గం చూపుతుంది. ఆ మార్గంలోనే చారిత్మాత్మక ఏప్రిల్ 5 సామూహిక కార్యాచరణ విజయవంతానికి మనవంతు కర్తవ్యం నిర్వహిద్దాం.

- ఆర్ఎస్ఎస్‌లు కలిసి ప్రజలపై సాగిస్తున్న మతోన్మాద, నిరంకుశ దాడుల కీలక సందర్భంలో కార్మిక-కర్షక మైత్రిబంధం ప్రజాస్వామ్య పరిరక్షణలో నిర్ణయాత్మకంగా నిలిచింది.

2021లో కేరళలో ఎల్డీఎఫ్ తిరిగి ఎన్నిక కావడం అఖిల భారత స్థాయిలో కార్మిక, కర్షక ఉద్యమం సాధించిన నిర్ణయాత్మక విజయం. రోజు కూలీ కార్మికులకు అత్యధిక కనీస లెఫ్ట్ అండ్ డెమోక్రటిక్ ఫ్రంట్, వరి పండించే రైతులకు కనీస మద్దతు ధర కల్పించడంలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం కీలక పాత్ర పోషించింది. ఆర్ఎస్ఎస్-బీజేపీ నాయకత్వంలోని మోడీ ప్రభుత్వం కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని చూడటం, ఆర్థిక వనరులలో రావాల్సిన వాటాను నిరాకరించడం, కేరళ ప్రభుత్వం వివిధ అభివృద్ధి ప్రాజెక్టులపై బురదజల్లటం చేస్తున్నది. ప్రస్తుతం దేశ ఆర్థిక, రాజకీయ రంగాలలో ఆధిపత్యం వహిస్తున్న కార్పొరేట్లపై విజయం సాధించటానికి, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను, సమాఖ్యతత్వాన్ని, లౌకికపునాదిని కాపాడుకోవటానికై బీజేపీ-ఆర్ఎస్ఎస్‌లకు వ్యతిరేకంగా ఏర్పడిన ప్రజల ఉమ్మడి వేదికను కార్మికుల, రైతులు చొరవతో వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులు తమ అధీనంలోకి తెచ్చుకోవటం అవసరం.

ఈవిధంగా, ఎన్నికల సంఘటనకు మించి, వివిధ రాష్ట్రాలలో, దేశం వ్యాపితంగా ప్రజలను దహిస్తున్న జీవనోపాధి సమస్యలపై పోరాటాలను అభివృద్ధి చేయటంలోను, వామపక్ష ప్రజాస్వామ్య ఫ్రంట్ నిర్మించటంలో ఏప్రిల్ 5 ర్యాలీ, నిర్ణయాత్మకమైనది. రైతుల, కార్మికుల ఐక్యపోరాట వేదికలైన సంయుక్త కిసాన్ మోర్చా, జాయింట్ ప్లాటు ఫామ్ ఆఫ్ సెంట్రల్ ట్రేడ్ యూనియన్స్‌లు మోడీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలను ఎండగట్టి, దానికి వ్యతిరేకంగా పోరాడటానికి అవసరమైన కార్యాచరణను ఇప్పటికే ప్రకటించాయి. ఇది భారత దేశ ప్రజానీకానికి, ముఖ్యంగా కష్టజీవులకు అందిస్తున్న స్పష్టమైన రాజకీయ మార్గనిర్దేశం. నయా ఉదారవాద దశను అధిగమించి, నిజమైన ఆర్థిక, రాజకీయ, సామాజిక స్వాతంత్ర్య సాధనకు ఇది మార్గం చూపుతుంది. ఆ మార్గంలోనే చారిత్మాత్మక ఏప్రిల్ 5 సామూహిక కార్యాచరణ విజయవంతానికి మనవంతు కర్తవ్యం నిర్వహిద్దాం.

'దసరా'లో ఆ సీన్ తొలగించాలి..

మార్చి 30న విడుదలైన దసరా సినిమా కథ, కథాంశాలు చిత్రీకరణ, ఆటలు, మాటలు, సంగీతం గురించి పక్కన పెడితే అందులో అంగన్‌వాడీలను అవమానించే సన్నివేశాలను పెట్టడం ఎంత మాత్రం సరికాదు. హీరోయిన్‌గా నటించిన కీర్తి సురేష్ పాత్ర పేరు వెన్నెల ఓ పల్లెటూరులో అంగన్‌వాడీ టీచర్‌గా పాత్ర పోషించారు. చాలా ఒదిగిపోయి బాగా నటించారు కూడా. వెన్నెల చిన్నారులకు చదువు చెప్పడంతో పాటు మల,మూత్రాలు కడిగే సన్నివేశాలను సినిమాలో బాగానే చూపించారు. కానీ డైరెక్టర్ అంగన్‌వాడీ పాత్రను ఇంకాస్తా సేవా దృక్పథంతో చూపించాల్సింది పోయి అవమానపరిచే విధంగా చిత్రీకరణ చేశారు. ఈ సినిమాలో వెన్నెల పాత్రలో ఉన్న అంగన్‌వాడీ టీచర్ కేంద్రం మూసేసిన తర్వాత సాయంత్రం తాళం పగలగొట్టి అందులో ఉన్న కోడి గుడ్లు, ఇతర వస్తువులను తన చీర కొంగులో దాచుకొని దొంగచాటుగా బయటికి వెళ్లే ప్రయత్నం చేస్తుంది. ఆ సందర్భంలో హీరోతో పాటు తన స్నేహితుడు అక్కడికి వచ్చి కోడిగుడ్లు దొంగిలిస్తున్నారని అవమానకరంగా మాట్లాడు తారు. బయట సమాజంలో గుడ్లు ఇవ్వకుండా దొంగి లిస్తున్నారని తప్పుడు భావన సినిమా ద్వారా చెప్పడం అభ్యంతరకరం.

గతంలో సినిమాలు తీస్తే అందులో మంచి సందేశాలు ఉండేవి. సమాజానికి చాలా ఉపయోగపడేవి.కానీ ఇప్పుడు లాభాపేక్షతో జరగనవి జరిగినట్టుగా ఊహాజనితంగా చిన్న విషయాల్ని పెద్దగా చూపి ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా చూపడం ద్వారా కులాలు, మతాలు, వృత్తులు ఇలా చాలాసార్లు వారి మనోభావాలు దెబ్బతిన్నాయి. తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన సినీ పెద్దలు రోజురోజుకూ తమ సినిమా సక్సెస్ కోసం కొంతమందిని కించపరుస్తూ చిత్రీకరిస్తున్నారు. దానికి ఉదాహరణ దసరా సినిమాలో అంగన్‌వాడీలో చోరీ సన్నివేశం. సమాజంలో పేదల సొమ్మును అందినకాడికి దండుకుని, ప్రభుత్వ పెద్దలతో కలిసి కోట్ల రూపాయలకు పడగలెత్తిన అక్రమార్కుల పట్ల ఎలాంటి పట్టింపు లేదు. గనులు, ల్యాండ్, మైనింగ్ ఇలా అనేకమైన మాఫియాలతో లక్షల కోట్ల రూపాయల ప్రజా సంపదను లూటీ చేస్తున్నారు. వాటిని లోతైన పరిశోధన చేసి ప్రజల పక్షాన కథలు రాసి సినిమాలు తీయాల్సిన దర్శకులు, నిర్మాతలు 'దసరా' వంటి సినిమాలో అంగన్‌వాడీ టీచర్ దొంగతనానికి పాల్పడే సీన్ తీయడం బాధాకరం. దేశ జనాభాలో సగం భాగమైన మహిళలు పేదరికం వల్ల రక్తహీనత, పౌష్టికాహారం లోపంతో బాధపడు తున్నారు. చిన్నారులు కూడా దాదాపు 60శాతం ఇదే సమస్యతో ఉన్నారు. దీన్ని అధిగమించడం కోసం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా 75లక్షల మంది అంగన్‌వాడీలు సేవలందిస్తున్నారు. చిన్న పిల్లలు, బాలింతలు గర్భిణులకు గుడ్లు, ఆహారం, మందులు ఇవ్వడంతో పాటు చిన్నపిల్లల్లో విద్యాభ్యాసం పట్ల ఆసక్తి చూపించడం కోసం ప్రాథమిక విద్యను కూడా అంగన్‌వాడీలు నేర్పుతున్నారు. బాలింతలకు కూడా తగిన ఆహారం ఇవ్వడంతో పాటు తల్లిపాల ప్రాధా న్యతను వివరిస్తూ సేవలందిస్తున్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఇతర ఆరోగ్యపరమైన క్యాంపులలో, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వీరి పాత్ర చాలా కీలకం. ఇలాంటి వారిని దసరా సినిమాలో అవమానించడం శోచనీయం. సెన్సార్ బోర్డు వారు సినిమాలో కోడిగుడ్లను చోరీ చేసే సీన్‌ను వెంటనే తొలగించాలి. సినిమా డైరెక్టర్, నిర్మాత అంగన్‌వాడీలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలి.




ఎం. వరుణమ్మ

సెల్:8184899654

పెట్టుబడిదారీ వ్యవస్థ పట్ల భ్రమ

పెట్టుబడిదారీ విధానం మొదలైన తొలి కాలంలో అది నిరుద్యోగాన్ని పెంచుతుందని, దాని వలన పేదరికం పెరుగుతుందని, కాని, మొదట్లో కలిగిన ఈ నష్టాన్ని ఆ తర్వాత అది అభివృద్ధి చెందుతున్న కాలంలో పూడ్చి వేస్తుందని చాలామందిలో ఒక అభిప్రాయం ఉంది. మొదట్లో ఉపాధి పోగొట్టు కున్నవారంతా ఆ తర్వాత కాలంలో ఉద్యోగాలు పొంది కార్మికులుగా తిరిగి పనుల్లో చేరుతారని, నిరుద్యోగం తగ్గడంతో వేతనాలు పెరగడం ప్రారంభమవుతుందని, వేతనాలు పెరుగుతున్నకొద్దీ కార్మికుల ఉత్పాదకత కూడా పెరుగుతుందని వారు భావిస్తారు.

గత చరిత్ర అనుభవాలు కూడా ఈ అభిప్రాయాన్నే బలపరుస్తున్నట్టు పైకి చూస్తే అనిపిస్తుంది కూడా. మార్క్సిస్టు చరిత్రకారుడు ఎరిక్ హాబ్స్‌బామ్ అంచనా ప్రకారం పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం మొదలైన తర్వాత బ్రిటన్‌లో నిరుద్యోగం పెరిగింది. కాని 19వ శతాబ్దపు నడిమి కాలం నాటికల్లా పరిస్థితులు మెరుగుపడ్డాయి. కార్మికవర్గానికి అనుకూలంగా మారాయి. ఈ విధమైన దృక్పథం ఉంటే పెట్టుబడిదారీ విధానానికి పరివర్తన చెందే సమయంలో ఎన్ని కష్టాలు కలిగినా, ఆ తర్వాత పెట్టుబడిదారీ విధానం వలన కార్మికులకు కూడా ప్రయోజనాలు ఉంటాయి అన్న నిర్ధారణకి వస్తాం. ఈ విధమైన అవగాహన మొత్తంగానే తప్పు. పెట్టుబడిదారీ విధానం తాను తొలుత కార్మికవర్గానికి కలిగించిన నష్టాన్ని ఆ తర్వాత కాలంలో పూడ్చి వారికి మెరుగైన పరిస్థితులు కల్పిస్తుంది అని భావించడానికి ఎటువంటి సిద్ధాంత ప్రాతిపదికా లేదు. కార్మికుల స్థితిగతులలో తర్వాత కాలంలో కనిపించిన మెరుగుదలకు, పెట్టుబడిదారీ విధానపు సహజ సద్యోజనిత స్వభావానికి ఎటువంటి సంబంధమూ లేదు.




ప్రభాత్ పట్నాయక్

ఇంగ్లీషు ఆర్థికశాస్త్రవేత్త డేవిడ్ రికార్డో పరిశ్రమల్లో యంత్రాలను వినియోగించడం మొదలుపెట్టిన తొలిరోజుల్లో ఈ విధమైన వాదన ముందుకు తెచ్చాడు. మొదట్లో యంత్రాల వలన కార్మికులు ఉద్యోగాలు కోల్పోయి కష్టాలపాలౌతారని, కాని ఆ తర్వాత లాభాలరేటు పెరిగి పెట్టుబడి ఎక్కువగా పోగుబడుతుందని, దానితో మరిన్ని ఎక్కువ పరిశ్రమలు వస్తాయని, వాటిలో గతంలో ఉద్యోగాలు పోగొట్టుకున్నవారందరికీ మళ్ళీ ఉపాధి లభించడమేగాక వారి స్థితిగతులు బాగా మెరుగు పడతాయని రికార్డో ప్రతిపాదించాడు. కార్మికుల జనాభా మరీ ఎక్కువగా పెరిగిపోకుండా ఉండేవిధంగా వాళ్ళు తమను తాము నియంత్రించుకుంటే వారి వేతనాలు పెంచుకోవచ్చునని కూడా ఆయన చెప్పాడు.

రికార్డో వాదనలో రెండు లోపాలు ఉన్నాయి. పరిశ్రమల్లో యంత్రాలను ప్రవేశపెట్టడం అనేది ఒకే ఒక్కమారు జరిగే ప్రక్రియగా ఆయన అభివర్ణించాడు. కాని వాస్తవంగా పెట్టుబడిదారీ వ్యవస్థలో కొత్త కొత్త యంత్రాలను, నూతన ఉత్పత్తి ప్రక్రియలను ప్రవేశపెట్టడం అనేది నిత్యం జరుగుతూనేవుంటుంది. యంత్రాలను మొదట ప్రవేశపెట్టినప్పుడు పెట్టుబడిదారుల లాభాల రేటు పెరగడం అనేది జరిగినా, వారివద్ద పెట్టుబడి ఎక్కువగా పోగుబడినా, దాని ఫలితంగా అంతకుముందు కోల్పోయిన ఉద్యోగాలన్నీ మళ్ళీ రావడం అనేది ఎన్నటికీ జరగదు. ఎందుకంటే ఈ లోపునే మళ్ళీ కొత్త యంత్రాలను ప్రవేశపెట్టడం అనేది జరిగిపోతూవుంటుంది.

అందుచేత ఈ విషయాన్ని నిరంతరం మారుతూవుండే క్రమంలోనే చూడాలి. పరిశ్రమల్లో పెట్టే పెట్టుబడి వృద్ధిచెందే రేటు 'జి' అనుకుందాం. అప్పుడు ఉత్పత్తి వృద్ధిరేటు కూడా 'జి' యే ఉంటుంది. (ఒకవేళ సాంకేతిక పరిజ్ఞానం పెంచడం కోసం అదనపు పెట్టుబడి పెట్టినా, దాని వలన శ్రామికులకు చెల్లించే వేతనాలు ఆ మేరకు తగ్గుతాయే కాని ఉత్పత్తి అయే సంపదలో వృద్ధిరేటు మాత్రం పెట్టుబడిలో వృద్ధిరేటు ఎంత ఉంటుందో, అదే మోతాదులో ఉంటుంది) శ్రామిక ఉత్పాదకత వృద్ధిరేటు 'పి' అనుకుందాం. అప్పుడు అదనపు కార్మికుల అవసరం పెరిగే రేటు జి-పి ఉంటుంది. కార్మికుల జనాభా పెరిగే రేటు 'ఎన్' అనుకుంటే జి-పి కన్నా ఎన్ తక్కువ ఉన్నప్పుడే నిరుద్యోగం తగ్గుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో జి-పి విలువ ఎన్ ను దాటి ఉండేట్టు చూసే ఏర్పాటు ఏదీ లేదు. కార్మికుల ఉత్పాదకత పెరుగుతూ మరోవైపు నిరుద్యోగం రేటు కూడా పెరుగుతూవుంటే (అప్పుడు వేతనాల రేటు కనీస స్థాయిలోనే ఎప్పుడూ ఉండిపోతుంది) లాభాల రేటు పెరుగుతూపోతుంది. దానివలన అదనపు పెట్టుబడి పోగుబడుతుంది. దానిని వినియోగించినప్పుడు కొత్త ఉద్యోగాలు వస్తాయి. అప్పుడునిరుద్యోగం పడిపోతుంది. - రికార్డోను



సమర్థించేవారి వాదన ఈ విధంగా ఉంటుంది. ఇక్కడే రికార్డో వాదనలోని రెండో సమస్య ముందుకొస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి అయే సరుకులకు డిమాండు ఎప్పుడూ పెరుగుతూనేవుంటుంది అని రికార్డో భావించాడు. అందువలన ఉత్పత్తి పెరిగితే దాని ఫలితంగా లాభాలు పెరుగుతాయని, దానివలన అదనపు పెట్టుబడి పోగుబడుతుందని, ఈ ప్రక్రియకు ఎటువంటి ఆటంకమూ ఉండదని అతను భావించాడు. "సరుకులు ఎంత ఎక్కువగా మార్కెట్‌లోకి వస్తే అంత ఎక్కువ డిమాండ్ వాటికి ఉంటుంది" అన్న సూత్రాన్ని అతను విశ్వసించాడు. కాని లాభాలు రావాలంటే ఎక్కువ సరుకులు ఉత్పత్తి చేసినంతమాత్రాన సరిపోదు. అవన్నీ అమ్ముడుపోయినప్పుడే వాస్తవంగా పెట్టుబడిదారుడికి లాభం పోగుపడుతుంది. ఉత్పత్తి అయిన సరుకులన్నీ అమ్ముడుపోవాలంటే అది కొనుగోలుశక్తిని బట్టి ఉంటుంది. కొనుగోలుశక్తి వేతనాల రేటుని బట్టి ఉంటుంది. మరి వీలైనంత తక్కువ స్థాయిలో వేతనాలను ఉంచాలని పెట్టుబడిదారులు నిరంతరం ప్రయత్నిస్తూ ఉన్నప్పుడు మార్కెట్‌లో డిమాండ్ నిరంతరం పెరగడానికి గ్యారంటీ ఏమిటి? అందుచేత సాంకేతిక పరిజ్ఞానం పెరిగి దాని ఫలితంగా నిరుద్యో గం పెరిగితే, ఆ విధంగా ఉద్యోగాలను పోగొట్టుకున్న వారిని తిరిగి ఉద్యోగాలలో పెట్టుకోడానికి పెట్టుబడి దారీ వ్యవస్థలో ఎటువంటి ఏర్పాటూ లేదు. అందుచేత పెట్టుబడిదారీ విధానం ప్రారంభదినాల్లో కార్మికులకు నష్టం కలిగించినా, తర్వాత అది పుంజు ఒకున్నాక కార్మికులకు మేలు జరుగుతుందన్న రికార్డో వాదనకు ఎటువంటి సైద్ధాంతిక ప్రాతిపదికా లేదు.

కాని వాస్తవ చరిత్ర చూస్తే సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందడం జరిగాక అక్కడి కార్మికుల స్థితిగతులు మెరుగుపడ్డాయి. దీనిని ఎలా అర్థం చేసుకోవాలి? యూరప్ ఖండంలోని కార్మికులు చాలా భారీ సంఖ్యలో "కొత్త ప్రపంచానికి" (అంటే అమెరికా ఖండానికి) వలసలు పోయారు. ఈ వలసలు మొదటి ప్రపంచయుద్ధం మొదలయేదాకా (1914) కొనసాగాయి. 19వ శతాబ్దంలో నెపోలియన్ యుద్ధం నాటినుండి మొదటి ప్రపంచయుద్ధం దాకా మధ్య కాలంలో దాదాపు 5కోట్లమంది యూరోపియన్ కార్మికులు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా వంటి దేశాలకు వలసలు పోయారని ఆర్థికవేత్త ఆర్థర్ లూయిస్ అంచనా వేశాడు.

ఈ వలసలు "అధికవేతన" వలసలు. అంటే ఆ కార్మికులు అంతవరకూ ఉండిన స్వస్థలాల్లోనూ, అదే విధంగా వాళ్ళు వలసలు పోయిన కొత్త ప్రదేశాల్లోనూ వేతనాలు అధికస్థాయిలో ఉన్నాయి. ఇదే కాలంలో "అల్పవేతన" వలసలు కూడా మరోవైపు కొనసాగాయి. ఈ రెండో తరహా కార్మిక వలసలు ఉష్ణ, సమశీతోష్ణ ప్రదేశాలైన ఇండియా, చైనా వంటి దేశాలనుండి ఫిజీ, మారిషస్, వెస్ట్ ఇండీస్, తూర్పు ఆఫ్రికా, నైరుతి అమెరికా వంటి ఉష్ణ, సమశీతోష్ణ ప్రదేశాలకు జరిగాయి. ఇక్కడ ఆ కార్మికుల స్వంత దేశాలలోనూ, వాళ్ళు వలసలు వచ్చిన దేశాల్లోనూ వేతనాలస్థాయి తక్కువగానే ఉంది. ఈ కార్మికులను శ్వేతజాతి కార్మికులు వలసలు వచ్చిన ప్రదేశాలకు రానివ్వలేదు. (ఇప్పటికీ కోరుకున్నవారందరినీ అక్కడికి వలసలు రానివ్వడం లేదు)

సామ్రాజ్యవాద దోపిడీ పద్ధతుల కారణంగా ఒకానొక ప్రత్యేక, చారిత్రక పరిస్థితుల్లో యూరప్ ఖండంలోని కార్మికుల స్థితిగతులు పైన వివరించిన విధంగా మెరుగుపడడం సంభవించిందే తప్ప అదేదో పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమంలో జరిగినది కాదు. దీనిని బట్టి యూరప్ ఖండంలోని కార్మికులు సామ్రాజ్యవాద దోపిడీ పట్ల మెతకగా ఉంటారన్న అభిప్రాయానికి రాకూడదు. సామ్రాజ్యవాద దోపిడీ విధానం నడిచే తీరు . ఇలానే ఉంటుంది.

ఇలా ఒకవైపు అధికవేతన వలసలు, మరోవైపు అల్పవేతన వలసలు ఎందుకు జరిగాయి? దీనికి లూయిస్ చెప్పిన సమాధానం ఏమిటంటే, ఆ కాలంలో బ్రిటన్‌లో వ్యవసాయ విప్లవం జరిగి, తక్కిన యూరప్‌కంతటికీ విస్తరించింది అని, దాని వలన గ్రామీణ కార్మికులకు యూరప్‌లో ఆదాయాలు బాగా పెరిగాయని అతను అన్నాడు. కాని ఆ విధమైన వ్యవసాయ విప్లవం ఏదీ బ్రిటన్‌లో జరిగిన దాఖలాలు లేవు. మరి అసలు కారణం ఏమిటి? అధికవేతన వలసల విషయంలో జరిగినదేమంటే యూరప్ నుండి వలసలు పోయినవారు అమెరికా, ఆస్ట్రేలియా తదితర ప్రదేశాలలోని స్థానికులను వారి వారి భూములనుండి తరిమివేసి ఆక్రమించుకుని వ్యవసాయదారులుగా స్థిరపడి అధిక ఆదాయాలు ఆర్జించసాగారు. మరోవైపు యూరప్‌లో కార్మికవర్గం సంఖ్య వలసల కారణంగా తగ్గిపోయింది. అందుచేత ఇక్కడ కూడా కార్మికుల వేతనాలను పెంచకతప్పలేదు. ఒక శీతల దేశం నుండి మరొక శీతల దేశానికి జరిగిన వలసలు భారీ స్థాయిలో ఉన్నాయి. 1820 నుండి 1915 మధ్య బ్రిటన్‌లో ఎంత మేరకు జనాభా పెరిగిందో, అందులో సగం మేరకు అక్కడినుండి వలసలు పోయారు. ఇటువంటి స్థాయిలోనే మన దేశంలో కూడా వలసలు జరిగివుంటే స్వతంత్రం వచ్చిన తర్వాత ఇప్పటివరకూ దాదాపు 50 కోట్ల మంది వలసలు పోయివుండాలి. (యూరప్‌లో జరిగిన వలసల ప్రభావం ఎంత బలంగా ఉండిందో బోధపడడానికి ఈ పోలిక చూపడం జరిగింది.) ఆ విధంగా ఇతర దేశాలకు తరలిపోవడానికి యూరోపియన్ కార్మికులకు లభించిన అవకాశాలు వారి స్థితిగతులు బాగా మెరుగుపడడానికి దోహదం చేశాయే తప్ప పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి క్రమంలో స్వతఃసిద్ధంగా కార్మికుల స్థితి గతులను మెరుగుపరిచే ఏర్పాటు అంటూ ఏదీ లేదు. ఇలా వేరే దేశాలకు పోయి అక్కడి స్థానికులను వెళ్ళగొట్టి వారి భూములను ఆక్రమించుకునే అవకాశం సామ్రాజ్యవాద దురాక్రమణ స్వభావం నుంచి వచ్చింది.

సామ్రాజ్యవాద దోపిడీ పద్ధతుల కారణంగా సంపన్న దేశాలలోని కార్మికుల స్థితిగతులు మెరుగుపడే అవకాశం వచ్చింది. ఇది కేవలం స్థానికులనుండి భూములను లాక్కోవడం ద్వారా మాత్రమే కాదు. సంపన్నదేశాలలో ఉత్పత్తి అయిన సరుకులకు డిమాండ్ కల్పించడానికి, తద్వారా సంపన్న దేశాలలో అదనపు ఉద్యోగాలు కల్పించడానికి సామ్రాజ్యవాదులు తాము ఆక్రమించుకున్న వలసలలో చేతివృత్తిదారులను, చిన్న తరహా ఉత్పత్తిదారులను భారీ స్థాయిలో దెబ్బ తీశారు. అంటే ఒకవిధంగా సామ్రాజ్యవాదం సంపన్నదేశాలలోని నిరుద్యోగాన్ని వలసదేశాలలోకి ఎగుమతి చేసిందన్నమాట. ఆ వలసదేశాలకు తమ తమ ఆర్థిక వ్యవస్థలను కాపాడుకోగలిగిన సత్తా లేదు. అవన్నీ సంపన్నదేశాల ఆధీనంలోనే ఉండేవి.

అందుచేత పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందితే మొదట్లో కార్మికులు నష్టపోయినా, ఆ తర్వాత వారూ ప్రయోజనం పొందుతారన్న అభిప్రాయం పూర్తిగా తప్పు. సామ్రాజ్యవాద దోపిడీ పద్ధతుల కారణంగా ఒకానొక ప్రత్యేక, చారిత్రక పరిస్థితుల్లో యూరప్ ఖండంలోని కార్మికుల స్థితిగతులు పైన వివరించిన విధంగా మెరుగుపడడం సంభవించిందే తప్ప అదేదో పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమంలో జరిగినది కాదు. దీనిని బట్టి యూరప్ ఖండంలోని కార్మికులు సామ్రాజ్యవాద దోపిడీ పట్ల మెతకగా ఉంటారన్న అభిప్రాయానికి రాకూడదు. సామ్రాజ్యవాద దోపిడీ విధానం నడిచే తీరు . ఇలానే ఉంటుంది.

(స్వేచ్ఛానుసరణ)



పద్మ లక్ష్మి... ఓ అడుగు ముందుకేసింది. కనిపించని వివక్షను బద్దలు కొట్టింది. ట్రాన్స్ కమ్యూనిటీకి దిగ్గజంగా గుర్తింపు తెచ్చుకుంది. కేరళ రాష్ట్రంలో లాయర్‌గా నమోదు చేసుకున్న తొలి ట్రాన్స్‌జెండర్‌గా చరిత్ర సృష్టించింది. ఆ వివరాలేంటో, దాని వెనుక ఆమె పడ్డ కష్టమేంటో మనమూ తెలుసుకుందాం...

కేరళకు ఆశా కిరణం



గత నెల మార్చి 19న తన గురించి పత్రికలో వచ్చిన వార్తను చదవకూడదని నిర్ణయించుకుంది. పైగా ఇంటికి వెళ్లి ప్రశాంతంగా నిద్ర పోయింది. "మరుసటి రోజు నా కోసం ఒక కొత్త అధ్యాయం వేచి ఉంది. నేను నా కొత్త బాధ్యతలను నెరవేర్చేటందుకు రాబోయే రోజుల్లో అనేక నిద్రలేని రాత్రులు ఉంటాయని నాకు తెలుసు" అని కేరళలో లాయర్‌గా నమోదు చేసుకున్న మొదటి ట్రాన్స్‌జెండర్ అయిన పద్మ అన్నారు.

ఆనందంతో కన్నీళ్లు పెట్టుకున్నారు...

ఎర్నాకులం గవర్నమెంట్ లా కాలేజీ నుండి ఫిజిక్స్‌లో బీఎస్సీ పూర్తి చేశారు పద్మ. తన సాధించిన ఈ విజయానికి తన తల్లిదండ్రులకు రుణపడి ఉన్నానని, వారు అన్నింటిలో తనకు అండగా నిలిచారని ఆమె అన్నారు. "నేను లాయర్‌గా మొదటి రోజు నల్లని కోటును ధరించిన ప్పుడు మా నాన్న ఆనందంతో కన్నీళ్లు పెట్టుకున్నారు. అయన నాతో చెప్పాడు 'నువ్వు ఉత్సాహంతో ముందుకు వెళ్ళు. నువ్వు ఎప్పుడూ తల ఎత్తుకునే వుండాలి. ఎవరి ముందు తలవంచాల్సిన అవసరం లేదు' అన్న తండ్రి మాటలు ఆ యువ న్యాయవాది గుర్తు చేసుకున్నారు.

ఏది ఏమైనా ఆమె మా బిడ్డ...

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో మాజీ కాంట్రాక్ట్ ఉద్యోగి అయిన తండ్రి మోహన కుమార్ తన పరివర్తన ప్రయాణంలో వచ్చిన మార్పుల గురించి అన్న మాటలను గుర్తుచేసుకుంటూ 'ఏమైనప్పటికీ ఆమె మా బిడ్డ... మేము ఆమెను రక్షిస్తాము, అవసరమైన మద్దతు ఇస్తాం. అప్పుడే ఆమెను ఇతరులు అంగీకరిస్తారు. పద్మకు ఇద్దరు అక్కలు. అశ్వతీ మోహన్ అకౌంటెంట్‌గా చేస్తుండగా, రెండవ అక్క అర్చన మోహన్ సెయింట్ జేవియర్స్ కాలేజీలో మలయాళ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేస్తున్నారు. పద్మ ట్రాన్స్ ఉమెన్‌గా మారే ప్రయాణం అంత సులభంగా జరగలేదు. ఆమె విద్యా విజయం అన్నింటికంటే మించిపోయింది. కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (CLAT)కి సిద్ధమయ్యేలా ప్రోత్సహించినందుకు ఆమె తన తల్లి జయ మోహన్‌కు, న్యాయవాది అబ్దుల్ హకీమ్‌కు ఆమె తన విజయ ఘనతను ఇచ్చారు.



నిరంతరం ఆందోళన చెందాను...

"నేను ఎడపల్లి చర్చి వద్ద నిశ్శబ్ద ప్రదేశంలో కూర్చుని CLAT కోసం సిద్ధమయ్యాను. దీనికోసం ప్రత్యేకంగా ఎలాంటి కోచింగ్ తీసుకోలేదు" అన్నారు పద్మ. 2019లో మొదటి అలాట్‌మెంట్‌లోనే తనకు ప్రవేశం లభించింది. పద్మ లా కాలేజీలో చేరే సమయానికి హార్మోన్ థెరపీతో పాటు ఇతర వైద్య చికిత్సను ప్రారంభించారు. "నా శరీరం చాలా మార్పులకు గురైంది. ఇతర విద్యార్థులు నా గురించి ఏమనుకుంటారో అని నిరంతరం ఆందోళన చెందుతూ ఉండేదాన్ని. చివరగా నా అభిమాన ఉపాధ్యాయునితో (ఎర్నాకులం లా కాలేజీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మరియమ్మ A K) నా భయం గురించి మాట్లాడాలని నిర్ణయించుకున్నాను. నా ఆందోళన విన్న తర్వాత ఆమె 'నువ్వు ఎందుకు బాధపడాలి? ఇతరుల గురించి ఎందుకు బాధపడాలి? ధైర్యంగా ముందుకు సాగండి. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ తప్ప మరెవరూ రచించని సమానత్వ పుస్తకం(రాజ్యాంగం)తో మీరు సాయుధమయ్యారు' అన్నారు. ఆమె మాటలు చాలా సానుకూలంగా ఉన్నాయి. మిగతా టీచర్ల నుంచి కూడా ఇదే ప్రోత్సాహం లభించింది" అని పద్మ తన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

చరిత్రలో మొదటి వ్యక్తి...

"ఒక సీనియర్ నా సామర్థ్యాన్ని గ్రహించి, సమాజం కోసం పనిచేసే అవకాశం ఇస్తే నా బాధ్యతను నిర్వర్తిస్తాను" అని పద్మ అంటున్నారు. ఇప్పటివరకు తన ప్రయాణంలో తనకు లభించిన ప్రేమ, మద్దతుకు ఆమె ఎంతో ఆనందంగా వున్నారు. లాయర్‌గా తన మొదటి రోజున తన శ్రేయోభిలాషులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆమెను అభినందించిన వారిలో కేరళ పరిశ్రమలు, న్యాయ శాఖ మంత్రి పి. రాజీవ్, కేరళ ఉన్నత విద్య, సామాజిక న్యాయ శాఖ మంత్రి ఆర్.బిందు ఉన్నారు. తన ఇన్‌స్టాగ్రామ్‌లో పద్మ చిత్రాన్ని పంచుకుంటూ రాజీవ్ "చరిత్రలో మొదటి వ్యక్తి కావడం ఎల్లప్పుడూ కష్టతరమైన విజయం. ఈ వృత్తిలో తన పూర్వీకులు ఎవరూ లేరు. అడ్డంకులు చాలా ఉంటాయి. నిరుత్సాహపరిచే వ్యక్తులూ ఉంటారు. ఇన్ని అడ్డంకులను అధిగమించి న్యాయ చరిత్రలో పద్మాలక్ష్మి తన పేరును లిఖించుకుంది అన్నారు. బిందు ట్వీట్ చేస్తూ "పద్మ లక్ష్మి పేరు ఇప్పుడు కేరళ చరిత్రలో నిలిచిపోతుందనడం చాలా గర్వించదగిన విషయం. ఈ ప్రయాణంలో ఆమె ఎన్నో అడ్డంకులను ఎదుర్కొందనడంలో సందేహం లేదు. కానీ ఆమె పట్టుదలగా ఉంది. ఎవరూ ఆమెను వెనక్కు లాగలేరు. పద్మాలక్ష్మి ఇప్పుడు కేరళకు ఆశాకిరణం..." అన్నారు



ఇది నా పోరాటమే కాదు...

న్యాయవాదిగా వృత్తిని చేపట్టేందుకు తన ప్రయాణంలో ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి అడిగితే 20 సం॥ వయసులో ఉల్లాసంగా ఉన్న ఆమె "ఇది కేవలం నా పోరాటం కాదు. నా తల్లిదండ్రుల పోరాటం కూడా. నా మార్గాన్ని ఎంచుకునే విశ్వాసాన్ని వారు నాకు ఇచ్చారు. ఇలాగే తల్లిదండ్రులు తమ పిల్లలకు అండగా నిలబడితే మాలాంటి వాళ్ళను ఎగతాళి చేసేందుకు ఎవరూ సాహసించరు..." అన్నారు. తన యుక్త వయసులో పూర్తిగా గందరగోళానికి గురై శారీరక సమస్యలను ఎదుర్కొన్న పద్మకు స్నేహితులు కరువయ్యారు. అబ్బాయిలతో సహవాసం చేసినా కూడా ప్రశాంతంగా లేదు. తల్లిదండ్రుల పూర్తి మద్దతుతో హార్మోన్ థెరపీని ఎంచుకున్నారు. తన చికిత్సకు అవసరమైన డబ్బు కోసం ఆమె భీమా ఏజెంట్‌గా పని చేశారు. ఇంట్లో ట్యూషన్లు కూడా చెప్పారు.

ఉల్లాసంగా మారండి...



దేన్నైనా భారంగా అనుకున్నప్పుడే అయిష్టం పెరుగుతుంది. చాలామంది ఆఫీసు విషయంలో ఇలాగే భావిస్తారు. అందుకే ఉసూరుమంటూ పని ప్రదేశానికి వెళుతుంటారు. ఉద్యోగినిగా మనం ఎక్కువ సమయం గడిపే ప్రదేశమది. అలా భారంగా భావిస్తోంటే ఒత్తిడిగా అనిపిస్తుంది. అందుకే ఇలా ఉల్లాసంగా మార్చేసుకోండి...

❑ సమయంతో పరుగు మనకు ఇంటి నుంచే మొదలవుతుంది. దానికి ఆఫీసు పనీ తోడవుతుంది, దాంతో ఒత్తిడి సహజమే! కాబట్టి, ఉదయాన్నే కొద్దిసేపు వ్యాయామానికి కేటాయించండి. మెదడు ఉత్తేజితమై పని భారంగా తోయదు. సాయంత్రం ఆఫీసయ్యాక కొద్దిసేపు నడవండి. ఆఫీసు ఒత్తిడి ఇంటివరకూ వెళ్లదు.

❑ చుట్టూ నలుగురూ నవ్విస్తూ పలకరిస్తుంటే ఎంత బాగుంటుంది? అందుకే పరిచయాలను పెంచుకోండి. నవ్వుతూ పలకరించండి. తోటివారికి అవసరమైతే సాయం చేయండి. బంధాలు పెరుగుతాయి. మన అన్నవాళ్లు పక్కనుంటే ఎంత కష్టమైనా దాటొచ్చు అంటారు పెద్దలు. అది ఇక్కడా వర్తిస్తుంది. ఈ నెట్‌వర్కింగ్ కెరియర్‌కీ ప్రయోజనకరమే.

❑ అభద్రతా భావం కూడా ఒత్తిడికి ఓ కారణం. కాబట్టి కెరియర్‌కు సంబంధించిన కొత్త విషయాలను తెలుసుకోండి. లేదూ కొత్త నైపుణ్యం, హాబీలపై దృష్టిపెట్టండి. కొత్త విషయం నేర్చుకుంటున్నానన్న ఆలోచన మనసుకు ప్రశాంతతనిస్తూనే ఆనందాన్నీ నింపుతుంది.

❑ గతంలో ఏం సాధించామని ఎవరూ పట్టించుకోరు. ఇప్పుడేంటి అనేదే చూస్తారు. కాబట్టి వెనక్కి చూస్తూ కూర్చోక ఇప్పుడు, ఈ క్షణాన్ని ఆస్వాదించడం మొదలుపెట్టండి. మీ సానుకూలతలు, దృష్టిపెట్టాల్సిన అంశాలేంటో సరిచూసుకోండి. దీనికోసం ఎవరి సాయమైనా తీసుకోవచ్చు కూడా.

❑ వెనకబడుతున్నా అని కంగారు పడటం, ఎవరో ఏదో అన్నారని మనసుకు తీసుకోవడం, కోపం పెంచుకోవడం వంటి వాటికి దూరంగా ఉండండి. ఇవి బుర్రను సానుకూలంగా ఆలోచించనీయవు. విభేదాలకూ దారితీస్తాయి. ఇక ఆ ప్రదేశం ఆనందంగా ఎలా అనిపిస్తుంది? చివరగా ఎక్కువ గంటలు పనిచేస్తేనే ఫలితం అన్న ధోరణి వద్దు. వీలైనంత త్వరగా పని ముగించుకునే విధానాలపై దృష్టిపెట్టండి. చాలావరకూ వ్యతిరేకత దూరమవుతుంది.

వేసవిలో చెమటతో తలకీ ఇబ్బందులెన్నో. చుండ్రు లాంటి ఎన్నో సమస్యలు చుట్టు ముడతాయి. వీటికి సహజ పద్ధతులతో పరిష్కారం పొందొచ్చంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం...



సహజ సిద్ధంగా...

❑ కొబ్బరినూనె, నిమ్మరసం సమపాళ్లలో కలిపి మాడుకు పట్టించాలి. 15 నిమిషాల తర్వాత తలను రసాయనాలు తక్కువగా ఉన్న షాంపూతో శుభ్రం చేసుకోవాలి. ఇది చుండ్రును తొలగించటమే కాక జుట్టు సహజంగా నిగనిగలాడేలా చేస్తుంది.

❑ పెరుగులో లాక్టిక్ యాసిడ్, ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. తాజా పెరుగును తలకు పట్టించండి. అది కురులకు రక్షణ కవచంలా సాయపడుతుంది. దీంట్లో కొద్దిగా మిరియాల పొడిని కలిపితే యాంటీ ఫంగల్‌గా పనిచేస్తుంది. 15నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. జుట్టుకు కావాల్సిన తేమ అందుతుంది.

❑ తాజా వేపాకులకు, నానబెట్టిన మెంతులు కలిపి మెత్తగా పేస్టు చేసుకొని తలకు పట్టించాలి. వీటిల్లోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు శిరోజాలు రాలడం, చిట్లడం వంటి సమస్యలను కూడా తగ్గిస్తాయి. లేకపోతే కొన్ని ఆకులను నీళ్లలో వేసి కాచి చల్లారిన తర్వాత వాటితో తలను కడిగినా చుండ్రు నుంచి పరిష్కారం లభిస్తుంది.

❑ కలబంద ఎన్నో చర్మ సమస్యలతోపాటు దురద, దద్దుర్లు వంటి వాటినీ తగ్గిస్తుంది. కలబంద గుజ్జును తలకు రాసుకోండి. అర్ధగంట తర్వాత గాఢత తక్కువగా ఉన్న షాంపూతో తలస్నానం చేస్తే సరి. మాడుకు చల్లదనాన్నివ్వడమే కాదు చుండ్రునూ తొలగించి, కురులను మెరిసేలా చేస్తుంది.

ఉద్యోగుల ఖర్చు పెరిగింది

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో ఉద్యోగుల ఖర్చు (ఎంప్లాయికాస్ట్) పెరిగిందనీ, అందువల్ల ఆరు శాతం ఫిట్‌మెంట్ మాత్రమే ఇవ్వగలమని టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)కి విజ్ఞప్తి చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సమ్మెలోకి వెళ్తామని ఇచ్చిన సమ్మె నోటీసును ఉపసంహరించుకోవాలని కోరుతూ ఆయన జేఏసీ నాయకత్వానికి సోమవారం లేఖ రాసారు. యాసంగి సీజన్ నడుస్తున్నందున రైతాంగానికి నాణ్యమైన కరెంటు అందించాల్సి ఉందనీ, పదవ తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయనీ, పలు ప్రభుత్వ పోటీ పరీక్షలకు అభ్యర్థులు చదువుకుంటున్నారనీ, సమ్మె వల్ల వీరందరికీ ఇబ్బందులు తలెత్తుతాయని ఆ లేఖలో పేర్కొన్నారు. 6 శాతం ఫిట్‌మెంట్ ఇస్తేనే విద్యుత్ సంస్థలపై ఏటా రూ.526 కోట్ల ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. 2014లో 30 శాతం, 2018లో 35 శాతం విద్యుత్ ఉద్యోగులకు వేతన సవరణ చేశామని గుర్తుచేశారు. ఉద్యోగుల ఖర్చు పెరిగితే, విద్యుత్ సంస్థలు ఆర్థికంగా మరింత దిగజారుతాయని హెచ్చరించారు. విద్యుత్ సంస్థలు 'ఎస్మా' పరిధిలో ఉన్నాయనీ, ఆరునెలలపాటు సమ్మెలపై నిషేధం ఉన్నదని గుర్తుచేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మరిన్ని చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామనీ, అందువల్ల సమ్మె నోటీసును ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అవినీతే అవరోధం

(మొదటిపేజీ తరువాయి)

అధికారులకు పతకాలను ప్రదానం చేశారు. డైమండ్ జూబ్లీ ఉత్సవాల స్మారకార్థం పోస్టల్ స్టాంపు, నాణెం విడుదల చేశారు. సీబీఐ కొత్త ట్విటర్ హ్యాండిల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ..కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)సత్యం, న్యాయానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారిందన్నారు. ఏదైనా కేసు పరిష్కారం కోసం సీబీఐకి అప్పగించాలనే డిమాండ్ ఇప్పటికీ వినిపిస్తూనే ఉందని అన్నారు. ఇలాంటి సంస్థలు లేకుండా అభివృద్ధి భారతాన్ని నిర్మించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. 'సీబీఐ ఎవరి మీద చర్యలు తీసుకున్నదో వారి గురించి మాట్లాడుతున్న వ్యక్తులు చాలా శక్తివంతులు. వాళ్ళు ప్రభుత్వంలో, వ్యవస్థలో ఏళ్ల తరబడి ఉన్నారు. ఈ రోజుకు కూడా వాళ్లు కొన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నారు. సీబీఐ అధికారుల్లారా మీ పని మీదే దృష్టి ఉంచండి. అవినీతిపరులైన ఏ ఒక్కరినీ వదలకండి. ఎంతటి శక్తివంతులైనా బెదరవలసిన పనిలేదు' అని హితబోధ చేశారు. బ్యాంకు మోసాల నుంచి వన్యప్రాణుల సంబంధిత మోసాల వరకూ కేసులు పెరుగుతుండటంతో సీబీఐ పని అనేక రెట్లు పెరిగిందన్నారు. ప్రజాస్వామ్యం, న్యాయానికి అవినీతి పెద్ద అవరోధమనీ, అవినీతి రహిత దేశాన్ని రూపొందించడమే సీబీఐ ప్రధాన బాధ్యత అని నొక్కి చెప్పారు. పేద ప్రజల హక్కులను అవినీతి ఊడలాక్కుంటుందని, అనేక మంది నేరగాళ్లుగా మారడానికి దారితీస్తుందని చెప్పారు. బ్లాక్ మనీ, బినామీ ఆస్తులపై తమ ప్రభుత్వం కొరడా ఝళిపించిందని, అవినీతికి దారితీసే పరిస్థితులపైనా పోరాడుతోందని అన్నారు. 'సీబీఐ పరిధి పెరిగింది. చాలా నగరాల్లో సీబీఐ ఆఫీసులు నెలకొల్పుతున్నాం. అవినీతి సాధారణ నేరం కాదు. దేశాభివృద్ధికి అవినీతి ప్రధాన శత్రువు. అవినీతిని కొందరు వారసత్వంగా భావిస్తున్నారు. 2014 తరువాత సీబీఐ స్వేచ్ఛగా పనిచేస్తోంది. అవినీతిపరులు భయపడుతున్నారు. గత ప్రభుత్వాలు అవినీతిని వ్యవస్థీకృతం చేశాయి. ఆర్థిక నేరగాళ్లు వేలకోట్లు కొల్లగొట్టి విదేశాలకు పారిపోయారు. బీజేపీ ప్రభుత్వం అవినీతిపై చిత్తశుద్ధితో యుద్ధం చేస్తోంది' అని స్పష్టం చేశారు. అవినీతిని సహించరాదనేది ప్రభుత్వం, ప్రజల కోరిక అని ఆయన చెప్పారు.

రాహుల్‌కు బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

తనకు విధించిన రెండేండ్ల శిక్షను నిలుపు చేయాలని, శిక్ష అమలుపై స్టే విధించాలని కోరుతూ రాహుల్ రెండు పిటిషన్లు పెట్టుకున్నారు. ఎదుటిపక్షం వాదనలు వినకుండా ఆదేశాలు జారీ చేయలేమని అంటూ రాహుల్ పెట్టుకున్న పిటిషన్‌పై విచారణను ఏప్రిల్ 13కి వాయిదా వేసినట్లు అదనపు సెషన్స్ న్యాయమూర్తి ఆర్.పి.మొగెరా తెలిపారు.

పేదలకు దారి చూపేది ఎర్రజెండానే

● మానుకోట
తహసీల్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-మహబూబాబాద్

పేదల ఇంటి నిర్మాణానికి దారి చూపేది ఎర్రజెండేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పేదలు వేసుకున్న 1,50,000 గుడిసెల ఇండ్ల స్థలాలకు పట్టాలివ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదల ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు మొత్తం రూ.15 లక్షలు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలను వెలికి తీసి బోర్డులు పెట్టాలని కోరారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పేదలు వేసుకున్న గుడిసెలకు 58 జీవో ప్రకారం వెంటనే పట్టాలివ్వాలనీ, 59 జీవో ప్రకారం 500 గజాల భూమి వరకు పాత నామినల్ రుసుముతో రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్‌లో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఐదు వేల మందితో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య అధ్యక్షతన నిర్వహించిన సభలో తమ్మినేని మాట్లాడారు.

రాష్ట్రంలో పేదలకు సొంతింటి కల కలగానే మిగిలిపోయిందన్నారు. గత ఎన్నికలకు ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు భార్యాపిల్లలు లేరని చెప్పుకుంటున్న నరేంద్ర మోడీ 300 కోట్లతో ఇల్లు కట్టుకుంటున్నారనీ, పేదల ఇంటి నిర్మాణానికి మాత్రం 30 గజాలు ఇవ్వడానికి చేతులు రావడం లేదని విమర్శించారు. 2022 నాటికి దేశంలో పేదలందరికీ ఇందిరా ఆవాజ్ యోజన పథకం కింద ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించిన నరేంద్ర మోడీ ఎంతమందికి ఇండ్లు నిర్మించి ఇచ్చారని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోడీ తాను ఎంపీ పోసైనట్టు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఎన్నికల అఫిడవిట్లో సమర్పించినట్టు ప్రచారం జరుగుతున్నదనీ, దీనికి ప్రధాని ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. పొట్ట చేత పట్టుకొని పట్టణాలకు వలస వచ్చిన పేదలు ఇల్లు అద్దెకు తీసుకోవడం ఒక ఎత్తయితే, అద్దె కట్టుకోవడం మరొక సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబాబాద్ పట్టణంలో 5 వేల ఎకరాల ప్రభుత్వ భూములున్నాయనీ, వాటిని వెలికి తీసి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. మానుకోట తహసీల్దార్ కార్యాలయం అక్రమాలకు కేంద్రంగా మారిందనీ, అవినీతి అధికారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారిపై ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తానే స్వయంగా ఫిర్యాదు చేస్తానని తెలిపారు. కేసులకు, జైళ్లకు భయపడేది లేదనీ, పేదలకు ఇండ్ల స్థలాలు దక్కేంతవరకు సీపీఐ(ఎం) పోరాడుతుందని స్పష్టం చేశారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే.. పేదలకు భూములు ఇప్పించేందుకు ముందుకు రావాలన్నారు. చలిచీమలు ఏకమై పామును ఎదిరించినట్టుగా భూ పోరాటంలోని గుడిసె వాసులంతా ఐక్యంగా ఉండి అధికారులను ఎదిరించాలని పిలుపునిచ్చారు.

కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భూ పోరాటాలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. నాడు పార్టీ ఆధ్వర్యంలో వేసుకున్న గుడిసెల కాలనీలే నేడు మానుకోటలో పేదలకు అండగా నిలిచాయని అన్నారు. వరంగల్‌లో మాజీ మంత్రి హయగ్రీవాచారి ఆక్రమించుకున్న రూ.1000 కోట్ల విలువైన 22 ఎకరాల ప్రభుత్వ భూమిని కోర్టులో గెలిచి ప్రభుత్వానికి అప్పగించిన ఘనత సీపీఐ(ఎం)దేనని తెలిపారు. వరంగల్‌లో జక్కలొద్దిలో 250 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి పేదలతో గుడిసెలు వేయించినట్టు చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో చెరువు శిఖం, పంచరాయి, పోరంబోకు, బంజరు లాంటి ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూకబ్జాదారులు.. ఆక్రమించుకున్నారని, వాటన్నింటిని సర్వే చేసి వెలికితీయాలన్నారు. మానుకోటలో గుడిసెలు వేసుకున్న పేదలపైకి రెవెన్యూ అధికారులు పోలీసులను ఉసిగొల్పి లాఠీలతో రక్తం వచ్చేలా కొట్టించారన్నారు. కేసులు పెట్టి జైలుకు పంపారనీ, అయినా భయపడకుండా పోరాటాన్ని కొనసాగిస్తున్నారని చెప్పారు. అధికారులు, ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా భూ పోరాటాలు ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, నాయకులు గునిగంటి రాజన్న, అల్వాల వీరన్న, సమ్మెట రాజమౌళి, అల్లి శ్రీనివాస్ రెడ్డి, పాల బిందెల మల్లయ్య, హేమ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలు యథాతథం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మంగళవారం జరిగే పదో తరగతి పరీక్షను షెడ్యూల్ ప్రకారమే యథాతథంగా నిర్వహిస్తామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన స్పష్టం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఒక ప్రకటనలో తెలిపారు.

అనేక అనుమానాలు...

ప్రశ్నాపత్రం బయటకెళ్లిందని అంగీకరించినా ఎలాంటి నష్టం జరగలేదంటూ విద్యాశాఖ ప్రకటించడం పట్ల అనేక అనుమానాలు నెలకొన్నాయి. సీఎస్, డీవో, ఇన్విజిలేటర్లు పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు తీసుకెళ్లడం నిషేధం. అయినా ఆ ఇన్విజిలేటర్ మొబైల్ ఫోన్‌ను ఎలా తీసుకెళ్లారన్నది ప్రశ్నార్థకంగా మారింది. పరీక్ష ప్రారంభమైన తర్వాత 9.37 గంటలకే ప్రశ్నాపత్రం వాట్సాప్ ద్వారా బయటకెళ్లిందా? లేదంటే అంతకంటే ముందుగానే వేరే వాళ్లకు పంపించారా? అనే ప్రశ్న చాలా మందిలో ఉదయిస్తున్నది. ఇంకోవైపు బందెప్ప అనే ఇన్విజిలేటర్ సమ్మప్పకు పరీక్ష ప్రారంభమయ్యాక పంపించడానికి కారణమేంటి?. 9.35 గంటల తర్వాత విద్యార్థులెవరూ పరీక్ష కేంద్రంలోకి వెళ్లడానికి అవకాశం లేదు. పరీక్ష కేంద్రం నుంచి బయటికెళ్లడానికి కూడా వీల్లేదు. మరి ఏ ఉద్దేశంతో ప్రశ్నాపత్రాన్ని ఫొటో తీసి వాట్సాప్ ద్వారా పంపించారన్నది తెలియాల్సి ఉన్నది. పాఠశాల విద్యాశాఖ అధికారులు పదో తరగతి పరీక్షల నిర్వహణ పట్ల ఎంత బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారనే దానికి ఈ ఘటన నిదర్శనం. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

రెగ్యులర్ విద్యార్థుల్లో 99.60 శాతం హాజరు

పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2,652 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. రెగ్యులర్ విద్యార్థులు 4,85,954 మంది దరఖాస్తు చేసుకోగా, 4,84,019 (99.60 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. 1,935 (0.40 శాతం) మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ప్రయివేటు విద్యార్థుల్లో 1,096 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 866 (79.01 శాతం) మంది పరీక్ష రాశారని వివరించారు. 230 (20.99 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మొత్తం 4,87,050 మంది దరఖాస్తు చేసుకోగా, 4,84,885 (99.56 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. మొదటిరోజు పరీక్షకు 2,165 (0.44 శాతం) మంది గైర్హాజరయ్యారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు.

దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయం

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి కోసం చేపట్టిన గొర్రెల పంపిణీ కార్యక్రమం వారి ఆర్థిక స్వావలంబనకు దోహదం చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచిందని గుర్తుచేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో అధికభాగం లబ్దిదారులు బీసీ బిడ్డలే కావడం గొప్ప విషయమని వివరించారు. ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలు, ఆసరా ఫించన్లు, రైతుబంధు సహా అనేక పథకాలు బీసీల ఆత్మగౌరవాన్ని, ఆర్థిక గౌరవాన్ని పెంపొందించాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలతో తెలంగాణలో బీసీల స్థితిగతులు గుణాత్మకంగా పురోగమించాయని, వారి ప్రగతి సామాజిక ప్రగతికి బాటలు వేసిందని పేర్కొన్నారు. నేడు దేశ ఆర్థిక వ్యవస్థకే వెన్నుదన్నుగా నిలిచే రీతిలో తెలంగాణ సబ్బండ కులాలు ముందంజలో వున్నాయని వివరించారు. నాటి సాయుధపోరాట కాలం నుంచి నేటి మలి దశ తెలంగాణ ఉద్యమకాలం వరకు దొడ్డికొమురయ్య వంటి తెలంగాణ అమరుల త్యాగాలను నిత్యం స్మరించుకుంటూ, వారి ఆశయాల సాధనలో ముందుకు సాగుతున్నామని సీఎం తెలిపారు. అమరుల సంస్మరణార్థం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అమరజ్యోతి త్వరలోనే ప్రారంభం కానున్నదని సీఎం ప్రకటించారు.. దొడ్డి కొమురయ్య త్యాగానికి గుర్తుగా ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తూ ఘన నివాళులర్పిస్తున్నదని తెలిపారు.

వాట్సాప్‌లో టెన్త్ పేపర్ ౦౦౦

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత రూమ్ నెంబర్ 5లో ఒక విద్యార్థి ఆబ్సెంట్ కావడంతో ఆ విద్యార్థికి సంబంధించిన పేపర్‌ను చీఫ్ సూపరింటెండెంట్‌కు ఇవ్వాల్సిన క్రమంలో ఒక టీచర్ దాన్ని ఫొటో తీసి వాట్సప్ గ్రూప్‌లో పోస్టు చేశారని ఎంఈఓ వెంకటయ్య తెలిపారు.

ఇలా జరిగింది..

నెంబర్-1 స్కూల్‌లోనే పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్, బయోసైన్స్ టీచర్ బందప్ప పరీక్ష సమయంలో రిలీవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం తెలుగు పేపర్ పరీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో రూమ్ నెంబర్ 5లో ఒక స్టూడెంట్ ఆబ్సెంట్ అయ్యాడు. అతనికి సంబంధించిన పేపర్‌ను ఆ గదిలో ఇన్విజిలేటర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ నుంచి బందప్ప తీసుకున్నాడు. అనంతరం ఆ ప్రశ్నాపత్రాన్ని తన ఫోన్‌లో ఫొటో తీసి జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ చెంగోల్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ టీచర్ సమ్మప్పకు పంపించాడు. ఈ క్రమంలో అనుకోకుండా తాండూర్ పట్టణంలోని ఒక ప్రెస్ గ్రూప్‌లో కూడా పేపర్ షేర్ కావడంతో విషయం బయటకు వచ్చింది. ఈ సంఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని విచారించారు. తాము తప్పు చేసినట్టు టీచర్లు బందప్ప, సమ్మప్ప ఒప్పుకున్నారు. అధికారుల ఫిర్యాదు మేరకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు బందప్పపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

ఐదుగురిపై చర్యలు

పేపర్ బయటకు రావడంతో అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి నలుగురిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. టీచర్లు బందప్ప, సమ్మప్ప, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ శివకుమార్, చీఫ్ సూపరింటెండెంట్ గోపాల్‌ను సస్పెండ్ చేశారు. ఇన్విజిలేటర్ శ్రీనివాస్‌ను కూడా పరీక్ష విధుల నుంచి తప్పించారు. రూమ్ నెంబర్-5లో విధులు నిర్వహిస్తున్న ఇన్విజిలేటర్ శ్రీనివాస్.. ఆబ్సెంట్ అయిన విద్యార్థి ప్రశ్నాపత్రాన్ని చీఫ్ సూపరింటెండెంట్‌కు ఇవ్వాల్సి ఉండగా, టీచర్ బందప్పనే చీఫ్ సూపరింటెండెంట్ అనుకొని పొరపాటున ఇచ్చినట్టు శ్రీనివాస్ వివరణ ఇచ్చారు. ఈ విషయమై పూర్తి విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ పోలీసులను ఆదేశించారు. బందప్పపై గతంలో క్రిమినల్ కేసులు ఉన్నట్టు సమాచారం.

సిట్ ఇంటరాగేషన్

(మొదటిపేజీ తరువాయి)

పనిచేసే ఉద్యోగుల విధివిధానాలు, ఎవరెవరు ఏయే బాధ్యతలు నిర్వహిస్తారు? అనే పలు అంశాలపై టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలోనే సిట్ విచారణ కొనసాగించింది. జనార్ధన్‌రెడ్డి చెప్పిన సమాచారాన్ని సిట్ అధికారులు రికార్డు చేసినట్టు తెలిసింది. టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో అత్యంత రహస్యంగా ఉండాల్సిన ప్రశ్నాపత్రాలు అంత సులువుగా బయటకు రావని, ఇందులో పెద్దల హస్తం ఉందని సిట్ అధికారులు అనుమానించారు. ఈ క్రమంలో ఈ కేసులో ఇప్పటివరకు 15మందిని అరెస్టు చేసిన అధికారులు పలువురిని విచారించిన విషయం తెలిసిందే. దర్యాప్తు అంతా ప్రశ్నాపత్రాలు లీక్ కావడం, అవి ఎవరెవరికి వెళ్లాయి, ఎంత మేరకు ఆర్థిక లావాదేవీలు జరిగాయి అనే కోణంలో కొనసాగింది. ఈ క్రమంలో కాన్ఫిడెన్షియల్ సెక్షన్ ఆఫీసర్ శంకరలక్ష్మిని పది దఫాలుగా సుమారు 20గంటల పాటు సిట్ అధికారులు ప్రశ్నించారు. అంతేకాకుండా శనివారం టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్, కమిషన్ సభ్యులు లింగారెడ్డిని సైతం వేర్వేరుగా విచారించిన విషయం తెలిసిందే. తాజాగా జనార్ధన్‌రెడ్డి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసిన సిట్ అధికారులు రిపోర్టును సీల్డ్ కవర్‌లో ఈనెల 11వరకు న్యాయస్థానంలో అందజేయనున్నట్టు తెలిసింది. ఇదిలావుండగా టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై ఈడీ కేసు నమోదు చేయడం మరింత సంచలనంగా మారింది.

ముగ్గురి కస్టడీకి నాంపల్లి కోర్టు అనుమతి

ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో మరో ముగ్గురి కస్టడీకి నాంపల్లి కోర్టు అనుమతించింది. ప్రశాంత్, రాజేందర్, తిరుపతయ్యను కస్టడీకి ఇవ్వాలని సిట్ నాంపల్లి కోర్టును కోరింది. ఈ మేరకు ముగ్గురి నిందితులను మూడు రోజులపాటు పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతించింది. దీంతో ముగ్గురినీ మంగళవారం చంచల్‌గూడ జైలు నుంచి కస్టడీకి తీసుకోనున్నారు.

వనస్థలిపురం సీఐని కలిసిన ఎస్సీ సెల్ చైర్మెన్ బోడ రాజశేఖర్



నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురం పోలీస్ స్టేషన్ సీఐగా పదవీ బాధ్యతలు అందుకున్న జలేందర్ రెడ్డిని ఎల్బీనగర్ నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మెన్ బోడ రాజశేఖర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి బొకే అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ గతంలో విధులు నిర్వహించిన కే.సత్యనారాయణ వనస్థలిపురంవాసుల మన్ననుని గైకొన్నారని, అదేవిధంగా నూతనంగా నియమితులైన సిఐ జలేందర్ రెడ్డి చట్టానికి లోబడి వనస్థలిపురం వాసులకి మమత సేవలు అందిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డి.చందు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు



నవతెలంగాణ-తుర్కయాంజల్

తెలంగాణలో భూస్వామ్య పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు దొడ్డి కొమురయ్య అని డీసీసీబీ వైస్ చైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి మన్నెగూడ చౌరస్తాలో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మెన్ కందాడ ముత్యం రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ కందాడ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ, టీపీసీసీ సభ్యులు కొత్తకుర్మ శివకుమార్, మేతరి కుమార్, సీనియర్ నాయకులు ఓర్సు శ్రీను, రేవల్లె యాదగిరి, భద్రయ్య, గుడ్ల అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో ఎక్కడాలేని సంక్షేమ పథకాలు అమలు

నవతెలంగాణ-ఘట్కేసర్

దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రజాసంక్షేమ పథకాలు అమలు పరుస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం అన్నోజిగూడ శివాస్ ఫంక్షన్ హాల్లో పోచారం మున్సిపల్, ఘట్‌కేసర్ మండలం కొర్రెముల పంచాయతీ పరిధిలోని చెరుకు బాలయ్య గార్డెన్లో మండల భారత్ రాష్ట్ర సమితి పార్టీ ఆత్మీయ సమ్మేళనం. కార్యక్రమాలు బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు మందడి సురేందర్రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నాగులపల్లి రమేష్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమాలలో ముఖ్యఅతిథిగా మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సీఎం కేసీఆర్ సారథ్యంలో అనేక సంక్షేమ పథకాల అమలుతో అభివృద్ధి పథంలో నడుస్తుందని పేర్కొన్నారు. గృహలక్ష్మి పథకంతో ఖాళీ స్థలం కలిగిన వారికి రూ.3లక్షలు అందించడం జరుగుతుందన్నారు. నిరుపేదలైన దళితులకు దళితబంధు, ప్రభుత్వ స్థలంలో ఇండ్లు నిర్మించుకున్న వారికి పట్టాల పంపిణీ ఇలా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకం అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతుబంధు సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా పార్టీ ఇన్‌చార్జీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, బీఆర్ఎస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్రెడ్డి, పార్టీ పార్లమెంట్ ఇంచార్జీ మర్రి రాజ శేఖర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మెన్



దయాకర్రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్రెడ్డి, వైస్ చైర్మెన్ రెడ్యానాయక్, రైతుబంధు సమితి మండల అధ్యక్షులు కొంతం అంజిరెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గొంగళ్ల బాలేష్, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి, సర్పంచ్లు ఓరుగంటి వెంకటేష్ గౌడ్, బైరు రమాదేవి. కొంతం వెంకట్ రెడ్డి, చిలుగూరి మంగమ్మ, వంగూరి శివశంకర్, నీరుడి గీత, ఉప సర్పంచ్ ఎల్సాని ఐలయ్యయాదవ్, కౌన్సిలర్లు, ఎంపిటీసీ బొడ్డు వినోద, మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్లు బట్టి శంకర్, బైనగారి నాగరాజు, పెద్దోళ్ల రమేష్, నాయకులు డొంకని బిక్షపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అల్మాస్‌గూడలో ఘనంగా బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం

మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

సీఎం కేసీఆర్ ఆదేశంతో అల్మాస్ గూడలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం గులాబీమయయంగా మారిందని, మహేశ్వరం నియోజకవర్గంను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయటం జరిగిందని, అందుకు ప్రజలు ఆదరించాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ గ్రామంలోని చిప్పిడి అడివి రెడ్డి గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళన సభ కార్యక్రమానికి విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించటం జరిగిందన్నారు. రాష్ట్రానికి సీఎం కేసీఆర్ శ్రీరామరక్షగా ఇట్టి రాష్ట్రం ఎవరి చేతుల్లోకి వెళ్లిన కుక్కలు చింపిన విస్తర్లాగా మారుతుందని తెలిపారు. ముఖ్యంగా అల్మాస్‌గూడ గ్రామంలో 52 కాలనీలు మరిన్ని కొత్తగా ఏర్పాటు అవుతున్నాయని, కాలనీలలో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటుకై అన్ని విధాల కృషి చేశామని, హెచ్ఎండిఏ నిధులతో అల్మాస్‌గూడ గ్రామానికి 16కోట్ల రూపాయలు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా ప్రజలు ఎండలో పెద్ద ఎత్తున మంత్రికి ఘన స్వాగతం పలికిన అన్నతమ్ముళ్ళకి, అక్కా, చెల్లెళ్లకి పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మెన్ శ్రీధర్‌బాబు, సంతోష్ రెడ్డి, నియోజకవర్గ ఉపాధ్యక్షులు నిమ్మల నరేందర్ గౌడ్, ఫ్లోర్ లీడర్ సుర్గంటి అర్జున్, కార్పొరేటర్లు, కవితా రామ్‌రెడ్డి, బోయపల్లి దీపిక శేఖర్‌రెడ్డి, సంరెడ్డి స్వప్న వెంకటరెడ్డి, ముత్యాల లలిత కృష్ణ, ఏనుగు రామిరెడ్డి, నాయకులు తుఫాన్ రెడ్డి, లగ్గాల సంజీవ, శ్రీపాల్ రెడ్డి, కే.నాగేందర్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు, యువజన విభాగం నాయకులు, సోషల్ మీడియా కన్వీనర్ సాంబశివ, మహిళ నాయకురాలు జాలే సరిత రెడ్డి, శివాని రెడ్డి, మణెమ్మ, భారతి, వివిధ కాలనీల ప్రజలు, మహిళలు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

- మరిన్ని కేర్ సెంటర్‌ల ఏర్పాటుకు చర్యలు
- యానిమల్ కేర్ సెంటర్లను తనిఖీ చేసిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



నవతెలంగాణ-సిటీబ్యూరో

యానిమల్ కేర్ సెంటర్లను నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హెచ్.ఎం.డీ.ఏ పరిధిలో మరికొన్ని యానిమల్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సోమవారం చార్మినార్ జోన్‌లోని చుడీబజార్‌లోని యానిమల్ కేర్ సెంటర్‌ను నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. యానిమల్ కేర్ సెంటర్లలో వీధి కుక్కల థియేటర్స్, రిహాబిలిటేషన్ సెంటర్, స్టెరిలైజ్ డాగ్ సెంటర్‌లను పరిశీలించారు. వీధి కుక్కలకు అందిస్తున్న ఆహారం ఒకే గిన్నెలో వేయడంతో గమనించిన మేయర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుండి వాటికి సరిగా ఆహారం అందించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

తదనంతరం కుక్కల స్టెరిలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. అట్టి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టెరిలైజ్ చేసిన కుక్కలను వి-షేప్ నాట్స్ ద్వారా గుర్తిస్తామని అధికారులు మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. డాగ్స్ కెనల్ కెపాసిటీ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని మేయర్ ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ యానిమల్స్‌కు రెగ్యులర్‌గా అందించే ఆహారం, తాగునీరును నిర్ణీత సమయంలో అందించాలని అధికారులను ఆదేశించారు. కుక్కలకు వేడి భోజనాన్ని అందించకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కావాల్సిన మౌలిక సదుపాయాలతో పాటు ఇతర వసతుల ఏర్పాటు చేయాలన్నారు. ఇతర మున్సిపాలిటీల నుండి వచ్చిన కుక్కలను వెంటనే స్టెరిలైజేషన్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. వీధి కుక్కలను పట్టుకోవడానికి వినియోగించే స్టెరిలైజ్ డాగ్ వెహికిల్‌ను ఉదయం 5:30 గంటలకు క్షేత్రస్థాయిలో పంపించాలన్నారు. ప్రతి రోజు రెండు షిఫ్ట్‌లలో నిర్దేశించిన సర్జరీల కంటే ఎక్కువగా సర్జరీలు చేయాలన్నారు. ప్రస్తుతం చేస్తున్న సర్జరీలు 42 నుండి 45 ఉండగా వాటిని 60 నుండి 70 సర్జరీలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను మేయర్ ఆదేశించారు. ప్రస్తుతం ఈ సెంటర్‌లో 200 స్టెరిలైజ్ డాగ్స్, 105 నాన్ స్టెరిలైజ్డ్ డాగ్స్ ఉన్నాయని అధికారులు మేయర్‌కు వివరించగా, వీటికి సకాలంలో సరైన ఆహారం అందించాలన్నారు. ఈ వేసవిని దృష్టిలో పెట్టుకొని కుక్కలకు తాగునీరు అందించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారుల పనితీరుపై ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ వెంట డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ డా.అశోక్, వెటర్నరీ అధికారి డా.రాంచదర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తి ప్రదాత దొడ్డి కొమురయ్య

కమిషనర్ లోకేష్ కుమార్





నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తి ప్రదాత దొడ్డి కొమురయ్య అని జీహెచ్ఎంసీ కమిషనర్ డి.ఎస్ లోకేష్ కుమార్ అన్నారు. దొడ్డి కొమరయ్య 97వ జయంతి సందర్భంగా సోమవారం ఈహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ డి.ఎస్.లోకేష్ కుమార్ దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వెట్టిచాకిరి నిర్మూలనకు పోరాడి తొలి అమరుడయ్యారని, తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచాడని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ.ఎన్.సి జియావుద్దీన్, అడిషనల్ కమిషనర్ యాదగిరిరావు, వి.కష్ణ, చీఫ్ పీ.ఆర్.ఓ మహమ్మద్ ముర్తుజా, ఎంటమాలజి చీఫ్ డాక్టర్ రాంబాబు, ఏ.ఎం.సి జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మదర్ డెయిరీ పాడి రైతులకు శుభవార్త



నవతెలంగాణ-హయత్‌నగర్

పాడి రైతులకు మదర్ డెయిరీ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార యూనియన్ శుభ వార్త తెలియజేసింది. యూనియన్ ఎప్పటికప్పుడు పాల రేట్లు పెంచే విషయంలో వెనుకంజ వేయకుండా ముందుకు పోతున్నట్లు సంస్థ ఛైర్మన్ లింగాల శ్రీకర్ రెడ్డి వెల్లడించారు. సోమవారం హయత్ నగర్‌లో ఉన్న మదర్ డెయిరీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లగొండ-రంగారెడ్డి యూనియన్ గేదె పాలు (కిలో వెన్నకు) 756రూపాయల నుండి 856లకు, ఆవు పాలు (కిలో గణ పదార్థం) 313రూపాయల నుండి 353 రూపాయలకు ఈనెల 1నుండి అమలులో వచ్చినట్లు బోర్డ్ సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు.గేదె పాలు (6శాతంవెన్నకు) ప్రస్తుతం చెల్లిస్తున్న ధర లీటరుకు 45రూపాయల నుండి 51రూపాయలకు పెంచారు. ఆవు పాలు(3శాతం వెన్నకు) ప్రస్తుతం చెల్లిస్తున్న లీటరు ధరకు 35రూపాయల నుండి 70కి అంటే ప్రతి లీటరుకు 4'55వరకు పెంచినట్లు తెలిపారు.అధిక మొత్తంలో పాలు పోసే రైతులను ప్రోత్సహించుటకు ప్రస్తుతం ధరకు అదనంగా ఇన్సెంటివ్ రూపంలో చెల్లించడం జరుగుతుందన్నారు.రోజుకు 25లీటర్ల నుండి 49లీటర్ల వరకు పాలు పోసిన వారికి 2రూపాయల చొప్పున రోజుకు 50లీటర్లు, ఆ పైన పాలు పోసిన వారికి 3రూపాయల చొప్పున ఇస్తామని ఆయన తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని రైతులు కూడా నాణ్యమైన పాలు ఉత్పత్తి చేసే ప్రవేటు డెయిరీ ల ప్రలోభాలకు లొంగకుండా మదర్ డెయిరీని కాపాడుకుంటూ సంస్థ అబివృద్ధికి పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట పాలకవర్గ సభ్యులు గాశ్ రెడ్డి, రామ్ రెడ్డి, సోమిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, జయశ్రీ, వెంకట్ రామ్ రెడ్డి, సురేందర్ రెడ్డి, లక్ష్మీ నర్సింహ రెడ్డి, జలెందర్ రెడ్డి, అలివేలు, శ్రీధర్ రెడ్డి, పాండు,రామ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డిలు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి



నవతెలంగాణ-ఉప్పల్

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పార్టీ అభివృద్ధి కోసం సైనికుల పనిచేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. చిల్కానగర్ డివిజన్‌లో పార్టీ అధ్యక్షులు పల్లె నర్సింగరావు అధ్యక్షత నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి కార్పొరేటర్ గీత ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ తాడూరి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై పాల్గొన్నారు. ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి కార్పొరేటర్ గీత మాట్లాడుతు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత తొమ్మిది సంవత్సరాల నుంచి కనివిని ఎరుగని రీతిలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందని, పుట్టిన బిడ్డ దగ్గర నుంచి ముసలి అవ్వ వరకు అందరికీ సంక్షేమ ఫలాలు అందుతు న్నాయని, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దేశ చరిత్రలోనే ఒక మరుపురాని అధ్యాయమని, కెసిఆర్ గారు టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్ పార్టీగా ఆవిర్భవించిన తరుణంలో దేశ ప్రజలం దరికీ కూడా తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ ఫలాలు ఎలాగైతే అందుతున్నాయో అలాగే దేశ ప్రజలం దరికీ అందాలన్న గొప్ప సంకల్పంతో బీఆర్ఎస్ పార్టీని పెట్టడం జరిగిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉద్యమకారులు, బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ పాల్గొన్నారు.

దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో ఇండ్ల స్థలాల పోరాటాలు నిర్మిస్తాం

సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎన్.సబిత



నవతెలంగాణ-ఘట్కేసర్

ఆంధ్ర మహాసభ నాయకత్వంలో జరిగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరవీరుడైన దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో ఇండ్ల స్థలాల భూ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎన్.సబిత అన్నారు. సోమవారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 96వ జయంతి వేడుకల సందర్భంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాటి నైజాం నిరంకుశ పాలనలో అనేకమంది మట్టి మనుషులు కమ్యూనిస్టుల ప్రాణ త్యాగాల వల్ల మహా విప్లవకారులుగా తీర్చిదిద్దబడ్డారని, భూస్వాములవద్ద నుంచి 10లక్షల ఎకరాల భూమి లాగేసి పేదలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. 4000 మంది అమరులైన తర్వాత నిజాం తెలంగాణ విడిచి వెళ్లిపోవాల్సి వచ్చిందన్నారు. ఈ పోరాటంతో ఇసుమంత సంబంధం లేని మతోన్మాద బీజేపీ ఆ సాయుధ పోరాటం గురించి హిందూ ముస్లింల పోరాటంగా చిత్రీకరించటం సిగ్గుచేటన్నారు. దొడ్డి కొమరయ్య అమరత్వంతో భూ ఉద్యమం సాయుధ పంథా తీసుకుందన్నారు. నేడు పేద ప్రజల ఇళ్ల స్థలాల కోసం ఇంటి నిర్మాణం కోసం సీపీఐ(ఎం) పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు, చల్లగొండ అరుణ, గుర్రం నాగమణి, కె.అనసూర్య, జి.రాములమ్మ స్వరూప, కె.అరుణ, బక్కమ్మ, జె.ప్రమీల, కుమారి, కౌసల్య, తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి 50లక్షల వ్యయంతో "ఉమెన్ థీమ్ పార్క్" నిర్మాణం

- నిర్మాణంలో ఉన్న ఉమెన్ థీమ్ పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-వనస్థలిపురం

పార్కుల సుందరీకరణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అత్యాధునిక ప్రమాణాలతో ఎల్బీనగర్ నియోజకవర్గంలోని బి.ఎన్.రెడ్డినగర్ డివిజన్ పరిధిలో ఎన్.జీ.ఒస్.కాలనీ, సచివాలయ నర్సరీ పార్కులో దాదాపు 1 కోటి 50లక్షల రూపాయల వ్యయంతో "ఉమెన్ థీమ్ పార్క్" నిర్మాణం చేపట్టడం జరుగుతుంది అని తెలిపారు. దానిలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ థీమ్ పార్కు అత్యాధునిక వసతులతో రూపుదిద్దుకుంటుంది. ఈ పార్కు పచ్చదనంతో పాటు వివిధ రకాల మొక్కలు, పూల మొక్కలతో అత్యంత ఆకర్షణీయంగా ఉండబోతుంది. వాకింగ్ ట్రాక్, సేద తీరడానికి విశాలమైన స్థలంలో బెంచీల ఏర్పాటు, మహిళల కోసం యోగ, ఆత్మస్థైర్యాన్ని నింపే కరాటే, మెడిటేషన్ కోసం ప్రత్యేక స్థలం, మహిళలు సమావేశాలు, కిట్టీ పార్టీలు జరుపుకోవడానికి విశాలమైన స్థలం, కౌన్సిలింగ్ రూమ్స్, చిన్నారుల కోసం ప్రత్యేక ఆటస్థలం, వివిధ క్రీడలు ఆడటానికి అన్ని సదుపాయాలతో కూడిన ప్రత్యేకమైన ప్లే కోర్ట్, అలాగే అధునాతన సదుపాయాలతో కూడిన టాయిలెట్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుంది అని తెలిపారు. కార్యక్రమంలో బి.ఎస్.రెడ్డి. నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, పొగుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ క్లాస్ పరీక్షలు ప్రారంభం

- వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 14 సెంటర్లు
- 3393 గాను 3380 హాజరై 13 మంది ఆబ్సెంట్



నవతెలంగాణ-వనస్థలిపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టెన్త్ క్లాస్ పరీక్షలు సోమవారంతో ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 14 సెంటర్లు ఏర్పాటుచేసి పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ 14 సెంటర్లలో 3393 మంది హాజరు కావాల్సింది 3380 హాజరు కాగా, 13మంది విద్యార్థులు కాలేకపోయారు. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో బి.ఎన్.రెడ్డి నగర్‌లోని దిల్‌సుఖ్‌నగర్ హై స్కూల్, వనస్థలిపురం నాగార్జున హై స్కూల్, దిల్‌సుఖ్‌నగర్ హై స్కూల్ బీ సెంటర్, సెంటెన్స్ హై స్కూల్ వనస్థలిపురం, వనస్థలిపురం సిద్ధార్థ గ్లామర్ స్కూల్, వనస్థలిపురం జడ్పీహెచ్ఎస్, వనస్థలిపురం హెరాల్డ్ హై స్కూల్, వనస్థలిపురం లోటస్ ల్యాప్ హై స్కూల్, వనస్థలిపురం లోయోలా మోడల్ హై స్కూల్, వనస్థలిపురం గ్రేట్ వుడ్ హై స్కూల్, మన్సురాబాద్ హైదరాబాద్ టాలెంట్ స్కూల్, జెడ్ పీహెచ్ఎస్ స్కూల్, కమ్మగూడ సెంట్ జోసెఫ్ స్కూల్‌లలో 3393 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 3380 మంది విద్యార్థులు హాజరై 13 మంది విద్యారులు హాజరు కాకపోవటం జరిగింది. పదో తరగతి పరీక్షలు పూర్తయ్యేంతవరకు పోలీస్ బందోబస్తుని ఏర్పాటు చేయటం జరుగుతుందని వనస్థలిపురం సీఐ జలంధర్ రెడ్డి తెలిపారు.

ఐడీబీఐలో ఇ-బ్యాంక్ గ్యారెంటీ సౌకర్యం

నవతెలంగాణ - హైదరాబాద్

నేషనల్ ఇ-గవర్నెన్స్ సర్వీసెస్ లిమిటెడ్ (ఎన్ఇఎస్-ఎల్) భాగస్వామ్యంతో ఇ-బ్యాంక్ గ్యారెంటీ (ఇ-బీజీ) సౌకర్యాన్ని ఐడీబీఐ బ్యాంకు ప్రారంభించింది. ఇది పేపర్ ఆధారిత బ్యాంకు గ్యారెంటీ ప్రక్రియను ఇ-స్టాంపింగ్ మరియు ఇ-సిగ్నేచర్‌లతో భర్తీ చేస్తుంది. దీనితో బ్యాంకు తన వినియోగదారులకు డిజిటల్ మరియు యూజర్ ఫ్రెండ్లీ సేవలను అందించే ప్రయత్నంలో మరో మైలురాయిని చేరుకుంది. ఐడీబీఐ బ్యాంకు దీనిని వ్యాపార పర్యావరణ వ్యవస్థలో మార్పు తీసుకువచ్చే అంశంగా పరిగణిస్తోంది.

ఇక్కడ కొత్త చొరవ అధిక పారదర్శకతను తీసుకువస్తుండగా, బ్యాంకును రోజుల తరబడి సందర్శించే అవసరం లేకుండా నిమిషాలలోనే పని పూర్తి చేస్తుంది. ఇ-బిజిని ఇ-స్టాంపింగ్ మరియు ఇ-సిగ్నేచర్‌లతో ప్రాసెస్ చేయవచ్చు.

కొన్ని నిమిషాల వ్యవధిలో లబ్ధిదారునికి బ్యాంకు గ్యారెంటీని తక్షణమే వితరణ చేయవచ్చు. సురక్షిత ట్రాన్స్‌మిషన్, మెరుగైన పారదర్శకతతో, లబ్ధిదారులకు భౌతిక బ్యాంక్ గ్యారెంటీల ధృవీకరణలో శ్రమ తగ్గి, సమయం మరింత ఆదా అవుతుంది. ఈ సేవల గురించి ఐడీబీఐ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ రాకేష్ శర్మ మాట్లాడుతూ, "మా వినియోగదారులకు డిజిటల్ ఆఫర్‌ల ద్వారా సురక్షితమైన మరియు వేగవంతమైన బ్యాంకింగ్ సేవలను అందించాలని కోరుకుకుంటున్నట్లు తెలిపారు.

వాట్సప్‌తో మహిళలకు స్థిరమైన జీవనోపాధి

నవతెలంగాణ - హైదరాబాద్

400 మిలియన్ల పైచిలుకు భారతీయులు, తమ ప్రియమైన వారితో అనుసంధానం అయి ఉండేందుకు, తమకు నచ్చిన మెసేజ్ బిజినెస్‌లకు, అవసరమైన సేవలను పొందేందుకు వాట్సప్‌ను ఉపయోగిస్తున్నారు. వాట్సప్ ఒక సరళమైన, విశ్వసనీయమైన, ప్రయివేట్ మరియు సురక్షితమైన మెసేజింగ్ యాప్‌గా ఉంది. ఇది 'న్యూ-టు-డిజిటల్' వినియోగదారుని కోసం సాంకేతికత పట్ల ఉన్న సంకోచాన్ని తొలగించి, కోట్లాది మంది భారతీయులకు, ముఖ్యంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ప్రాథమిక డిజిటల్ గేట్‌వేగా పనిచేస్తోంది. ప్లాట్‌ఫారమ్‌కు ఉన్న విస్తృతమైన పరిధితో సామాజిక ప్రభావాన్ని కొలిచేందుకు, విద్య, ఆరోగ్య సంరక్షణ మరియు నైపుణ్యాభివృద్ధికి పరిష్కారాలను అందించేందుకు ఒక శక్తివంతమైన సాధనంగా చేస్తుంది. మహిళలకు ముఖ్యంగా వారికి జీవనోపాధిని సృష్టించేందుకు, అవగాహన పెంచడానికి, సేవలను అందించేందుకు మరియు వారి సముదాయాల కోసం సామాజిక కారణాలకు మద్దతు ఇవ్వడానికి వాట్సప్‌ను ఉపయోగిస్తున్నారు.

కవులు, కళాకారులకు ప్రత్యేక ప్రాధాన్యత

ఉప్పల శ్రీనివాస గుప్త





నవతెలంగాణ-నాగోల్

కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కవులకు, కళాకారులకు, ప్రత్యేక ప్రాధాన్యతను ఇచ్చి ప్రోత్సహిస్తుందని ఉప్పల ఫౌండేషన్ చైర్మెన్ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ విభాగం అధ్యక్షులు మరియు జాతీయ కార్యదర్శి ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని, ఎల్.వి.ప్రసాద్ డిజిటల్ ఫిల్మ్ ల్యాబ్‌లో జరిగిన శ్రీ సాయి కల్చరల్ అకాడమీ మరియు - ఆర్.కె కళా సాంస్కృతిక ఫౌండేషన్ తెలుగు ఫిల్మ్ ఐకాన్ అవార్డ్స్-2023 ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన వారికి వారి చేతుల మీద అవార్డ్స్ అందజేశారు. అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన తర్వాత రచయితలకు గాయకులకు, కవులు, కళాకారులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ సాహితీ ప్రియులు కాబట్టి అలాంటి వారి కోసం అన్ని విధాలుగా ప్రోత్సాహకాలు, సహాయ, సహకారాలు అందిస్తున్నది తెలంగాణ ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం అని అన్నారు. అంతకు ముందున్న ప్రభుత్వాలు కళారంగాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్‌ల ఆధ్వర్యంలో గాయకులకు, కవులు, రచయితలకు మరియు సినీ రంగానికి, సినీ నటి నటులు, కళాకారుల అభివృద్ధికి కృషి చేయడం జరిగిందని శ్రీనివాస గుప్త పేర్కొన్నారు. కవులు దేశపతి శ్రీనివాస్, రసమయి బాలకిషన్, గోరేటి వెంకన్న, సాయిచంద్ లాంటి వారికి పదవులు ఇచ్చి గౌరవించడం జరిగింది. అలాగే తెలంగాణ కళాకారులకు దాదాపు 1200 మందికి తెలంగాణ సాంస్కృతిక శాఖ సారథి ద్వారా ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్ ది, మన తెలంగాణ ప్రభుత్వంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు శ్రీనివాస్, రిటైర్డ్ జడ్జి బి.మధుసూదనా చారి, సినీ నటి లతాగౌడ్ మరియు ఇతర నటీనటులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు అందజేత



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఏబీవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్ఖానాలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ రెండో బ్యాచ్ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి సోమవారం కార్పొరేటర్ దీపిక కావ్య కృష్ణారెడ్డితో కలిసి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏబీవీ ఫౌండేషన్ వారు మహిళల కోసం ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. అంతకుముందు స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ లో ఫౌండేషన్ వారు ఇస్తున్న శిక్షణకు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు.

అంజయ్య నగర్‌లో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ



నవతెలంగాణ-కంటోన్మెంట్

పాత బోయిన్‌పల్లి అంజయ్య నగర్ బోయిన చెరువు పక్కన సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ నరసింహా యాదవ్‌తో కలిసి దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ కౌన్సిలర్ మక్కాల నర్సింగ్ రావు, మైనార్టీ ప్రెసిడెంట్ ఇజాజ్, ఎక్స్ మార్కెట్ వైస్ ఛైర్మన్ ఉదయ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య స్ఫూర్తిని కొనసాగించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్
- దొడ్డి కొమురయ్య 96వ జయంతి

నవతెలంగాణ-మేడ్చల్‌కలెక్టరేట్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తిని కొనసాగించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య 96వ జయంతి ఉత్సవంలో లింగ్యానాయక్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జాన్సీ రాణితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కొమురయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీఓ శ్రీనివాస్, పశుసంవర్ధక అధికారి శేఖర్, గొల్ల, కురుమ కుల సంఘాల నాయకులు, కలెక్టరేట్ సిబంది, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





జవహర్‌నగర్ : తొలి తరం ఉద్యమ వీరుడు, నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య కీలక పాత్ర పోషించారని జవహర్‌నగర్ మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మండల సురేందర్ అన్నారు. సోమవారం కార్పొరేషన్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేయర్ మేకల కావ్య కార్పొరేటర్లు నిహారికగౌడ్, మేకల లలితా యాదవ్, పానుగంటి బాబు, లావణ్య సతీష్ గౌడ్, రోజా, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, ఎస్సైలు అనిల్ కుమార్, మోహన్, బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, నాయకులు శ్రీకాంత్ యాదవ్, జంగిడి శ్రీను, వినయ్, వెంకటేశ్వర్లు, పద్మారావు, నందు, నర్సింహాయాదవ్, ప్రసాద్, ఉపేందర్, వెంకటేష్, మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ : తెలంగాణలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, విస్నూర్ దేశ్‌ముఖ్‌పై పోరాడిన విప్లవవీరుడు దొడ్డి కొమురయ్య అని తెలంగాణ రాష్ట్ర కురుమ యువచైతన్య సమితి కార్యదర్శి మంగ యాకయ్య అన్నారు. యాకయ్య ఆధ్వర్యంలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కార్మికనగర్‌లో దొడ్డి కొమురుయ్య 96 వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్, ఎస్సీ పరిరక్షణ సమితి జాతీయ ఉపాధ్యక్షురాలు మెచ్చినేని శ్రీదేవి, స్థానిక నేతలు కన్నయ్య, రాజు, బూడిద బాలరాజు, మద్దూరు సిద్ధయ్య, కురుమ మాయ, కోటి శీను, కురుమ మంగ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.





నాచారం : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 96వ జయంతి వేడుకలను మల్లాపూర్ ఎలిఫెంట్ చౌరస్తాలో ఆయన విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పాల్గొని కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దొడ్డి కొమురయ్య మనవడు దొడ్డి యాదగిరి, మల్లాపూర్ కురుమ సంఘం నాయకులు బెల్లం గట్టయ్య, శీతల వీరస్వామి, హమాలి శ్రీను, స్థానిక నాయకులు రాపోలు సతీష్, వాసుదేవ్ గౌడ్, పైళ్ల ప్రవీణ్, నాగారం చంద్రశేఖర్, కాటిపెల్లి రవీందర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కాప్రా : తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తిగా గ్రూప్ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య 94వ జయంతి కార్యక్రమం కమలానగర్ ఆఫీసులో జరిగింది. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. దొడ్డి కొమరయ్య చిత్రపటానికి శ్రీమన్నారాయణ పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలలో ఆఫీస్ కార్యదర్శి శ్రీనివాస రావు, సాంబశివరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ముందు



నవతెలంగాణ-కంటోన్మెంట్/బేగంపేట

ప్రజల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో పలు మండలాలకు చెందిన 174 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేసి మాట్లాడారు. పేదింటి ఆడపడుచు పెండ్లికి రూ.లక్షా 116 ఆర్థిక సహాయం అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆడపడుచు పెండ్లి చేసేందుకు పడే ఇబ్బందులు తెలిసిన సీఎం మేనమామ మాదిరిగా దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంత పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందిస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ఆసరా పెన్షన్ కింద వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు ప్రతినెలా ఆర్థిక సహాయాన్ని వారి ఖాతాలోనే నేరుగా జమ చేస్తున్నట్టు తెలిపారు. పెన్షన్ ను రూ.2 వేలకు పెంచినట్టు తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో ప్రభుత్వ హాస్పిటల్స్‌ను అభివృద్ధి చేసినట్టు చెప్పారు. కార్పొరేట్‌కు దీటుగా దీటుగా ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అన్ని రకాల వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నట్టు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తున్నట్టు వివరించారు. ఇందుకోసం రూ.7,200 కోట్లతో మన బస్తీ మన బడి కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలనేది సీఎం లక్ష్యం అన్నారు. అన్ని కులాలు, మతాలను ప్రభుత్వం సమానంగా గౌరవిస్తుందని చెప్పారు. క్రిస్మస్, రంజాన్, బతుకమ్మ, బోనాల ఉత్సవాలు ఇలా అన్ని పండుగలను ప్రజలు ఎంతో గొప్పగా జరుపుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేస్తుంటే కొన్ని పార్టీల నాయకులు ప్రభుత్వంపై ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు దీపిక, కొలన్ లక్ష్మి, హేమలత, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్‌లు నామన శేషుకుమారి, అత్తిలి అరుణగౌడ్, వసంత, తహసీల్దార్‌లు శైలజ, విష్ణుసాగర్, అహల్య, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమానికి 97 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెస్ ఛాంపియన్‌లకు ట్రోఫీలు అందజేత



నవతెలంగాణ-కంటోన్మెంట్

తెలంగాణ చెస్ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 17 బాల బాలికల చెస్ ఛాంపియన్ పోటీల్లో బాలికల విభాగంలో యస్వీ జైన్ ఛాంపియన్‌గా నిలవగా బాలుర విభాగం నుంచి ప్రణయ్ ఆకుల ఛాంపియన్‌గా నిలిచాడు. మేడ్చల్ జిల్లా చెస్ ఛాంపియన్ షిప్ తోపాటు రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక పోటీలు రెండురోజుల పాటు బోయిన్‌పల్లిలో జరిగాయి. ఈ పోటీల్లో మేడ్చల్ జిల్లా పరిధిలోని వివిధ పాఠశాలలకు చెంది సుమారు 52 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్ పోటీలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై ఫైనల్ పోటీలను తిలకించి విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ పోటీల్లో బాలికల విభాగంలో యస్వీ జైన్, బాలుర విభాగం నుంచి ప్రణయ్ ఆకుల ఛాంపియన్లుగా నిలవగా బాలికల విభాగంలో సాయి సుశీల రెండో స్థానం, శ్రీ కృష్ణి మూడో స్థానం, నేహా పాకలపాటి నాలుగో స్థానంలో నిలిచారు. బాలుర విభాగంలో రెండో స్థానంలో పవన్ కార్తికేయ వర్మ, మూడో స్థానంలో శ్రీ రామాంజని కుమార్, నాలుగో స్థానంలో మహ్మద్ ఇర్ఫాన్ నిలిచారు. దీంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో పాల్గొననున్న 8 మంది బాల బాలిక జట్టును జంపన్న ప్రతాప్ ప్రకటించారు. ఈ సందర్భంగా జంపన్న మాట్లాడుతూ ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి జాతీయ స్థాయి చెస్ పోటీల్లో రాణించి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ ప్రతినిధి ప్రసాద్, స్పోర్ట్స్ అకాడమీ కోచ్ సుధీర్, దాస్, శ్రీధర్ యాదవ్, రాజేష్, కుమార్, లలిత, వాణి, జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.



చర్లపల్లి డివిజన్ భరత్‌నగర్‌కి చెందిన బీఆర్ఎస్ నాయకులు నయీం తల్లి సోగ్ర బేగం చనిపోయారు. స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ స్థానిక నాయకులతో కలిసి వారి ఇంటికి వెళ్ళి ఆమె పార్థివ దేహానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. **నవతెలంగాణ-కాప్రా**

జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో పదో తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రతతో ఏర్పాటు చేశారు. సోమవారం కార్పొరేషన్‌లోని నాలుగు స్కూల్లో పరీక్షల సెంటర్లు నిర్వహించారు. విద్యార్థులు 847 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, నలుగురు గైర్హాజరైనట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులకు పరీక్ష సెంటర్‌లో సకల వసతులు కల్పించారు. నవతెలంగాణ-జవహర్‌నగర్



మహనీయుల జయంతి వేడుకలకు రండి



నవతెలంగాణ-నాచారం

నాచారం డివిజన్ పరిధిలోని ఎర్రకుంట మాత నల్ల పోచమ్మ ఆలయం నిర్వహించే మహనీయుల జయంతి వేడుకలకు రావాలని ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డిని ఆహ్వానించినట్టు ఎర్రకుంట మహనీయుల విగ్రహాల కమిటీ ప్రతినిధులు తెలిపారు. మహనీయుల జయంతి సందర్భంగా రూపొందించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి ఆవిష్కరించారు. బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావ్, మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను మహనీయుల విగ్రహాల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఏప్రిల్ మాసం బడుగు బలహీన వర్గాల ప్రజలకు పండుగ మాసంగా జరుపుకోవాలన్నారు. మహనీయుల త్యాగాలను ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. మహనీయుల జయంతి వేడుకలకు ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, సంఘ సేవకులు, సామాజిక ఉద్యమకారులకు ఆహ్వానం అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రకుంట మహనీయుల విగ్రహాల కమిటీ ప్రతినిధులు గద్ద నర్సింగరావు, నక్క నగేష్, జంగం అశోక్, ఆశన్న, టోనీ ఫ్రాన్సిస్, శంకర్ గౌడ్, గద్ద క్రాంతి కిషోర్, భిక్షపతి, బీఆర్ఎస్ నాయకులు మేకల ముత్యంరెడ్డి, కాటిపల్లి రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు బస్ పాసులు అందజేత



నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్‌నగర్‌లోని డ్వాక్రా భవన్‌లో తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి ప్రధాన కార్యదర్శి మొనార్ దుర్గాప్రసాద్ ఆర్టీసీ అధికారి శ్రీనివాస్‌రావుతో కలసి మేయర్ మేకల కావ్య బస్ పాస్‌లను అందజేశారు. బస్సు పాస్ మేళాకు మంచి స్పందన వచ్చిందని దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు అండగా నిలుస్తుందన్నారు. ఉచిత బస్సు పాస్ కోసం దరఖాస్తు చేసుకున్న 250 మంది వికలాంగులకు బస్ పాస్‌లను అందజేశారు. గతంలో సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న సికింద్రాబాద్‌కు వెళ్లి అక్కడ దరఖాస్తు చేసుకునే వారనీ, మళ్లీ బస్ పాసులు ఇచ్చిన రోజు కూడా మరోసారి వెళ్లి అక్కడ నుంచి తీసుకురావాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కానీ నేడు మున్సిపల్ పరిధిలోని దరఖాస్తులు స్వీకరిస్తూ తిరిగి బస్సు పాసులు జారీ కూడా అక్కడే అందిస్తున్న టీఎస్ ఆర్టీసీ అధికారులను మేయర్ అభినందించారు. అనంతరం తెలంగాణ వికలాంగుల రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి మొనార్ దుర్గాప్రసాద్‌ను శాలుశాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నిహారికగౌడ్, బింగి లావణ్య సతీష్‌గౌడ్, లలిత యాదవ్, బల్లి రోజా, గండి రాంచందర్, గొడుగు వేణు ముదిరాజ్, ఎస్‌డీఎఫ్ ఫౌండేషన్ సెక్రెటరీ సవితా గౌడ్, మనోధర్ రెడ్డి, వికలాంగుల రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతి శ్రీధర్, రాము, సదానందం, మేడ శీను, తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు న్యూ లైఫ్ ఫౌండేషన్ కృషి



నవతెలంగాణ-నాచారం

పేద ప్రజలకు ఆపన్న హస్తంగా న్యూ లైఫ్ ఫౌండేషన్ పేద ప్రజలను ఆదుకునేందుకు కృషి చేస్తున్నట్టు ప్రెసిడెంట్ నసీమా భాను తెలిపారు. సోమవారం మల్లాపూర్‌లో నిరుపేదలు 60 మందికి నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు న్యూ లైఫ్ ఫౌండేషన్ నిర్విరామంగా సేవలు అందిస్తుందన్నారు. పేద విద్యార్థుల చదువుల కోసం, వృద్ధుల ఆసరా కోసం ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. తమ సేవలను భవిష్యత్తులో మరింత విస్తరించేందుకు కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. అభాగ్యులకు అండగా నిరుపేదలకు తోడుగా సహాయాన్ని అందిస్తూ న్యూ లైఫ్ ఫౌండేషన్ కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు సఫియా సుల్తానా, న్యూ లైఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు ఎండి సమద్ ఖాన్, నసీం అబ్దుల్, ఎండి సలీమ్, షాబాద్, పేద ప్రజలు పాల్గొన్నారు.

రూ.10వేల ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-కాప్రా

డ్రైనేజ్ పంపు లైన్ కారణంగా కుర్చివేతకు గురైన గద్దె దిమ్మ నిర్మాణం కోసం, కూర్చోడానికి గద్దె కోసం టీఆర్ఎస్‌కేయూ ఆటో యూనియన్ ఈసీనగర్ గణేశ్ కామన్ ఆటో స్టాండ్ వారికి రూ.10 వేలను ఆర్థిక సహాయంగా బీఎల్ఆర్ ట్రస్ట్ ప్రతినిధి నేమూరి మహేష్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపు లైన్ కారణంగా ఆటో యూనియన్ వాళ్ళు నిలుపుకునే అడ్డ, గద్దె పోయినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు శ్రీశైలం, ఆటో యూనియన్ నాయకులు వినయ్ కుమార్ సీతారాం, శీను, నాగరాజు, నరేష్, సాయికిరణ్ ప్రవీణ్, మల్లేష్, శ్రీకాంత్, రవి నాయక్, చుక్క రవి, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ స్థలంలో ఇండ్లు కట్టుకున్న వారు భూమి క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లు కట్టుకున్న వారు వారికి జీవో నెంబర్ 58, 59 ద్వారా క్రమబద్ధీకరణకు అర్హులైన నిర్వాసితులు దరఖాస్తు చేసుకోవాలని నాంపల్లి మండల తహసీల్దార్ ఎంవీవీ ప్రసాద్‌రావు కోరారు. సోమవారం నాంపల్లి మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో ఇండ్లు కట్టుకున్న వారు ప్రూఫ్ ఆఫ్ పొజిషన్ 2-6-2020కు ముందు ఇల్లు కట్టుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రమబద్ధీకరణ దరఖాస్తులను ఈ నెల 30వ తేదీలోగా నిర్వాసితులందరూ మీసేవాలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

7న సికింద్రాబాద్‌లో మెగా జాబ్ మేళా

నవతెలంగాణ-ఓయూ

సెట్విన్‌తోపాటు వివిధ సంస్థల సహకారంతో సికింద్రాబాద్‌లో ఈ నెల 7వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నారు. సీతాఫల్‌మండి మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో నిర్వహించే ఈ జాబ్ మేళాలో 25 కు పైగా పేరొందిన ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలు పాల్గొంటున్నాయి. డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, బీ ఫార్మసీ, హోటల్ మేనేజ్మెంట్, ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ వంటి అన్ని విద్యార్హతల వారికి అనువైన ఉద్యోగాలు కల్పిస్తున్నారు. కనీసం రెండు వేల మందికి ఉద్యోగాలు కల్పించేలా జరుపుతున్న ఈ జాబ్ మేళాలో భాగంగా రూ.15 వేల నెలసరి వేతనంతో మొదలయ్యే ఉద్యోగాలతో పాటు వివిధ రకాలకు చెందిన అవకాశాలు ఉన్నాయి. ప్రధానంగా సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని అడ్డగుట్ట, మెట్టుగూడ, తార్నాక, సితాఫల్‌మండీ, బౌద్ధనగర్ మున్సిపల్ డివిజన్లకు చెందిన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

తొలిరోజు ప్రశాంతం

- పదో తరగతి పరీక్షలు ప్రారంభం
- హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో 1,11,689 మంది హాజరు
- మొత్తం 845 మంది విద్యార్థుల గైర్హాజరు
- పరీక్ష కేంద్రాల్లో విద్యాశాఖ అధికారుల తనిఖీలు





నవతెలంగాణ-సిటీబ్యూరో

పదోతరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలో 564 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు సజావుగా పరీక్ష రాశారు. ఉదయం 8.30 గంటల నుంచి పరీక్షా కేంద్రం లోపలికి అనుమతించారు. విద్యార్థులకు తొలి పరీక్ష కావడంతో ఉరుకులు పరుగులతో పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాలను విద్యాశాఖ అధికారులతో పాటు జిల్లా ఉన్నతాధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1 ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని అధికారులు పేర్కొన్నారు.

హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో తొలిరోజు ఫస్ట్‌లాంగ్వేజ్ పేపర్-1 పరీక్షకు మొత్తం 1,12,534 మంది హాజరు కావాల్సి ఉండగా.. 1,11,689 మంది హాజరయ్యారు. 845 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. దీంట్లో ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే 68,939 విద్యార్థులకుగాను 68,269 మంది హాజరు కాగా.. 670 మంది గైర్హాజరయ్యారు. 99.02శాతం హాజరు నమోదైంది. ఇక మేడ్చల్ జిల్లాలో 43,595 మంది విద్యార్థులకుగాను 43,420 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 175 మంది గైర్హాజరయ్యారు. 80.41శాతం హాజరు నమోదైంది. కాగా రెండు జిల్లాలో కలిపి టెన్త్ పరీక్షల నిర్వహణకు 27 బృందాలతో ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించిన సంగతి తెలిసిందే. దీంతో తొలిరోజు సుమారు 151 పరీక్షా కేంద్రాలను అధికారులు తనిఖీలు చేశారు. ఇందులో హైదరాబాద్ డీఈవో ఆర్.రోహిణి ఆరు కేంద్రాల్లో తనిఖీలు చేశారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సౌకర్యాలు, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని వారికి సూచించారు. తొలి పరీక్షలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ జరుగలేదని తెలిపారు. ఇక అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు చర్యలు చేపట్టారు. ఇక మేడ్చల్ జిల్లా పరిధిలోని పలు పరీక్ష కేంద్రాలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డీఈవో విజయకుమారి తనిఖీలు చేశారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు కోసం దేశవ్యాప్తంగా ఉద్యమిస్తా



- జులైలో 4లక్షల మందితో పార్లమెంట్ ముట్టడి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-అడిక్‌మెట్

పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలనీ, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలనీ, లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఢిల్లీలోని పార్లమెంట్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జులైలో బీసీ బిల్లు సాధన కోసం రూ.4 లక్షల మందితో ఢిల్లీలోని పార్లమెంట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ దేశంలో కేంద్ర ప్రభుత్వాలు 75 ఏండ్లుగా బీసీలకు ఏ రంగంలో కూడా జనాభా ప్రకారం వాటా ఇవ్వలేదన్నారు. ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో కనీస ప్రాతినిధ్యం లభించలేదన్నారు. ఇది ప్రజాస్వామ్య దేశం అనీ, ప్రజాస్వామ్యంలో అన్ని సామాజిక కులాలకు వారి జనాభా ప్రకారం అన్ని రంగాల్లో వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు ఇచ్చేది భిక్షం కాదు.. ఇది రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్య హక్కు అన్నారు. స్వాతంత్రం వచ్చినప్పుడు బీసీలకు అసెంబ్లీ - పార్లమెంట్ రిజర్వేషన్లు పెట్టకుండా అన్యాయం చేశారన్నారు. పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్ట సభల్లో బీసీలకు 50శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలనీ, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లను రిజర్వేషన్లు కల్పించాలనీ, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. కేంద్ర విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు బీసీలకు జనాభా ప్రసాదం 27శాతం నుంచి 56 శాతంకు పెంచాలని కోరారు. రాష్ట్రాలకు 80 మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలనీ, కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. కేంద్ర స్థాయిలో 2 లక్షల కోట్ల బడ్జెట్, బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలనీ, జనాభా లెక్కల్లో బీసీ కులాల వారిని లెక్కలు సేకరించాలని కోరారు. ఈ మహాధర్నాలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, కర్రీ వేణు మాధవ్ గుజ్జ సత్యం, లాల్ కృష్ణ, భూపేష్ సాగర్, నీలా వెంకటేష్, కె.రాము, రామ కృష్ణ, వరప్రసాద్, అనంతయ్య, శ్రీనివాస్, జోషి, సూర్య నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'మోడీ హటావో దేశ్ బచావో' సెమినార్‌ను జయప్రదం చేయండి



నవతెలంగాణ-అడిక్‌మెట్/హిమాయత్‌నగర్/బంజారాహిల్స్

మోడీ హటావో దేశ్ బచావో" సెమినార్‌కు హాజరై జయప్రదం చేయాలని రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్‌ను సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్, శోభన్‌బాబు బుఖ్య, బుర్ర రాములుగౌడ్ ఆహ్వానించారు. ఈ నెల 9వ తేదీన సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో జరగబోయే ఈ సెమినార్‌లో పాల్గొని తమ అమూల్యమైన సందేశం ఇవ్వాలని వారు కోరారు. తప్పక హాజరవుతానని వినోద్‌కుమార్ హామీనిచ్చారు. అనంతరం డాక్టర్ దిడ్డి సుధాకర్, శోభన్‌బాబు బుఖ్య, బుర్ర రాములు గౌడ్ మీడియాతో మాట్లాడుతూ "మోడీ హటావో దేశ్ బచావో "అన్న నినాదంతో ఆమ్ ఆద్మీ జాతీయ అధ్యక్షులు అరవింద్ కేజ్రీవాల్ ఇచ్చిన పిలుపు మేరకు జరుగబోయే ఈ సెమినార్‌కు బీఆర్ఎస్, కాంగ్రెస్, టీడీపీ, తెలంగాణ జన సమితి పార్టీ, సీపీఐ, సీపీఐ(ఎం)తోపాటు ఇతర వామ పక్ష పార్టీలు, లౌకిక పార్టీలను ఆహ్వానించినట్టు తెలిపారు. దేశంలో బీజేపీ మీద వ్యతిరేకత పెరుగుతున్న క్రమంలో సహించలేని ఆ పార్టీ నాయకులు అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తున్నారన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీ డిపార్ట్మెంట్లను తమ గుప్పిట్లో పెట్టుకుని బీజేపీ సొంత సంస్థల్లాగా వాటిని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ప్రశ్నించిన వారిపై దేశద్రోహం కేసు నమోదు చేయడం, జాతి వ్యతిరేకులు అనడం, ఇంకా ఏదైనా పేరు ప్రజా అణిచివేత విధానాలు కొనసాగిస్తున్నారన్నారు. బీజేపీ ప్రజా వ్యతిరేక పాలనను అంతమందించడానికి దేశంలో ఉన్న అన్ని ప్రతిపక్ష పార్టీలు ఏకమై "మోడీ హటావో దేశ్ బచావో "అన్న పోరాటం ముమ్మరంగా కొనసాగిస్తామనీ, ప్రజాస్వామ్య లౌకిక, ప్రగతిశీల వాదులందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ, విద్యాశాఖ అధికారుల లోపం

నవతెలంగాణ-అడిక్‌మెట్

వికారాబాద్ జిల్లా తాండూర్‌లోని ఒక పరీక్ష సెంటర్‌లో 10వ తరగతి పరీక్ష పేపర్ లీకేజీ ఘటనపై అనేక అనుమానాలు, అభియోగాలు వ్యక్తం అవుతున్నాయనీ, పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ విద్యాశాఖ అధికారుల లోపం స్పష్టంగా కనబడుతుంది అని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ అన్నారు. సోమవారం ప్రకటన విడుదల చేశారు. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సొంత జిల్లా కావడంతో అక్కడ తనకు కావాల్సిన విద్యార్థులకు అధిక మార్కులు రావడం కోసం 9:30కి పరీక్షలు ప్రారంభమైతే 9:37కు క్వశ్చన్ పేపర్ బయటకు వచ్చిందన్నారు. పరీక్ష ప్రారంభమైన 10 నిముషాలు కూడా కాకుండానే క్వశ్చన్ పేపర్ బయటకు రావడం అంటే ఉద్దేశ పూర్వకంగానే లీక్ చేశారేమో అనే అనుమానం వ్యక్తం అవుతుందన్నారు. ఇంత త్వరగా వాట్సాప్ గ్రూపులో చక్కర్లు కొట్టడం వంటి విషయాలను చూస్తే ప్రణాళిక బద్ధంగానే పేపర్ లీక్ అయిందేమో అనిపిస్తుందన్నారు. ఇది విద్యాశాఖ, లేక ప్రభుత్వమే లికేజీల ప్రభుత్వమా? అనే సందేహం కలుగుతుందన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు అన్యాయం చేయొద్దనీ, పేపర్లు లీక్ చేసి అమ్ముకున్న అసలు నేరస్తులను వెలికితీయాలనీ, సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలనీ, దీనికి విద్యాశాఖమంత్రి బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

అగ్ని ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలు

- పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు
- స్వయంగా ఫిర్యాదును స్వీకరించిన సీపీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరోతరగతి చదువుతున్న ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యం చేయించేందుకు నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ బాధిత బాలుడు ఫిర్యాదు చేసేందుకు నేరేట్‌మెట్‌లోని రాచకొండ సీపీ కార్యాలయానికి సోమవారం వచ్చాడు. విషయం తెలుసుకున్న సీపీ డీఎస్ చౌహాన్ తన ఛాంబర్ నుంచి బయటకు వచ్చి బాలుడి నుంచి ఫిర్యాదును స్వీకరించారు. గత ఫిబ్రవరిలో చేర్యాల గ్రామ పరిధిలోని ఓ ప్రముఖ గురుకుల పాఠశాల వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఆ సమయంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో 6వ తరగతి చదువుతున్న తుమ్మల హనివర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వైద్యం చేయించాలని పాఠశాల యాజమాన్యాన్ని బాలుని తల్లిదండ్రులు కోరారు. అయితే వారు వైద్యం చేయించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బాధితులు సీపీకి ఫిర్యాదు చేశారు. నిర్లక్ష్యం వహించిన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీని కోరారు. స్వయంగా ఫిర్యాదును స్వీకరించిన సీపీ నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీపీని కలిసిన వారిలో బాలుడికి చిన్నాన్న నరేష్ రెడ్డి, తదితరులున్నారు.

నిస్వార్థ సేవలోనే నిజమైన సంతృప్తి



నవతెలంగాణ-బంజారాహిల్స్

నిస్వార్థంగా చేసే సేవలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని తెలంగాణ ట్రేడ్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో వినికిడి సమస్యతో బాధపడుతున్న సుమారు 1,50,000 మందికి వినికిడి యంత్రాలను అందజేసిన నీలపు వెంకటరత్నాన్ని సన్మానించారు. సేవ ఆటోమేటివ్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలో ఎండీగా విధులు నిర్వహిస్తూ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఎంతోమందికి సేవా కార్యక్రమాలు నిర్వహించిన నీలపు వెంకటరత్నాన్ని సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ఎలాంటి స్వచ్ఛంద సంస్థ ప్రారంభించకుండా స్వయంగా సేవలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. తన చిన్ననాటి నుంచే సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న వారికి చేయూత అందించడం అలవాటుగా మారిందని వెంకటరత్నం తెలిపారు. తన వంతుగా సమాజానికి సేవలు చేయాలని నిర్ణయించుకుని లక్షా 50 వేల మందికి పైగా అందించడంలో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించిందని చెప్పారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో తమ సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకువెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్టు వెంకటరత్నం తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక వేత్తలు, పలు స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు బ్రదర్ షాజహాన్ ఆంటోనీ ప్రత్యేక సూచనలు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రాష్ట్ర వ్యాప్తంగా మొదటి రోజు 10వ తరగతి పరీక్షలను విద్యార్థులు చక్కగా రాస్తారని ఆశిస్తున్నటుట అబిడ్స్ లిటిల్ ఫ్లవర్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ షాజహాన్ ఆంటోనీ తెలిపారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులు మిగతా అన్ని పరీక్షలను ఏకాగ్రతతో శ్రద్ధగా రాస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు. మిగతా పరీక్షలను కూడా బాగా రాయడానికి తాను కొన్ని సూచనలు చెబుతున్నట్టు తెలిపారు. తాను చెప్పబోయే ఈ సుచనలు పరీక్షలు బాగా రాయడానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు చదువుకునే టైంలో ఎలాంటి సందేహాలు వచ్చినా మీ ఉపాధ్యాయులను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఈ పరీక్ష కాలంలో విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతినకుండా ఉండేందుకు ఫోన్లు, కంప్యూటర్లు, సినిమాలు, ట్విట్టర్లు, ఫేసుబుక్ లకు దూరంగా ఉండాలని తెలిపారు. అవసరమైనప్పుడు తమ తల్లిదండ్రుల సహాయం తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థిలో ఒక్కొక్కరిలో ఒక్కో నైపుణ్యం దాగి ఉందని తెలిపారు. ఈ సబ్జెక్టు ఎక్కువ, ఆ సబ్జెక్టు తక్కువ అని చదవకుండా అన్ని సబ్జెక్టులకూ ప్రాధాన్యత ఇస్తే తగిన ర్యాంకులు వస్తాయన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల్లో ఉన్న నైపుణ్యాన్ని గుర్తు చేసి వారిలో ఆత్మవిశ్వాసం నింపాలన్నారు. వారిలోని బలహీనతలను ఎత్తిచూపకుండా ఈ పదోతరగతి పరీక్షలు మీకోలెక్కన అని తప్పకుండా ఫస్ట్ క్లాస్‌లో పాస్ అవుతావని వారిలో ధైర్యాన్ని నింపితే ఇదే ధైర్యాన్ని పరీక్షలు పూర్తి అయ్యేవరకు తల్లిదండ్రులు వారికి అండగా నిలవాలని బ్రదర్.షాజహాన్ ఆంటోనీ తెలిపారు.

దళారుల మాటలను నమ్మొద్దు : కార్పొరేటర్



నవతెలంగాణ-అంబర్‌పేట

దళారుల మాటలు నమ్మి బఫర్ జోన్ ఏరియాల్లో ఎలాంటి భూములను విక్రయించవద్దని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గోల్నాక డివిజన్ పరిధిలోని కమలానగర్ మూడెకరాల ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు బోర్డును తొలగించడంతో కార్పొరేటర్ ఎమ్మార్వో లలితని కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో కార్పొరేటర్ కు తెలిపిన వివరాల ప్రకారం అది బఫర్ జోన్లో వస్తుందనీ, అక్కడ ఎలాంటి అక్రమ కట్టడాలు కట్టడానికి వీలు లేదనీ, ఎవరైనా అక్రమ కట్టడాలు కడితే కఠిన చర్యలు తప్పవని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. గోల్నాక ముసరాంబాగ్ బ్రిడ్జి నుండి మలక్‌పేట కొత్త బ్రిడ్జ్ వరకు మూసీ పరివాహక ప్రాంతానికి చెందిన భూమి వివరాలను ఇవ్వాలని సర్వే చేయించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో లలిత మాట్లాడుతూ బఫర్ జోన్ లో అక్రమ కట్టడాలు కడితే సహించేది లేదన్నారు. దాంట్లో ఎఫ్.టి.ఎల్ బోర్డును ఏర్పాటు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. కార్పొరేటర్ మాట్లాడుతూ బఫర్ జోన్‌లో బీద ప్రజలు మోసపోవద్దనీ, కొంతమంది కబ్జాదారులు ప్రజలను మోసగించి భూములను అమ్ముతున్నారనీ, అలాంటి వారి మాటలను నమ్మి మోసపోవద్దని గోల్నాక డివిజన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కమలానగర్ బఫర్ జోన్ భూమికి సంబంధించి మంత్రి కేటీఆర్, మంత్రి హరీష్ రావు సహకారంతో కేసీఆర్ పార్కును అభివృద్ధి చేసి తీరుతామని కార్పొరేటర్ తెలిపారు.

క్రాస్‌బౌ షూటింగ్‌లో సాయి హన్సికకు బంగారు పతకం



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

జిల్లా స్థాయి క్రాస్‌బౌ ఛాంపియన్‌షిప్‌లను రెండు రోజుల పాటు నిర్వహించారు. 1వ మేడ్చల్-మల్కాజ్‌గిర్ జిల్లా క్రాస్‌బౌ షూటింగ్ ఛాంపియన్‌షిప్ ఖైరతాబాద్, హైదరాబాద్, తెలంగాణలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగింది. బాల నటి సాయి హన్సిక చక్రాత్ జిల్లా క్రాస్ బౌ షూటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. సాయి హన్సిక చక్రాత్ సినిమాలు, కూచిపూడి, క్లాసికల్ డాన్స్, సీరియల్ మోడలింగ్, సోషల్ యాక్టివిటీతో పాటు ఇప్పుడు గేమ్స్‌లో రాణించడం విశేషం. ఈ సందర్భంగా సాయి హన్సిక మాట్లాడుతూ క్రాస్ బౌ షూటింగ్‌లో బంగారు పతకం సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తాను క్రాస్ బౌల్ షూటింగ్ ఛాంపియన్ నేషనల్‌కు ప్రిపేర్ అవుతున్నానని చెప్పారు. తెలంగాణ క్రాస్ బౌ షూటింగ్ అసోసియేషన్ ఫౌండర్, ప్రెసిడెంట్ లక్ష్మీ చైతన్య మాట్లాడుతూ ఈ గేమ్స్ అందరికీ ఫిజికల్, మెంటల్‌గా స్ట్రాంగ్ అవుతారనీ, ఈ సర్టిఫికెట్ పిల్లలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ క్రీడ కోసం చాలా మంది క్రీడాకారులు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. హన్సిక చాలా స్పోర్టివ్ పర్సన్ అన్నారు. నేషనల్ ఛాంపియన్ షిప్‌కు పిల్లలను సిద్ధం చేస్తున్నామనీ, తెలంగాన్ క్రాస్‌బౌ షూటింగ్ అసోసియేషన్‌లో సాయి హన్సిక చక్రత్ 15 ఏండ్ల లోపు కేటగిరీ-కర్వ్ క్రాస్‌బౌ గన్‌లో ఈ గేమ్‌ను ఆడి గోల్డ్ మెడల్ (1వ స్థానం), 1వ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గెలుచుకోవడం సంతోషంగా ఉందని, సాయి హన్సిక తల్లి గీత సుందర్ చక్రత్ తెలిపారు. కోచ్ భువనేశ్వరికి, సహ భాగస్వాములైన అథర్వ, దివ్యా, మోనా, క్రాస్విన్, క్రితి హన్సికకు ఎలా ఆడాలి, ఎలా గెలవాలి అనే దానిపై మార్గదర్శం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.


అలరించిన ఫ్యాషన్ షో



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఎకో ఫ్రెండ్లీ దుస్తుల ఆవశ్యకతను వివరిస్తూ నిర్లోజ్యో సంస్థ నిర్వహించిన ఫ్యాషన్ షో ఎంతగానో అలరించింది. సోమవారం ఫిలింనగర్‌లోని ఓ కేఫెలో యువతీ యువకులు వ్యర్థ పదార్థాల సమ్మిళితంగా రూపొందించిన మోడ్రన్ దుస్తులు ధరించి ర్యాంప్‌పై నిర్వహించిన వాక్ ఆకట్టుకుంది. పర్యావరణానికి హాని చేయని వస్త్రాలను ప్రమోట్ చేసే లక్ష్యంతో ఇండో-జపనీస్ మేలవింపుతో దుస్తులను రూపొందిస్తున్నట్టు డిజైనర్ సుష్మిత చౌదరి తెలిపారు.

రేపటి నుంచి చార్మినార్ నియోజకవర్గంలో 'పోస్ట్ కార్డు' ఉద్యమం



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడాన్ని తప్పుబడుతూ కాంగ్రెస్ "పోస్ట్ కార్డు" ఉద్యమాన్ని చేపడుదుందని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కె.వెంకటేష్ పేర్కొన్నారు. ఈ మేరకు గాంధీభవన్ లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఏఐసీసీ సెక్రెటరీ, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి నదీమ్ జావేద్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనా రెడ్డి చేతులమీదుగా పోస్ట్ కార్డులను అందుకుని మాట్లాడారు. రాహుల్ గాంధీ ఎంపీ సభ్యత్వం రద్దును ఖండిస్తూ రద్దు చేసిన లోక్‌సభ సభ్యత్వం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారత ప్రధానమంత్రికి పోస్ట్ కార్డుల ద్వారా లేఖలు రాసి పంపిస్తామని చెప్పారు. ఈ పోస్టు కార్డు ఉద్యమంలో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని ప్రజల నుంచి లేఖలను రాయించి ప్రధానమంత్రి కార్యాలయానికి పంపాలని సూచించారు.

పెన్షన్ కానిస్టుట్యూషనల్ మార్చ్‌ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

సీపీఎస్ అంతం మన పంతం అనే నినాదంతో సీపీఎస్‌ను రద్దు చేసిన రాష్ట్రాల్లోని ఉద్యోగుల ప్రాన్ ఖాతాల్లో జమైన డబ్బును తిరిగి ఇచ్చే విధంగా కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలో కూడా సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చే విధంగా ఉద్యమం ఉంటుందని హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నరేందర్ రావు అన్నారు. ఈనెల 16వ తేదీన ప్రతి జిల్లా కేంద్రంలో పెన్షన్ కానిస్టుట్యూషనల్ మార్చ్ ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ అబిడ్స్‌లోని బీమా భవన్, దేవాదాయశాఖ కార్యాలయాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి సీఎం ఉద్యోగుల పక్షపాతిగా నిలవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు భవిష్యత్తు పోరాటం ఉంటుందన్నారు. ఈనెల 16వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, పవన్, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు అశోక్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు మహేందర్, ఆర్గనైసింగ్ సెక్రెటరీ శ్యామ్ సుందర్, అరవింద్, ఈసీ మెంబెర్స్ శ్రీనివాస్‌రావు, సుధాకర్, మోహన్‌సింగ్, ఆనంద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

నవతెలంగాణ-ఓయూ

ప్రేమించిన వ్యక్తి పెండ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి గురైన యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన లాలాగూడ పోలీస్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మధులత వివరాల ప్రకారం జనగామ జిల్లా, స్టేషన్ ఘన్ పూర్, కొత్తపల్లి గ్రామానికి చెందిన జీ.డి. శ్రావ్య (23) ఎంబీఏ పూర్తి చేసుకుని నాలుగు నెలల క్రితం హైద్రాబాద్‌కు వచ్చింది. తార్నాక విజయపురి కాలనీలోని వియా రెడ్డి ఉమెన్స్ హాస్టల్లో ఉంటుంది. అదే ప్రాంతంలోని నైపుణ్యం ట్యాక్స్ కంపెనీలో ట్యాక్స్ ఫైలింగ్ టీం లీడర్‌గా పని చేస్తుంది. అయితే జనగామకు చెందిన తన బంధువైన సుధాకర్ వీడియో గ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. అతనితో శ్రావ్యకు నాలుగేండ్లుగా ప్రేమ వ్యవహారం ఉంది. కాగా కొన్ని రోజులుగా సుధాకర్ ప్రవర్తనలో మార్పు వచ్చింది. శ్రావ్యను పెళ్లి చేసుకోవడం ఇష్టం లేనట్టుగా ప్రవర్తించాడు. ఈ క్రమంలో శ్రావ్య అతన్ని గట్టిగా అడగ్గా తనను పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని తేల్చి చెప్పాడు. ఇదే విషయం శ్రావ్య ఆదివారం రాత్రి తన తండ్రి క్రిష్ణకు ఫోన్ చేసి చెప్పింది. అప్పటి నుంచి తీవ్ర మనోవేదనకు లోనైన శ్రావ్య అదే రోజు మధ్య రాత్రి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా గమనించిన హాస్టల్ నిర్వాహకుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతురాలి తండ్రి క్రిష్ణ ఫిర్యాదు మేరకు సుదాకర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కర్వేనా భూనిర్వాసితులకు పునరావసం కల్పించి న్యాయం చేయండి



నవతెలంగాణ-బంజారాహిల్స్

తాగునీరు, సాగునీరు కింద కర్వేనా రిజర్వాయర్ భూనిర్వాసితులకు పునరావాసం కల్పించి న్యాయం చేయాలని రైతు రాజ్యాంగం పార్టీ అధ్యక్షులు ఎంబీ.బాలకృష్ణ కోరారు. కర్వేనా, ఆలూరు, కొత్తూరు బారునపల్లి, బట్టపల్లికి చెందిన 3వేల మంది ఎనిమిది వేల ఎకరాల భూమిని ఈ ప్రాజెక్టు కింద నష్టపోయారన్నారు. ప్రభుత్వం అరకొర ధరలతో తమ భూములను తీసుకున్నట్టు తెలిపారు. ఒక్కొక్కరికి ఒక్కో రేటు చెల్లించడం సబవు కాదన్నారు. 2013 చట్టం ప్రకారం పునరావాసం పునర్నిర్మాణం చేయాల్సింది పోయి ప్రతి గ్రామానికీ ఒక్కొక్క జీవో చేయడం అన్యాయమన్నారు. ఒకే రాష్ట్రానికి ఒకే జీవో ఉండాలని కోరారు. ఈ విషయంపై గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తామని చెప్పారు. తక్షణమే భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం ఇంటికో ఉద్యోగం ఇచ్చి ప్రస్తుత మార్కెట్ ప్రకారం నష్టపోయిన వారికి నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

ప్రజలకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఆశిష్ కుమార్ ఆయుష్ కేంద్రం ఆధ్వర్యంలో గన్ ఫౌండ్రీ పూలు బాగ్ బషీర్బాగ్ తదితర ప్రాంతాల్లో ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలను అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు గడ్డం ఆశిష్ కుమార్ యాదవ్, తదితరులు.



జెమినీ కాలనీలో నూతన సీసీ రోడ్లు, డ్రయినేజీ పనులకు కృషి



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ డివిజన్ పరిధిలోని జెమినీ కాలనీలోని బస్తీల్లో సీసీ రోడ్లు, డ్రయినేజీ పనుల ప్రారంభానికి కృషి చేస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక బీఆర్ఎస్ నాయకుడి ఆధ్వర్యంలో ముషీరాబాద్ డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏండ్ల క్రితం నిర్మించిన సీసీ రోడ్డు పూర్తిగా పాడైపోయిందనీ, దాని స్థానంలో నూతన వీడీ సీసీ రోడ్డు పెరిగిన జనాభా కనబడకుండా డ్రయినేజీ పైపులైను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదన సిద్ధం చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొండా శ్రీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు దీన్ దయాల్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయకపోతే తెలంగాణలో బీజేపీ భూస్థాపితమే

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ

నవతెలంగాణ- మేడ్చల్

వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాదిగలను నమ్మించి బీజేపీ కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ అన్నారు.అలాంటి బీజేపీని తెలంగాణ రాష్ట్ర ప్రజలు నమ్మితే మిగిలేది బూడిద మాత్రమేనని విమర్శించారు. మాదిగల సంగ్రామ పాద యాత్ర ఆదిలాబాద్ నుండి ప్రారంభమై 32రోజులల్లో 1000కిలో మీటర్ల పూర్తి చేసుకొని సోమవారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ పట్టణానికి చేరుకోవడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమం లో ఎమ్మెస్ ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి మాదిగ,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మునుగూరి ప్రణీత్ మాదిగ,మండల అధ్యక్షుడు డబీలిపురం పరుశూరం మాదిగ,ఎర్రవల్లి బలనర్సింహ మాదిగ,ఎర్రోళ్ల నర్సింగ్ మాదిగ,ఎర్రోళ్ల యాదగిరి మాదిగ,కుండ భానుచందర్ మాదిగ,పొట్టోళ్ల రవి మాదిగ,తుడుం సునీల్ మాదిగ,గుండె ఎల్లయ్య, పాదయాత్ర బృందం పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

మాజీ కార్పొరేటర్ సురేష్

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని సూరారం కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి అన్నారు. ఆ కాలనీలో సంబంధిత వాటర్ హౌస్ మరియు జీహెచ్ఎంసి అధికారులతో కలిసి పాదయాత్ర చేస్తూ.. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలు మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి దృష్టికి ప్రజలు తీసుకొచ్చి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో రాజపడే ప్రసక్తే లేదని, అభివృద్ధి ప్రజల సంక్షేమమే బిఆర్ఎస్ ప్రథమ కర్తవ్యం అని అన్నారు. కాలనీలో మంచినీటి సమస్య డ్రైనేజ్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని,అలాగే విద్యుత్, పారిశుద్ధ్య సమస్యలు అధిగమించేందుకు చర్యలు చేపడతామని, మిగిలిపోయిన సీసీ రోడ్లు పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాయదుర్గ్ మెట్రోస్టేషన్ నాల్గవ ద్వారం ప్రారంభం

మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో



నేడు రాయదుర్గ్ మెట్రోస్టేషన్ ఆర్మ్-బీ నాల్గవ ద్వారం మెట్రో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రారంభిస్తున్నట్టు హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ద్వారం అందుబాటులోకి రావడంతో మెట్రో ప్రయాణీకులు మరింత సౌకర్యవంతంగా, మరీ ముఖ్యంగా రద్దీ వేళల్లో స్టేషన్‌లోకి వెళ్లడం సులభతరం అవుతుందని వివరించారు. హైదరాబాద్ మెట్రో రైల్‌లో అత్యంత రద్దీగా ఉండే స్టేషన్‌లలో రాయదుర్గ్ మెట్రో స్టేషన్ ఒకటి అని, ఈ స్టేషన్ నుంచి ప్రతి రోజూ దాదాపు 60వేల మంది ప్రయాణీకులు రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు. ఈ నూతన ద్వారానికి మెట్ల మార్గంతో పాటుగా ఎస్కలేటర్ ఉంటుందని తెలిపారు. ఈ ద్వారం ఎంట్రీ, ఎగ్జిట్ లెమన్ ట్రీ హోటల్ వైపు ఉంటుందని, ఐటీ, ఐటీఈఎస్ ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన చెప్పారు. రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నాల్గవ ద్వారాన్ని ప్రజలకు అంకితం చేస్తుండటం పట్ల సంతోషంగా ఉన్నామని ఆయన తెలిపారు. ఎల్అండ్‌టీఎంఆర్‌హెచ్ఎల్ సీఎండీ కెవీబీ రెడ్డి మాట్లాడుతూ మెట్రో ప్రయాణీకుల సౌకర్యం, భద్రతకు కట్టుబడి ఉన్నామని, రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నాల్గవ ద్వారం తెరవడంతో ప్రయాణీకుల కదలికలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటుగా తమ నిర్వహణ సామర్థ్యం మెరుగుపరుచుకోగలమని ఆయన తెలిపారు.

కుత్బుల్లాపూర్ రూపురేఖలు మార్చేస్తా

ఎమ్మెల్యే కేపీ వివేకానంద

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



అన్ని వర్గాల వర్గాల ప్రజల సహాయ సహకారాలతో రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేస్తూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ రూపురేఖలు మార్చేస్తారని స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు, సోమవారం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలో 'ప్రగతి యాత్ర'లో భాగంగా 38వ రోజు . గిరి నగర్, గురుమూర్తి నగర్లలో స్థానిక కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ గారితో కలిసి పాదయాత్ర చేస్తూ పూర్తి చేసిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ మేరకు గిరి నగర్ లో రూ.1.40 కోట్లతో, గురుమూర్తి నగర్ లో రూ.2.86 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేసినందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మిగిలి ఉన్న భూగర్భడ్రైనేజీ, వర్షపు నీటి కాలువ, మహిళా భవనం, బస్తీ దవాఖాన ఏర్పాటుకు కృషి చేయాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ను కోరడంతో త్వరలోనే వాటిని పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జయరాం, డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య, మాజీ అధ్యక్షుడు గౌసుద్దిన్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, డిఈఈ భాను చందర్, ఏఈ మల్లారెడ్డి, మేనేజర్ పూజిత, బస్తీ వాసులు సాయి, నయీం, భారతి, రమేష్, శ్రీకాంత్, హాశం, సాజిద్, శశి, జహంగీర్, మల్లేష్, అంజయ్య, వర్మ, ఈశ్వరి, పోచయ్య, చింటు, ఓంకార్ రెడ్డి, హర్షద్, ఫయాజ్, క్రాంతి, బాల్ రాజు, రామ్ నర్సయ్య, మజర్, నాయకులు జల్దా లక్ష్మీనాథ్, బాలు నేత, అల్లావుద్దీన్, తేజ తదితరులు పాల్గొన్నారు.

బాబాసాహెబ్ అంబేద్కర్, జగజీవన్ రామ్‌ల ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం

మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సతీష్ రానా మాదిగ

నవతెలంగాణ - బాలానగర్



ఫతేనగర్ మాదిగ సంక్షేమ సంఘం అత్యవసర సమావేశం సతీష్ రాన అధ్యక్షతన డివిజన్ పరిధిలోని ఎల్బీఎస్ నగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా భారతదేశ రాజ్యాంగాన్ని నిర్మించిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, బాబు జగజీవన్ రామ్ ల జయంతి ఉత్సవాలను జరుపుకోవడానికి సమావేశ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రాబోయే రోజులలో మాదిగల అభివృద్ధి కోసం ప్రభుత్వ పథకాలన్నీ గడపగడపకు చేరేలా సంక్షేమ సంఘం కృషి చేస్తుందని సతీష్ రానా తెలిపారు. ముఖ్యంగా యువ నాయకత్వాన్ని, మహిళా నాయకత్వాన్ని ముందుకు తీసుకురావడానికి సంఘం కృషి చేస్తుందన్నారు. మాదిగలకు సేవ చేయాలన్న ఆశయంతో శవపేటికలను సంఘానికి విరాళంగా ఇవ్వాలని, మాదిగ జాతిలో చనిపోయిన వారికి ఉచితంగా సంఘం తరఫున సర్వీసు చేయాలన్న తపన సంఘం నిర్ణయం తీసుకుందన్నారు. మాదిగల అభివృద్ధి కోసం కార్యక్రమాలు చేస్తూ ముందుకు వెళ్తూ వారి అభివృద్ధే లక్ష్యంగా మాదిగలకు కావలసిన విద్య, ఉద్యోగాలు, ఉపాధి కోసం రుణాలు వారు హక్కుల గురించి ప్రశ్నించే నాయకులుగా మాదిగల మనుగడ కొనసాగడానికి ముందుకు వెళదామన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అంశాలను మహానుభావుల సూచనల మేరకు ముందుకు వెళ్తామని మాదిగ జాతి నాయకుల పని విధానం, జాతి అభివృద్ధి కోసం ఏ సంఘం పనిచేస్తుందో జాతి బిడ్డలు గమనిస్తున్నారని, కావున ప్రతి ఒక్క మాదిగ బిడ్డ గమనించాలని సంఘం అధ్యక్షులు సతీష్ రానా మాదిగ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వంగల యాదగిరి మాదిగ, చైర్మన్ మర్రి కిషన్ మాదిగ, మహిళా చైర్ పర్సన్ యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది

తెలంగాణ కరాటే లెజింగ్ చైర్మెన్, హీరో సమన్

నవతెలంగాణ - బాలానగర్



బహిరంగ ప్రదేశాలు, పనిప్రదేశాల్లో ప్రమాదకర పరిస్థితుల్లో ఒంటరిగా ఉన్న మహిళలు, బాలికలు తమను తాము రక్షించుకునేందుకు మార్షల్ ఆర్ట్స్ శిక్షణ పొందడం తప్పనిసరిగా నేర్చుకోవాలని తెలంగాణ కరాటే లెజింగ్ చైర్మెన్, హీరో సమన్ అన్నారు. ఈ సందర్భంగా ఏషియన్ ఇంటర్‌నేషనల్ కరాటే 2023 చాంపియన్షిప్ రెండు రోజులుగా ఇటీవల గోవాలో జరిగిన ఇంటర్ నేషనల్ కరాటే ఛాంపియన్షిప్‌లో పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా కూకట్‌పల్లికి చెందిన విద్యార్థులు (జపాన్ కరాటే అసోసియేషన్ అకాడమిక్ విద్యార్థులు కో ఇంటర్‌నేషనల్ ఏషియన్ చాంపియన్‌షిప్)తో ముంబాయి, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్, జార?ండ్ రాష్ట్రాల జట్లు తలపడ్డాయి. ఈ పోటీల్లో ఫైనల్‌గా కుమితి, కటా విభాగాలలో చంద్రహాసిని, హర్షవర్ధన్ గౌడు, ప్రణవాక్షర గౌడు, మాధవ్, సాయి శ్రీ నిత్య, కార్తిక్, కీర్తి, బంగారు పతకాలు సాధించి మొదటి స్థానంలో నిలిచి చాంపియన్‌షిప్ బంగారు పతకాలు, సర్టిఫికెట్లు కైవసం చేసుకోవడం హర్షణీయమని సమన్ అన్నారు. కరాటే ఎంతో కఠోరమైన సాధనని అవిద్యను నేర్చుకున్న ప్రతి విద్యార్థినీ, విద్యార్థులు 100సంవత్సరాలు ఎలాంటి వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉంటారని, అంతేకాకుండా మంచి ఉన్నతస్థాయికి చేరుకుని అనుకున్న స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు వస్తాయని, ముఖ్యంగా కరాటే విద్యల వల్ల తప్పనిసరి పరిస్థితులో తన ప్రాణాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ కోచ్ రమేష్ చారిని విద్యార్థులను హీరో సుమన్ అభినందించారు.

పదవ తరగతి పరీక్షలు ప్రశాంతం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్, గాజుల రామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో పదవ తరగతి పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.(2022- 23)10వ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జీడిమెట్ల, బాలానగర్, జగద్గిరిగుట్ట,పెట్ బషీరాబాద్, పోలీస్ సిబ్బంది పర్యవేక్షణలో ఆయా పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష రాస్తున్న విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలకు గురి కాకుండా ఆయా పాఠశాలల యాజమాన్యాలు తగిన ఏర్పాట్లు చేశారు.



IN THE COURT OF THE XIX JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: HYERABAD
O.S.NO. 5234 OF 2022

Between:
Sri Rammohan Chitimilla
Rep by GPA Anjaneyulu .....plaintiff
AND
SMT.G.Anitha Reddy ....Defendant
TO,
Smt. G.Anitha Reddy W/o G.Surender Reddy Age 46years,Occ house wife ,R/o,Flat No.P1,Pent House, M/s Sai Shankar Apts, H.No 2-2-647/188/p,Central Excise Colony, Bagh Amberpet, Hyderabad,500036
Sir,
Please take notice that the above case is filed against you for recovery of possession and for other reliefs, against you, and same Is posted to 18.4.2023 for your appearance. If you fail to appear either in person or through your counsel, the matter will be decided in your absence on merit.
// BY ORDER OF THE COURT/
GOPAL RAO PATIL
SUNIL KULKARNI
Advocates
Flat No.202,Swgrugha Sri Laxmi Apts, 2-2-1105/4/2,Tilak Nagar,Hyderabad.

ప్రేమ పెళ్లికి తల్లి ఒప్పుకోలేదని యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ - బాలానగర్

ప్రేమించిన యువతితో పెళ్లికి తల్లి నిరాకరించిందని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కె.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం సాయినగర్ కు చెందిన అభిలాష్(25) మార్కెటింగ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఏడాది క్రితం ఓ అమ్మాయితో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఈ మేరకు ఇరువురు పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ఇదే విషయాన్ని అభిలాష్ తల్లి అన్నపూర్ణకు చెప్పగా ఆమె అంగీకరించ లేదు. ఈ క్రమంలోనే ఈనెల 1న సాయంత్రం బయటికి వెళ్లి రాత్రి ఒంటి గంట సమయంలో ఇంటికి వచ్చాడు. 2 గంటలకు ప్రేమించిన యువతి అన్నపూర్ణకు ఫోన్ చేసి అభిలాష్ చనిపోతానని చెబుతున్నాడని గమనించాలని చెప్పింది. వెంటనే అతను పడుకున్న గది తలుపు కొట్టగా ఎంతకీ తీయలేదు. స్థానికుల సహాయంతో పగులగొట్టి చూడగా ఫ్యానుకు ఉరేసుకుని కనిపించాడు. తల్లి ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రెండేళ్ల కిందట అన్నపూర్ణ కూతురు మృతి చెందగా, ఏడాది క్రితం భర్త చనిపోయాడు. ఇప్పుడు కొడుకును కోల్పోవడంతో ఆ తల్లి శోకసంద్రంలో మునిగిపోయింది.

రూ.2 కోట్ల 4 లక్షల వ్యయయంతో అభివృద్ధి పనుల ప్రారంభం

నవతెలంగాణ - బాలానగర్



కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం ఫతేనగర్ డివిజన్లోని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్‌తో కలిసి రూ.2 కోట్ల 4 లక్షల రూపాయల నిధులతో వివిధ ప్రాంతాల్లో సిసి రోడ్డు పునరుద్ధరణ పనులు కొరకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించే విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఎక్కడా రాజీ పడకుండా నిధులు సమకూరుస్తున్నారని, ఇప్పటికే కూకట్‌పల్లి ఆదర్శ నియోజకవర్గంగా మారుతుందన్నారు.అలాగే ఫతేనగర్ డివిజన్లోని అక్కడక్కడ డ్రైనేజీ సమస్యలున్నాయని, అవి కూడా త్వరలోనే పరిష్కరిస్తామని దీనికి సంబంధించి ప్రణాళికలు కూడా సిద్ధమయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా భూగర్భం నుంచి నీటి పైప్ లైన్లు వేస్తున్నామని పనులు జరుగుతున్న కారణంగా కొద్దిగా నీటి సమస్య తలెత్తే అవకాశం ఉండడం వల్ల ప్రజలు దీన్ని గమనించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ సత్యనారాయణ.ఏఈ శ్రీదేవి,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం అధ్యక్షులుగా దేవరాజు విష్ణువర్ధన్ రాజు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం అధ్యక్షులుగా వరుసగా రెండోసారి దేవరాజు విష్ణువర్ధన్ రాజు, ప్రధాన కార్యదర్శిగా ప్రతి కంఠం పూర్ణచంద్ర రాజులు ఎన్నికయ్యారు. ఈమేరకు నగరంలోని ఇంజాపూర్‌లో గల రాష్ట్ర భట్రాజు కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షులుగా విష్ణువర్ధన్ రాజు గెలుపొందారు. ఈ సందర్భంగా సంఘం యువజన విభాగం మాజీ అధ్యక్షులు బొల్లెపల్లి సీతారామరాజు, మేడ్చల్ జిల్లా భట్రాజు సంఘం అధ్యక్షులు కూరపాటి కరుణాకర్ రాజు, ప్రధాన కార్యదర్శి లోలభట్టు కృష్ణంరాజు, ప్రచార కార్యదర్శి సరస్వతి నరేందర్ రాజు, ఉపాధ్యక్షులు వ్యాసభట్టు నరేందర్ రాజు, చెన్నమాధవుని సుగుణాకర్ రాజు ,తంగేళ్ల సుజాత, కోశాధికారి ఏనుగదాటి శివాజీ రాజు, కార్యదర్శులు దేవరాజు సత్యాకర్ రాజు, నీలకంఠం లత, కమిటీ సభ్యులు లక్ష్మణరాజు, ఉడుమూడి సత్యవాణి, కుత్బుల్లాపూర్ నియోజక వర్గ అధ్యక్షులు తంగేళ్ల రాధాకృష్ణ కార్యనిర్వాహక కార్యదర్శి కూరపాటి శ్రీరామరాజు, సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమందచేసి శుభాకాంక్షలు తెలిపారు .అనంతరం శాలువాతో సన్మానించారు. రాష్ట్ర కార్యవర్గంలో మేడ్చల్ జిల్లాకు చెందిన వెంకట రమణ రాజు, చక్రాల రేవతినంద్ ,వ్యాసభట్టు బాలరాజు, వ్యాసభట్టు శ్రీనివాసరాజు నియమితులైనందుకు కుల బంధువులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు దేవరాజు విష్ణువర్ధన్ రాజు మాట్లాడుతూ దశాబ్ద కాలంగా చేస్తున్న సేవలను గుర్తించి అధ్యక్షులుగా గెలిపించినందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల భట్రాజు కులస్తులకు రుణపడి ఉంటానని అన్నారు. ఈ సందర్భంగా పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. భట్రాజు కులస్తుల సంక్షేమానికి వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేశారు. సంఘ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను అందరి సహాయ సహకారాలతో ఒక్కొక్కటిగా నెరవేరుస్తారని స్పష్టం చేశారు. వర్గవిభేదాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరిని కలుపుకుపోతూ రాష్ట్రంలోనే భట్రాజు కులాన్ని ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తామన్నారు.



IN THE COUT OF THE HON'BLE IX. ADDL. CHIEF JUDGE CITY CIVIL COUR , AT : HYDERABAD
O.S.NO. 759 OF 2019

Between
MallamAshok Prasad Aged about 36 years, Occ.Business, R/o. H.No.1-6-4-2/1, Road 42A,Chaitanyapuri, Phangri Colony, Dilshuknagar, Hyderbad-60 ..... Plaintiff
AND
S. Padmavathi& Other ..... Defendants

NOTICE

To,
1.M/s Neha Construction Rep by its Managing partner, NeelamShanker S/o.N.Mogulaiah, aged about 45 years, occ.Business,Flat No.G-6,E Venue apartments,H.No.8-2-293/3,Road no.14, BanjaraHills,Hyderabad. -Defendant No-2
2.Badavath Ramesh S/o Sri Bixam, resident of House No 1-8-677/13,Flat No G2,Padma colony Nallakunta, Hyderabad. Defendant No-3
Whereas the about named, plaintiff filed the suit for recovery of money the same is posted to 27/4/2023 for your appearance. Therefore you are required to appear before the above court on 27/04/2023 at 10:30 AM in person or through advocate failing which the matter will be heard in your absence and made ex-parte.
// BY THE ORDER OF THE HON'BLE COURT//
Date: 03/04/2023
Hyderabad
VENKATRAMI REDDY DONDETI
MYLA VIJAYA BHARATHI
Advocates
Counsel for the plaintiff Shop No.4, KPHB Main road, beside chandhana brothers, Kukatpally, Hyd-500071, TS
Cell No: 9741832535, 9949797389

IN THE COURT OF THE HON'BLE FAMILY COURT, AT L.B. NAGAR RANGA REDDY DISTRICT
F.C.O.P. No. 929 of 2022

Between:
Kamalpuri Sushmitha, D/o. Kamalapuri Veera Subramanyam,age 33 years, Occ: Administrator (DEO),R/o. Choudhary Residency Hills Colony, Road No.3/4, L.B. Nagar, Ranga Reddy District. ..... Petitioner
And
B.G.Omkar, S/o. Bhaskar Muniramaiah Setty Gowri Shankar,Age 38 years, Occ: Marketing, R/o. 7-1-52, Road No.2 Plot No.1, Prakashnagar, Hyderabad. .... Respondent

PUBLIC NOTICE

Please take notice that the Petitioner filed the above F.C.O.P. No. 929 of 2022, seeking the dissolution of marriage, before the Hon'ble Family Court, At L.B.Nagar, Ranga Reddy District, The case is posted on 19-04-2023 for your appearance. You are hereby required to appear either in person or through Advocate at 10.30. AM, failing which the matter will be decided on merits in ex-parte.
//By the order of the Hon'ble Court//
Vijayalakshmi Agisam
Advocate
1-3-1024/3&4, Flat No.101, G.Ramulu Residency, Kavadiguda,Hyderabad-500080, Cell: 9440215744

IN THE COURT OF THE HON'BLE XIX ADDL. JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD
O.S.No. 3532 of 2022

Between :
Kavuri Sridhar Rao ... PLAINTIFF
A N D
K. Padmavathi ...DEFENDANT
To,
K. Padmavathi W/o. Shankar,Aged 55 years, Occ: Housewife,H.No.22-2-369, Kamadwadi,Dabeerpura, Hyderabad.
Whereas the plaintiff filed the above case for specific performance of agreement of sale dt.17-02-2001 in respect of schedule property ie. house bearing No.16-2-751/A/31/D/65 over the area of 308 Sq.Yds. in T.S.No.170-H-10/3 in Road No.3, Lane No.2 of Tirumala Hills, Asmanghad, Gaddiannaram, Hyderabad. In the said case an application filed seeking ad-interim injunction to restrain you from alienating the above said properties. The above case and I.A. posted to 25-04-2023 for your appearance in the court at 10-30 A.M. If you fail to attend the court on that day the matter will be heard and decided in your absence.
(BY ORDER OF THE COURT)
B.Vijaya simha Reddy
Advocates
Plot o.175, Mithila Nagar, RCI road, Jillelaguda, Hyd-97

IN THE COURT OF THE HON'BLE PRL DISTRICT & SESSIONS JUDGE YADADRI-BHONGIR DISTRICT AT: BHONGIR
OS No. 182/2019

Between:
Muppalla Samba Shiva Rao ....plaintiff

Sri Aella Pitchi Reddy and 2 others. ....defendants
AND
To,
Sri Nimmala Venkata Reddy, S/o. Narayan Reddy, aged about 50 years, Occ: Advocate,R/o. Pochampally village, and Mandal, presently R/o.H.No.172/3, Road No.2-B, Chandrapurl Colony,Back side Citra Hotel, LB.Nagar, Hyderabad Telangana State, (defendant No.3)
The plaintiff filed the above suit for cancellation of Registered Sale deeds 6347/2018 & 6348 dated 23-07-2018 against the above defendant No.3 and others, But the above defendant No.3 has been avoiding to take summons. The Hon'ble court has directed to appear the above defendant No.3 in person or by a pleader duly instructed on an application to this court on 12-04-2023 at 10.30 "0" clock in the forenoon to show cause against the suit failing which the said sult will be heard
and determined exparte.
Lingamsetty Subba Rao
Advocate
Malkajgiri Hyderabad
Cell:9566979845

గౌరవనీయ III వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి (ఎక్సైజ్ కోర్టు) గారి న్యాయస్థానంలో సంగారెడ్డి వద్ద
ఓ.యస్. నెం. 906 ఆఫ్ 2021

దిగువ వారి మధ్య:
శ్రీ. బొగడ రఘు ...వాది
శ్రీ మతి గనుప సంధ్య మరియు ఇంకా ఓక్క వ్యక్తి ...ప్రతి వాదులు
దిగువ వారికి,
1) శ్రీమతి గనుప సంధ్య భర్త జీవన్ రెడ్డి వయస్సు: 40 సం., లు. వృత్తి: గృహిణి
2) శ్రీ గనుప జీవన్ రెడ్డి తండ్రి రాజు రామ్ రెడ్డి వయస్సు: 55 సం.,లు. వృత్తి: వ్యాపారం ఇద్దరి నివాసం : ఇంటి నెం. ఫ్లాట్ నెం. 2022, అమూల్య రెసిడెన్సీ, అరుణ కో-ఆపరేటివ్ సొసైట్ భాగ్యనగర్ కాలని, కుకట్ పల్లి, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం ...(ప్రతి వాదులు నెం, 1 మరియు 2)

ప్రకటన

గౌరవనీయ III rd అదనపు జూనియర్ సివిల్ జడ్జి (ఎక్సైజ్ కోర్టు) సంగారెడ్డి గారి సమక్షంలో సివిల్ దావా కెసు షెడ్యుల్ ఆస్తికి సంబంధించి మీ ఇదరిపై ఆస్తి తనఖా దావా రికవరీ అమౌంట్ కొరకు నా క్లయింట్ శ్రీ బొగడ రఘు సివిల్ దావా న్యాయస్థానం నందు దాఖలు చేసినారు, ఇట్టి దావా ఓ. యస్. నెం. 906 ఆఫ్ 2021 ఇట్టి కేసు మీ యొక్క హాజరు నిమిత్తం తేది: 03-05-2023 నాడు వాయిదా వేయనైనది, న్యాయస్థానం ఆదేశానుసారం ప్రకారం సదరు తేది: 03-05-2023 నాడు ఉదయం 10:30 గం,. లకు నేరుగా మీరు గాని మీ యొక్క న్యాయవాది ద్వారా గాని హాజరు కాగలరు, హాజరు అగుటకు విఫలమైన సందర్భంలో సదరు విషయం యోగ్యతనుసారం నిర్ణయించబడుతుంది.
న్యాయ స్థానం ఉత్తర్వు మేరకు
శ్రీ యం. సుదాకర్
న్యాయవాది
సంగారెడ్డి
సెల్: 9391060038.

IN THE COURT OF THE HON'BLE III ADDL. JUNIOR CIVIL JUDGE CUM SPECIAL EXCISE J.F.C.M. :: AT SANGAREDDY
O.S.N.O 906 of 2021

Between:-
Bogada Raghu. ...Plaintiff
A N D
Smt.Ganupa Sandhya & another. ...Defendants
To,
1. Smt.Ganupa Sandya, W/o. G.Jeevan Reddy, Aged: 40 yrs, Occ: Housewife, (Defendant No.1)
2. Ganupa Jeevan Reddy, S/o. Rajaram Reddy, Aged: 55 yrs, Occ: Business, Both are R/o. Flat No.202, Amulya Residency, Aruna Co-Operative Society, Bhagya Nagar Colony, Kukatpally, Hyderabad. (Defendant No.2)
Take notice that, the plaintiff filed the suit for Recovery of Money due under Mortgage Deed against the defendants. The said case vide O.S.N.O 906 of 2021 stands posted to 03-05-2023 at 10:30 AM., for your appearance before the Hon'ble III Addl. Junior Civil Judge cum Special Excise J.F.C.M. at Sangareddy. In default of your appearance on that day the matter will be heard ex-parte and decided accordingly.
//BY ORDER OF THE COURT//
M. SUDHAKAR,
Y. SANJEEVA RAO,
Advocates,
Sangareddy.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR
ARB. No. 570 OF 2020

Between:
KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED.,
Represented by its Divisional Manager, Mankammathota Branch, D. Hanumanth Rao S/o Bhoomaiah, age:57years, R/O. KARIMNAGAR, of above Chit fund.. ....Disputant
VERSUS
DANNAPUNENI LAXMAN RAO & Others
1. DANNAPUNENI LAXMAN RAO S/o. Rajeshwar Rao, Age: 58years, Occ: EP. OPRTR, RGM Ramagundam-III, R/o. H.no. ST 2-753, Centenary Colony, Rathnapur, Peddapally.
4. SAKINALA MOHAN RAO S/o. Banaiah, Age: 56years, Occ: General Mazdoor, G.D.K Ramagundam, R/o. H.no. Block 52H No. 724, Pothana Colony, Maredupalli, Ramagundam.
5. DANNAPUNENI SUNIL RAO S/o. Laxman Rao, Age: 36years, Occ: Bakery Products, Clay Oven Bakery, Hyderabad, R/o. H.no. 1-B-1, Flat No. 5, MIG – 2, Block-21, Hyderabad. .... Opponents
Take notice that the above dispute is filed against you and others for recovery of money Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on 27-04-2023 for your appearance On that day you have to appear in person at 11.00 A.M. Before the Deputy Register referred above. Other wise the case will be decided ex-party.
DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR
ARB. No. 240 OF 2020

Between:
KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED.,
Represented by its Divisional Manager, Karimnagar-I Branch, D. Hanumanth Rao S/o Bhoomaiah, age:57years, R/O. KARIMNAGAR, of above Chit fund. ....Disputant
VERSUS
RACHAKONDA SANTHOSH KUMAR & Others
1. Rachakonda Santhosh Kumar S/o. Venkateshwar Rao Age: 32years, Occ: Private Employee, R/o. H.no. 7-2-868, Mankammathota, Karimnagar.
5. Taduri Bhagya Laxmi D/o. Bhaskar Rao Age: 33years, Occ: Attender, Govt. Jr. College, R/o.H.no. 5-5-9, Old Patha Bazar, Karimnagar.
6. Rachakonda Chaitanya W/o. Anil Kumar Age: 31years, Sr. Recruiter, ANBLICKS Solutions Pvt. Ltd., R/o. H.no. G-.5, Deevam Honey, Beelam Gutla, Medchal, Hyderabad.
7. Rachakonda Venkateshwar Rao S/o. Sathyanarayana Age: 54years, Occ: Vasavi Glass Works, R/o. H.no. 8-80, Muthyampet, Mdl: Mallapuram, Karimnagar. .... Opponents
Take notice that the above dispute is filed against you and others for recovery of money Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on 27-04-2023 for your appearance On that day you have to appear in person at 11.00 A.M. Before the Deputy Register referred above. Other wise the case will be decided ex-party.
DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR

ఇక్కడ సదుపాయాల్లేవ్!

ప్రపంచ బాక్సింగ్ దిగ్గజం ఎం.సీ మేరీకోమ్ తర్వాత ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో రెండు పసిడి పతకాలు సాధించిన భారత బాక్సర్‌గా చరిత్ర సృష్టించిన తెలంగాణ సూపర్ స్టార్ నిఖత్ జరీన్.. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో తెలంగాణలో ప్రపంచ శ్రేణి బాక్సింగ్ అకాడమీ ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉంది. వరల్డ్ చాంపియన్‌గా రెండోసారి నిలిచిన అనంతరం తొలిసారి హైదరాబాద్‌కు వచ్చిన నిఖత్ జరీన్ సోమవారం ఎఫ్‌ఎన్‌సీసీ క్లబ్‌లో మీడియాతో ముచ్చటించింది. ఆ విషయాలు నిఖత్ జరీన్ మాటల్లోనే...!

- ప్రభుత్వ సహకారంతో అకాడమీ పెడతాను
- భారత స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్

నవతెలంగాణ-హైదరాబాద్

అకాడమీ ఏర్పాటు చేస్తా!

మన (తెలంగాణ) దగ్గర బాక్సింగ్‌కు మంచి సదుపాయాలు లేవు. చెప్పుకోదగిన బాక్సింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు, అకాడమీలు సైతం తెలంగాణలో లేవు. వర్ధమాన బాక్సర్ల కోసం ఇక్కడ ఓ మంచి బాక్సింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలని అనుకుంటున్నాను. ఎల్‌బి స్టేడియంలో బాక్సింగ్ రింగ్స్ ఉన్నాయి. కానీ నిర్వహణ బాగాలేదు. నిజాం కాలేజ్‌లో అవుట్‌డోర్ బాక్సింగ్ సదుపాయమే ఉంది. క్రీడాశాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ కవితతో మాట్లాడాను. త్వరలోనే బాక్సింగ్ అకాడమీ స్థాపనకు అవసరమైన స్థలం కేటాయిస్తారని అనుకుంటున్నాను. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో వరల్డ్‌క్లాస్ బాక్సింగ్ అకాడమీ ఏర్పాటు చేస్తాను.

ఒక్కో మెట్టుపైనే ధ్యాస

పారిస్ ఒలింపిక్స్‌లో పతకం నా లక్ష్యం. అందుకని ఇతర టోర్నమెంట్ల గురించి పట్టించుకోకుండా ఒలింపిక్ పసిడి స్వప్నించటం లేదు. ఒక్కో మెట్టు ఎక్కుతూ.. లక్ష్యానికి చేరువ కావాలనేది నా ప్రణాళిక. వరల్డ్ చాంపియన్‌షిప్స్ విజయం రానున్న ఆసియా క్రీడలు, పారిస్ 2024 ఒలింపిక్స్‌కు పెద్ద ప్రేరణ. వరల్డ్ చాంపియన్‌షిప్స్ పసిడితో ర్యాంకింగ్స్‌లో నం.1 కానున్నాను. దీంతో ఆసియా క్రీడల్లో సీడింగ్ లభించనుంది. ఆసియా క్రీడల్లో పసిడి పతకంతో 2024 ఒలింపిక్స్‌కు అర్హత సాధించాలని భావిస్తున్నాను.

తుది పోరు కఠిన సవాల్

ఏబీఐ ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో నా అత్యుత్తమ ప్రదర్శన సెమీఫైనల్లోనే. కానీ నాకు అత్యంత కఠిన సవాల్ ఎదురైన బౌట్ మాత్రం పసిడి పోరే. సెమీస్ బౌట్‌లో ఉత్తమ ప్రదర్శన చేశాను. ఫైనల్లో తొలి రౌండ్‌లో నాకు ఏకపక్ష ఆధిక్యం దక్కింది. రెండో రౌండ్‌లో ప్రత్యర్థి బాక్సర్‌కు స్వల్ప ఆధిక్యత లభించింది. దీంతో చివరి రౌండ్లో నేను చావోరేవో తేల్చుకోవాల్సిన స్థితి. ఈసారి వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో ఏకధాటిగా ఆరు బౌట్లలో పోటీపడ్డాను. ఇది సాధారణ విషయం కాదు.

అంచనాలే ప్రేరణ

2023 ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా నాపై అంచనాలు భారీగా ఉన్నాయి. టోర్నీకి నేను పోస్టర్ గర్ల్‌గా ఉన్నాను. అభిమానులు నా ఆట చూసేందుకు స్టేడియానికి భారీ సంఖ్యలో వచ్చారు. ఒలింపిక్ కేటగిరీలో తొలిసారి పోటీపడుతున్నాను. భారీ అంచనాలు నన్ను మరింత ప్రేరేపించాయి. కానీ ఇదే సమయంలో ఒకింత ఒత్తిడికి సైతం గురయ్యాను. వంద శాతం ప్రదర్శన ఇచ్చేందుకు దృష్టి పెట్టాను. అభిమానుల నుంచి లభించిన మద్దతు మరువలేనిదని నిఖత్ జరీన్ తెలిపింది.





జకోవిచ్ మళ్లీ నం.1

- ఏటీపీ ప్రపంచ ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ : సెర్బియా యోధుడు, టెన్నిస్ స్టార్ నొవాక్ జకోవిచ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మళ్లీ అగ్రస్థానంలోకి దూసుకొచ్చాడు. కోవిడ్-19 టీకా తీసుకోని జకోవిచ్ నిబంధనల కారణంగా గత నెల యుఎస్ టోర్నీల్లో ఆడలేదు. ఇండియన్స్ వెల్స్ టైటిల్ నెగ్గిన కార్లోస్ అల్కరాజ్ ఏటీపీ వరల్డ్ నం.1 ర్యాంక్ సొంతం చేసుకున్నాడు. తాజాగా మియామీ ఓపెన్‌లో కార్లోస్ అల్కరాజ్ సెమీఫైనల్లో నిష్క్రమించటంతో నొవాక్ జకోవిచ్ తిరిగి అగ్రస్థానానికి చేరుకున్నాడు. అల్కరాజ్ రెండో స్థానంలో నిలువగా, గ్రీసు కుర్రాడు స్టెఫానోస్ సిట్సిపాస్ మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. రష్యా ఆటగాడు డానిల్ మెద్వదేవ్ నాల్గో ర్యాంక్ సాధించాడు. ఇక ఇండియన్ వెల్స్ టైటిల్‌తో రికార్డు నెలకొల్పిన రోహన్ బోపన్న మెన్స్ డబుల్స్‌లో రెండు స్థానాలు దిగజారి 13వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. యూకీ బాంబ్రి (73), సాకెత్ మైనేని (75) రెండేసి స్థానాలు మెరుగయ్యారు. మెన్స్ సింగిల్స్‌లో సుమిత్ నాగల్ రెండు స్థానాలు మెరుగై 372వ స్థానంలో నిలిచాడు.

క్యాపిటల్స్, టైటాన్స్ ఢీ నేడు

ఐపీఎల్‌లో నేడు
ఢిల్లీ x గుజరాత్
వేదిక : న్యూఢిల్లీ
సమయం : రాత్రి 7.30
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..

న్యూఢిల్లీ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 16వ సీజన్ తొలి వారంలోనే లీగ్ దశలో రెండో మ్యాచ్‌కు జట్లు సిద్ధమవుతున్నాయి. సీజన్ ఆరంభ మ్యాచ్‌లోనే బోణీ కొట్టిన డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ నేడు తలపడనుంది. చెన్నై సూపర్‌కింగ్స్‌పై గుజరాత్ టైటాన్స్ అలవోక విజయం సాధించింది. కీలక ఆటగాళ్లు అందుబాటులో లేకపోయినా టైటాన్స్ ఏమాత్రం ఇబ్బంది పడలేదు. లక్నో సూపర్‌జెయింట్స్‌తో తొలి మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఫీల్డింగ్, బ్యాటింగ్ వైఫల్యంతో తగిన మూల్యం చెల్లించుకుంది. తొలి విజయం వేటలో ఢిల్లీ క్యాపిటల్స్ ఉండగా, గెలుపు జోరు కొనసాగించేందుకు టైటాన్స్ ఎదురు చూస్తోంది. సొంతగడ్డపై సీజన్ తొలి మ్యాచ్ ఆడనున్న ఢిల్లీ క్యాపిటల్స్‌ను కెప్టెన్ డెవిడ్ వార్నర్ ఏ మేరకు గెలుపు పథంలో నడిపిస్తాడో చూడాలి.



చెన్నై ఛమక్!

లక్నోపై సూపర్‌కింగ్స్ గెలుపు • రుతురాజ్, కాన్వే ధనాధన్

మూడేండ్ల అనంతరం సొంతగడ్డపై తొలి మ్యాచ్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ ఆ ఉత్సాహం, ఓ జోష్ పరుగుల రూపంలో స్పష్టంగా చూపించింది. రుతురాజ్ గైక్వాడ్, డెవాన్ కాన్వే, అంబటి రాయుడు, ఎం.ఎస్ ధోని ధనాధన్ దంచుడు షోతో తొలుత 217 పరుగుల భారీ స్కోరు చేసింది. భారీ ఛేదనలో లక్నో సూపర్‌జెయింట్స్ 205 పరుగులు చేయగా సూపర్‌కింగ్స్ 12 పరుగుల తేడాతో గెలుపొందింది.

నవతెలంగాణ-చెన్నై

రుతురాజ్ గైక్వాడ్ (57, 31 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) మరో అర్థ సెంచరీ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. డెవాన్ కాన్వే (47, 29 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), అంబటి రాయుడు (27 నాటౌట్, 14 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించటంతో చెన్నై సూపర్‌కింగ్స్ ఐపీఎల్16 సీజన్లో తొలి విజయం సాధించింది. లక్నో సూపర్‌జెయింట్స్ 218 పరుగుల భారీ ఛేదనలో 205 పరుగులే చేసింది. ఓపెనర్ కైల్ మేయర్స్ (53, 22 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌తో లక్నోను రేసులో నిలిపినా.. ఇతర బ్యాటర్లు అంచనాల మేరకు రాణించలేదు. కెప్టెన్ కెఎల్ రాహుల్(20), మార్కస్ స్టోయినిస్ (21), నికోలస్ పూరన్ (32), ఆయుశ్ బదానీ (23), కృష్ణప్ప గౌతమ్ (17 నాటౌట్), మార్క్‌వుడ్ (10 నాటౌట్) ఓటమి అంతరాన్ని కుదించారు. సూపర్‌కింగ్స్ స్పిన్నర్ మోయిన్ అలీ (4/26) మ్యాజిక్‌తో లక్నో బ్యాటర్లను కట్టడి చేశాడు.



ధనాధన్

టాస్ నెగ్గిన లక్నో సూపర్‌జెయింట్స్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. సొంత మైదానంలో తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన చెన్నై సూపర్‌కింగ్స్ చెపాక్ స్టేడియాన్ని హోరెత్తించింది. ఓపెనర్లు రుతురాజ్ గైక్వాడ్ (57), డెవాన్ కాన్వే (47) తొలి వికెట్‌కు అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. కెరీర్ భీకర ఫామ్‌లో ఉన్న రుతురాజ్ గైక్వాడ్ ఆరంభం నుంచీ లక్నో బౌలర్లపై ఎదురుదాడి చేశాడు. వికెట్‌కు రెండు ఎండ్‌లా రుతురాజ్, కాన్వేలు దంచికొట్టడంతో తొలి పది ఓవర్లలో పరుగుల వరద పారించింది. రుతురాజ్ గైక్వాడ్ రెండు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 25 బంతుల్లోనే సీజన్లో రెండో అర్ధ సెంచరీ బాదాడు. పవర్‌ప్లే (6 ఓవర్లు) ముగిసేసరికి సూపర్‌కింగ్స్ 79/0తో నిలిచింది. డెవాన్ కాన్వే సైతం ఊపందుకోవటంతో చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు స్కోరు 49 బంతుల్లోనే 100 పరుగుల మార్క్ తాకింది. దీంతో చెన్నై సూపర్‌కింగ్స్ భారీ స్కోరుకు గట్టి పునాది పడింది. వరుస ఓవర్లలో రుతురాజ్, డెవాన్ కాన్వేలు నిష్క్రమించటంతో ద్వితీయార్థం ఆరంభంలో స్కోరు వేగం నెమ్మదించింది. శివం దూబె (27, 16 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), అంబటి రాయుడు (27, 14 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) సూపర్‌కింగ్స్ జోరు కొనసాగించారు. రవి బిష్ణోయ్‌పై వరుస సిక్సర్లు కొట్టిన శివం దూబె అతడికే వికెట్ కోల్పోయాడు. తెలుగు తేజం అంబటి రాయుడు రెండేసి ఫోర్లు, సిక్సర్లతో అజేయంగా నిలిచాడు. చివరి ఓవర్లో క్రీజులోకి వచ్చిన ఎం.ఎస్ ధోని ఎదుర్కొన్న తొలి రెండు బంతులను స్టాండ్స్‌లోకి పంపించి చెపాక్ స్టేడియాన్ని ఉత్సాహ సంద్రంలో ముంచేశాడు!. చివరి పది ఓవర్లలో బ్యాటర్ల జోరు కాస్త తగ్గినా.. సూపర్‌కింగ్స్ 217 పరుగులు పిండుకుంది. లక్నో సూపర్‌జెయింట్స్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ (3/28) గొప్ప ప్రదర్శన చేశాడు. మార్క్‌వుడ్ (3/49) సైతం మూడు వికెట్లు పడగొట్టాడు



స్కోరు వివరాలు :
చెన్నై సూపర్‌కింగ్స్ : 217/7 (రుతురాజ్ గైక్వాడ్ 57, డెవాన్ కాన్వే 47, రాయుడు 27, రవి బిష్ణోయ్ 3/28)
లక్నో సూపర్‌జెయింట్స్ : 206/7 (కైల్ మేయర్స్ 53, నికోలస్ పూరన్ 32, మోయిన్ అలీ 4/26, తుషార్ 2/45)

వినలేదు చూడలేదు..

రవితేజ నటించిన క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ 'రావణాసుర'. సుధీర్ వర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అభిషేక్ పిక్చర్స్, ఆర్ టీ టీమ్ వర్క్స్‌పై అభిషేక్ నామా, రవితేజ నిర్మించారు. హీరో సుశాంత్ కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఈనెల 7న సమ్మర్ స్పెషల్‌గా రిలీజ్ కానుంది.
ఈ నేపథ్యంలో సుశాంత్ మీడియాతో ఈ సినిమా విశేషాలను షేర్ చేసుకున్నారు. "సుశాంత్ యాజ్ రామ్' అని రావణాసుర పోస్టర్ రిలీజ్ చేశారు. 'రావణాసుర' టైటిల్ రోల్ రవితేజ చేస్తున్నారు. ట్రైలర్ చూస్తే గ్రే షేడ్స్ అందరికీ ఉన్నాయి. 'హీరోస్ డోంట్ ఎగ్జిస్ట్' అనే ట్యాగ్‌లైన్ ఉంది. మరి ఇందులో రాముడు ఎవరో.. రావణాసురుడు ఎవరో సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. ఇది చాలా ఎగ్జైటింగ్ థ్రిల్లర్. కొత్త ఎలిమెంట్స్ ఉన్నాయి. ట్రీట్‌మెంట్ కొత్తగా ఉంటుంది. ఈ సినిమాలో రవితేజ పాత్ర చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఆయన్ని ఎప్పుడూ ఇలా చూడలేదు. నా పాత్ర కూడా చాలా కీలకంగా ఉంది. రవితేజతో కాంబినేషన్ సీన్లు ఖచ్చితంగా చాలా ఆసక్తికరంగా ఉంటాయి. ఇది చాలా డిఫరెంట్ మూవీ. ఇలాంటి కాన్సెప్ట్ తెలుగు సినిమాల్లో ఇప్పటివరకూ వినలేదు, చూడలేదు. నిర్మాత అభిషేక్‌తో గ్రేట్ జర్నీ. ఈ సినిమాలో ఈ పాత్రకి నన్ను తీసుకోవాలనే ఆలోచన కూడా ఆయనదే. ఇందులోని నా పాత్రని ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారోనని ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. సోలో హీరోగా ఈ ఏడాది ఒక సినిమా ఉంటుంది. అలాగే చిరంజీవి గారితో 'భోళా శంకర్' సినిమా చేస్తున్నా' అని అన్నారు.



సుశాంత్

మెప్పించే యూనివర్సల్ కాన్సెప్ట్



సంయుక్త మీనన్, సాయిధరమ్ తేజ్

సాయిధరమ్ తేజ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా మిస్టిక్ థ్రిల్లర్ 'విరూపాక్ష'. సంయుక్తమీనన్ కథానాయిక. కార్తీక్ దండు దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పీ, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై బాపినీడు బి.సమర్పణలో బీవీఎస్‌ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈనెల 21న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం విడుదల కానుంది.
తాజాగా ఈ మూవీ నుంచి పాత్రలను పరిచయం చేస్తూ నిర్వహించిన వేడుకలో చిత్రయూనిట్ పాల్గొంది.సాయి ధరమ్ తేజ్ మాట్లాడుతూ, 'డైరెక్టర్ కార్తీక్ ఈ కథ చెప్పినప్పుడే ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుందని అప్పుడే ఫిక్స్ అయ్యాను. అందర్నీ భయ పెట్టే స్టోరీ ఇది. ఈ సినిమాను చూసి మా అమ్మ, మీ అమ్మ గారు గర్వంగా చెప్పుకుంటారు. ఈ సినిమాకు కథే హీరో" అని తెలిపారు. కార్తిక్ దండు మాట్లాడుతూ,'మంచి కాన్సెప్ట్‌తో సినిమా తీశాం. కచ్చితంగా అందరికీ నచ్చుతుంది' అని చెప్పారు.'ఈ సినిమాకి సాంకేతిక నిపుణులే ప్రాణం. ఇది యూనివర్సల్ సబ్జెక్ట్. అందుకే పాన్ ఇండియా వైడ్‌గా రిలీజ్ చేస్తున్నాం' అని నిర్మాత బీవీఎస్‌ఎన్ ప్రసాద్ చెప్పారు.

నవచిత్రం

4 భాషల్లో మిషన్ : చాప్టర్1 రిలీజ్

భారీ బడ్జెట్ చిత్రాలను రూపొందిస్తూ వరుస సక్సెస్‌లను సొంతం చేసుకుంటున్నారు ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్. సినిమాలను నిర్మించటంతో పాటు డిస్ట్రిబ్యూషన్ రంగంలోనూ తనదైన పంథాలో విజయాలు సాధిస్తున్నారు. '2.0', పొన్నియిన్ సెల్వన్, ఇండియన్ 2 వంటి చిత్రాలు సహా ఎన్నో భారీ చిత్రాలను లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోన్న సంగతి తెలిసిందే. 'తాజాగా లైకా సంస్థ 'మిషన్: చాప్టర్ 1' చిత్రాన్ని నాలుగు భాషల్లో భారీ ఎత్తున విడుదల చేయటానికి సిద్ధమైంది. కోలీవుడ్ హీరో అరుణ్ విజయ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ భారీ బడ్జెట్ చిత్రమిది. ఇది కూడా లైకా ప్రొడక్షన్స్ నుంచి రాబోతోంది. ఈ చిత్రానికి ఎం.రాజశేఖర్, ఎస్.స్వాతి నిర్మాతలు. దర్శకుడు విజయ్ ఈ చిత్రాన్ని కేవలం 70 రోజుల్లో లండన్, చెన్నై సహా పలు లొకేషన్స్‌లో శరవేగంగా చిత్రీకరించటం గొప్ప విషయం. అద్భుతమైన టెక్నికల్ అంశాలతో రూపొందిన ఈ చిత్రం హీరో అరుణ్ విజయ్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తుంది. ఎమీ జాక్సన్ ఈ చిత్రంలో జైలును సంరక్షించే ఆఫీసర్ పాత్రలో, నిమిషా సజయన్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. జి.వి.ప్రకాష్ సంగీత సారథ్యాన్ని వహిస్తున్నారు. స్టంట్ సిల్వ కంపోజ్ చేసిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు ఆహా అనిపిస్తాయి. ఈ సినిమాలో చిత్రీకరించిన నైట్ షాట్స్, డ్రామా ప్రేక్షకులను ఉత్కంఠతకు గురిచేస్తాయి' అని మేకర్స్ అన్నారు.



ఎమీ జాక్సన్, అరుణ్ విజయ్

రెయిన్‌బో మొదలైంది




దేవ్ మోహన్, రష్మిక మందన

రష్మిక మందన ప్రధాన పాత్రలో బ్రీజీ రొమాంటిక్ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం 'రెయిన్‌బో'. ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మాతలు ఎస్ఆర్. ప్రకాష్ బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు శాంతరూబన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్ర ప్రారంభోత్సవం సోమవారం గ్రాండ్‌గా జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి అమల అక్కినేని క్లాప్ కొట్టగా, అల్లు అరవింద్ కెమెరా స్విచాన్ చేశారు. సురేష్ బాబు స్క్రిప్ట్ అందించారు. నటుడు దేవ్ మోహన్ ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నారు. జస్టిన్ ప్రభాకరన్ సంగీతం, భాస్కరన్ సినిమాటోగ్రఫీ.. ఈ రెండూ సినిమాలో ప్రధాన ఆకర్షణగా ఉండబోతున్నాయి. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ప్రొడక్షన్ డిజైనర్ బంగ్లాన్ ప్రొడక్షన్ డిజైన్ ఇన్‌ఛార్జ్‌గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా రష్మిక మాట్లాడుతూ, 'రెయిన్‌బో' కోసం చాలా ఎగ్జైటెడ్‌గా ఉన్నాను. దర్శకుడు దర్శకుడు శాంతరూపన్ అద్భుతమైన కథతో వచ్చారు' అని తెలిపారు. "ఒకే ఒక జీవితం' తర్వాత మరో మంచి కథతో మీ ముందుకు రాబోతున్నాం. రష్మికతో సరికొత్త కథాంశంతో రాబోతున్న ఈ సినిమా కూడా తప్పకుండా మిమ్మల్ని అలరిస్తుందని నమ్ముతున్నాం' అని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ అధినేత ప్రకాష్‌బాబు చెప్పారు.

డబుల్ బ్లాక్‌బస్టర్

నాని నటించిన పాన్ ఇండియా ఎంటర్‌టైనర్ 'దసరా'. మార్చి 30న ప్రపంచవ్యాప్తంగా విడుదలై బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. కీర్తి సురేష్ కథానాయికగా, నూతన దర్శకుడు శ్రీకాంత్ ఒదెల దర్శకత్వంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి భారీ ఎత్తున నిర్మించిన ఈ చిత్రానికి అన్ని వర్గాల ప్రేక్షకులని నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. బాక్సాఫీసు వద్ద ప్రభంజనం సృష్టిస్తూ సక్సెస్‌ఫుల్‌గా ప్రదర్శితమవుతోంది.



నాని

ఈ సందర్భంగా హీరో నాని మీడియాతో మాట్లాడుతూ, 'ఈ సినిమా చూసిన వారంతా గొప్పగా స్పందిస్తుంటే, దీని కోసమే కదా సినిమా తీశాం అనిపించిది. చాలా ఆనందంగా ఉంది. రామ్‌చరణ్‌కు 'రంగస్థలం', అల్లుఅర్జున్‌కి 'పుష్ప', నాకు 'దసరా' అని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటే, నటుడిగా హ్యాపీగా ఫీల్ అయ్యా. కానీ తృప్తి పడలేదు. సినిమా చేస్తున్నప్పుడే శ్రీకాంత్ చాలా పెద్ద డైరెక్టర్ అవుతాడని చెప్పాను. ప్రేమ, స్నేహం, పగ యూనివర్సల్‌గా కనెక్ట్ అయ్యే ఎమోషన్స్. మన కల్చర్‌ని సెలబ్రేట్ చేసుకునే సినిమా ఏదైనా దొరికితే అది అందరి దగ్గరకి తీసుకెళ్లడం మన బాధ్యత. ఈ సినిమా చేస్తున్నపుడు 'బతుకమ్మ'తో పాటు చాలా విషయాలు నేర్చుకున్నాను. దసరా మాస్ సినిమా. మేం ఊహించిన దానికంటే పెద్ద బ్లాక్‌బస్టర్ అయ్యింది. ఈ సినిమాకి నార్త్ నుంచి రెస్పాన్స్ చాలా అద్భుతంగా ఉంది. ఒక ఇమేజ్ వచ్చిన తర్వాత 'సేఫ్ గేమ్ ఆడాలని అందరూ అనుకుంటారు. అయితే 'సేఫ్ గేమ్ గొడవే మనకి లేదు (నవ్వుతూ)' అని తెలిపారు.

మరో అద్భుతమైన పాట

ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య, విరాజ్ అశ్విన్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'బేబీ'.మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎస్కేఎన్ నిర్మాణంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్రం నుంచి గతంలో విడుదల చేసిన ఫస్ట్ లిరికల్ సాంగ్ కు అద్భుతమైన స్పందన వచ్చింది. లేటెస్ట్‌గా ఈ మూవీ నుంచి సెకండ్ లిరికల్ సాంగ్‌ను చిత్ర బృందం రిలీజ్ చేసింది. మొదటి పాటకు పూర్తి భిన్నంగా ఉంటూనే, వైవిధ్యమైన టోన్‌లో మరో అద్భుతమైన పాటలా కనిపిస్తోంది. ఈ పాటను మలయాళంలో మోస్ట్ ఫేమస్ సింగర్‌గా పేరు తెచ్చుకున్న ఆర్య దయాళ్ పాడారు. అంతే కాదు.. ఓ పెద్ద బడ్జెట్ సినిమా రేంజ్‌లో భారీ సెట్స్ వేసి మరీ ఈ గీతాన్ని వీడియోగానూ చిత్రీకరించారు. ఈ పాటలో ఆర్యదయాళ్ స్వయంగా యాక్ట్ చేయడం విశేషం.
విజయ్ బుల్గానిన్ స్వరపరిన ఈ గీతాన్ని త్రిపురనేని కళ్యాణ్ చక్రవర్తి రాశారు. సంస్కృత పదాలతో మొదలైన పాట ఆసాంతం కట్టిపడేశాలా సాహిత్యం, కంపోజింగ్ ఉన్నాయి. గ్రామీణ ప్రాంతం నుంచి నగరంలోని పెద్ద కాలేజ్‌కు చదువుకోవడానికి వెళ్లిన ఓ అమ్మాయికి కనిపించే కొత్త ప్రపంచం అంతా నిజం కాదనీ.. 'నిజమనుకునే క్రీనీడలే అడుగడుగునా ఉంటాయనీ.. తెలుపదు కదా ఓ పాఠమై చదువే.. భ్రమల మైకాన భ్రమణమే చేసి భ్రమరమవుతుంది కాలమే'.. అనే అద్భుతమైన సాహితీ విలువలున్న ఈ గీతం మాంటేజ్ పాటలా ఉంది. మొదటి పాటకు వచ్చిన రెస్పాన్స్ తర్వాత కథను ముందుకు నడిపించేలా ఉన్న ఈ గీతం కూడా 'బేబీ'పై అంచనాలు పెంచేలా ఉంది. మ్యూజికల్‌గా ఈ సినిమా మరో సంచలనం కాబోతోందని రెండో పాట కూడా చూసిన తర్వాత అర్థం అవుతోంది. 'హృదయ కాలేయం', 'కలర్ ఫోటో', 'కొబ్బరిమట్ట' చిత్రాల దర్శకుడు సాయి రాజేశ్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేశారు. ఈ సినిమా ఆనంద్ దేవరకొండకి మంచి పేరు తీసుకొస్తుంది. ఆయన కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమా. త్వరలోనే ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. మంచి కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందనే నమ్మకంతో మేకర్స్ ఉన్నారు. నాగబాబు, లిరీష తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎడిటింగ్: విప్లవ్ నైషధం, సినిమాటోగ్రఫీ: ఎమ్ఎన్ బాల్ రెడ్డి, కో ప్రొడ్యూసర్: ధీరజ్ మొగిలినేని.



ఆర్య దయాళ్, వైష్ణవి చైతన్య

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

వామపక్ష ప్రభుత్వాల హయంలో మూడు రాష్ట్రాల్లో పట్టణ ఉపాధి హామీ చట్టం

కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యేక చట్టాలు

- కేంద్ర ప్రభుత్వం అమలు చేయదు : రాజ్యసభలో కేంద్ర మంత్రి కౌషల్ కిశోర్

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష ప్రభుత్వాల పాలనలో పట్టణ ఉపాధి హామీ పథకాలను అమలు చేశాయనీ, అందుకు ప్రత్యేకంగా చట్టాలు కూడా రూపొందించాయని కేంద్ర పట్టణ వ్యవహారాల సహాయ మంత్రి కౌషల్ కిశోర్ తెలిపారు. రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ వి.శివదాసన్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

కేరళలో అయ్యంకాలి పట్టణ ఉపాధి హామీ కార్యక్రమం 2010 నుంచి, త్రిపురలో త్రిపుర పట్టణ ఉపాధి కార్యక్రమం 2009 నుంచి, పశ్చిమ బెంగాల్‌లో పశ్చిమ బెంగాల్ పట్టణ ఉపాధి హామీ పథకం 2010 నుంచి అమల్లో ఉన్నాయని చెప్పారు. 'ఆయా రాష్ట్రాల్లో పట్టణ ఉపాధి హామీ పథకాలు తీసుకొచ్చినప్పుడు వామపక్ష ప్రభుత్వాలే ఉన్నాయి. కేరళలో వీఎస్ అచ్యుతానందన్ ప్రభుత్వం, త్రిపురలో మాణిక్ సర్కార్ సర్కారు, పశ్చిమ బెంగాల్‌లో బుద్ధదేవ్ భట్టాచార్య ప్రభుత్వం అధికారంలో ఉంది.



ఈ మూడు రాష్ట్రాలతో పాటు ఒరిస్సా, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో 2020 నుంచి అమలు అవుతుందనీ, రాజస్థాన్‌లో 2022-23 బడ్జెట్‌లో ప్రకటించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎటువంటి పట్టణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసేందుకు ప్రణాళిక రచించలేదని స్పష్టం చేశారు. ఈ పథకాల విషయంలో ఆ రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేయలేదని తెలిపారు.

ఏపీలో మూడు విమానాశ్రయాల ప్రయివేటీకరణ

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, తిరుపతి, రాజమండ్రి విమానాశ్రయాలను ప్రయివేటీకరించనున్నట్టు పౌర విమాన యాన శాఖ సహాయ మంత్రి జనరల్ వికె సింగ్ (రిటైర్డ్) తెలిపారు. రాజ్యసభలో ఓ ప్రశ్నకు సోమవారం ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు. దేశవ్యాప్తంగా మొత్తం 25 విమానాశ్రయాలను లీజుకు ఇవ్వడం ద్వారా 2025 నాటికి రూ.10,782 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేసినట్టు మంత్రి పేర్కొన్నారు. విమానాశ్రయాల ప్రయివేటీకరణ విమానాల రాకపోకలు, మార్కెట్ పరిస్థితులు, పెట్టుబడిదారుల ఆసక్తి, లావాదేవీల నిబంధనలపై ఆధారపడి ఉంటుందని మంత్రి వెల్లడించారు.

'నమామి గోదావరి' ప్రాజెక్టు ప్రతిపాదన లేదు

గంగా నది ప్రక్షాళనకు ఉద్దేశించిన 'నమామి గంగలా గోదావరి ప్రక్షాళనకు 'నమామి గోదావరి' ప్రాజెక్టు చేపట్టే ప్రతిపాదన లేదని జలశక్తి సహాయ మంత్రి బిశ్వేశ్వర్ టుడు తెలిపారు. వైసీపీ ఎంపి విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయం

- ప్రజాతంత్ర, లౌకిక, వామపక్ష కూటమిదే అధికారం : కూనంనేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చెప్పారు. ప్రజాతంత్ర, లౌకిక, వామపక్ష కూటమిదే అధికారమని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్ మఖ్దూం భవన్‌లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలు ప్రజా సంఘాల ఆఫీస్ బేరర్ల సమావేశాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నర్సింహ్మా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఈనెల 14 నుంచి వచ్చేనెల 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో జరిగే ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో భాగంగా ఈనెల14న హైదరాబాద్, ఇందిరాపార్కు వద్ద జరిగే ప్రారంభ సభను, వచ్చేనెల 14న కొత్తగూడెంలో లక్షలాది మందితో పెద్ద ఎత్తున నిర్వహించే ముగింపు బహిరంగ సభను జయప్రదం చేసేందుకు పార్టీ, ప్రజా సంఘాల శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా పాలకులు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం సమరశీలంగా ఉద్యమించాలన్నారు. బీజేపీ హఠావో-దేశ్‌కో బచావో నినాదంతో ప్రజలను చైతన్య పరుస్తామని చెప్పారు. దేశంలో బీజేపీకి కొన్ని రాష్ట్రాల్లోనే అధికారం ఉందని, ప్రజాస్వామ్యాన్ని అవహాస్యం చేసేలా బలం లేని రాష్ట్రాల్లో కూడా అధికారాన్ని దక్కించుకోవాలనే దుర్మార్గపు విధానాలను ప్రోత్సహిస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్నదని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, ఎన్ బాలమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిబద్ధతతో వ్యవహరించాలి

- టెన్త్‌విద్యార్థుల ఏకాగ్రత చెడకుండా చూడాలి : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పరీక్షా కేంద్రాల పర్యవేక్షకులు, ఇన్విజిలేటర్లుగా ఉన్న ఉపాధ్యాయులు నిబద్ధతతో వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పదో తరగతి విద్యార్థులు మొదటిసారిగా పబ్లిక్ పరీక్షలను రాస్తున్నారని తెలిపారు. వారి ఏకగ్రత చెడిపోకుండా చూడాలని, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసే వాతావరణం కల్పించాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులపైనే ఉంటుందని సూచించారు. ఒకరో, ఇద్దరో అనైతిక పద్ధతులకు పాల్పడితే మొత్తం ఉపాధ్యాయులు ఆ నిందను మోయాల్సి వస్తుందని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఏ విధమైన అక్రమాలకు ఆస్కారం లేకుండా ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పేదల అభివృద్ధి టీడీపీతోనే : కాసాని



నవతెలంగాణ - హైదరాబాద్

పేదలు, బడుగు, బలహీనవర్గాల సంక్షేమం, అభివద్ధికోసం అంకితభావంతో పనిచేసేది టీడీపీనేనని ఆపార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. సోమవారం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన సమక్షంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ నుంచి వివిధ పార్టీలకు చెందినవారు టీడీపీలో చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ టీడీపీ హయంలో బీసీలకు స్థానిక సంస్థలలో మొదటి సారిగా రిజర్వేషన్ కల్పించడం జరిగిందని అన్నారు. వీటి వల్ల వెనుకబడిన వర్గాలు నాయకులుగా ఎదిగారని గుర్తు చేశారు. ఖమ్మం సభ, తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను విజయవంతంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇంటింటికి టీడీపీ కార్యక్రమం ద్వారా పార్టీ చేసిన అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గ్రామానికి, వార్డు వరకు పార్టీ శ్రేణులు కరపత్రాల ఇంటింటికి తీసుకెళ్తున్నారని అన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయమని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం చారిత్రక అవసరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ బియ్యని సురేష్, రాష్ట్ర నాయకులు పొలంపల్లి అశోక్, కనకాల సాంబశివరావు, మెట్టుగాని శ్రీనివాస్‌తోపాటు పార్టీలో చేరిన వల్లభనేని జాహ్నవి, సుజాత, సురేఖ, సుమ, ఎం. లక్ష్మీ, జె. వినోద్, రామకష్ణ, వీరాచారి తదితరులున్నారు.

ఈసీ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

- ఏఐటీయూసీ ధర్నా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఏండ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న యూరోపియన్ కమిషన్ (ఈసీ) ఏఎన్‌ఎంల సేవలను క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కోఠిలోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసుఫ్ మాట్లాడుతూ ఈసీ ఏఎన్‌ఎంలు 2002లో డీయస్సీ రాత పరీక్షలు రాసి మెరిట్ ప్రకారం, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లో, రోస్టర్ విధానాన్ని పాటిస్తూ ఎంపికయ్యారని గుర్తుచేశారు. అలా ఎంపికైన వారంతా రెగ్యులర్ అయి నెలకు రూ.ఒక లక్ష జీతం తీసుకుంటుండంగా, ఈసీ ఏఎన్‌ఎంలను మాత్రం కాంట్రాక్టు ఉద్యోగులుగా పరిగణిస్తూ నెలకు రూ.27,000 మాత్రమే చెల్లిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ ఇదే పని చేస్తున్న పురుష వర్కర్లకు రూ.41,000 జీతం ఇస్తూ మహిళలు రూ.27,000తో సరిపెట్టడం వివక్ష చూపించడమేనని విమర్శించారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 16లో ఈసీఏఎన్‌ఎంలను చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు తోట రామాంజనేయులు, ఈసీ ఏఎన్‌ఎంలు టి మంజుల, ఎం విజయలక్ష్మి, హసీనా, జి.అనిత, ఆర్. రాజ్యలక్ష్మి, పి నవీన, ఏ.సుమతి, జి. అనిత, టి.అమృత, బి. జోష్న, ఎస్. సులోచన, ధనలక్ష్మి, ఆర్.రూప, ఏ.లలిత, ప్రియదర్శిని, భారతి, శ్రీమతి, వసంతా, సంపూర్ణ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల కోసం ప్రతిపక్షాలు ఏకం కావాలి

- వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నిరుద్యోగ యువత కోసం రాజకీయాలను పక్కన బెట్టి ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా ఉద్యమించాల్సిన)అవసరముందని వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. టీ సేవ్(తెలంగాణ స్టూడెంట్స్ యాక్షన్ ఫర్ వేకెన్సీ అండ్ ఎంప్లాయిమెంట్) ఫోరాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి ఎవరు నాయకత్వం వహించినా వైఎస్‌ఆర్ టీపీ వారితో కలిసి పనిచేస్తున్నదని తెలిపారు.

మోడీ ఏ కాలేజీ నుంచి పట్టా పొందారు..? : ఉద్ధవ్



న్యూఢిల్లీ: వారం రోజులుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ డిగ్రీ సర్టిఫికెట్ వ్యవహారం దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మోడీ డిగ్రీ సర్టిఫికెట్ వివరాలు అడిగినందుకుగానూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు గుజరాత్ హైకోర్టు రూ. 25 వేలు జరిమానా విధించిన విషయం తెలిసిందే. ప్రధాని మోడీ విద్యార్హత పత్రాలను బయటపెట్టాల్సిన అవసరం లేదని కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే మోడీ సర్టిఫికెట్ వ్యవహారం మరింత వివాదాస్పదంగా మారింది. తాజాగా ఇదే అంశంపై శివసేన చీఫ్ మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే స్పందించారు. మోడీపై విమర్శలు గుప్పించారు. 'దేశంలో డిగ్రీ చదివిన యువతకు ఉద్యోగాలు లేకుండా పోయా యి. మోడీని డిగ్రీ సర్టిఫికెట్ చూపించాలని అడిగినందుకు రూ.25వేలు ఫైన్ విధించారు. మోడీకి ఏ డిగ్రీ ఉంది..? ఏ కాలేజీ నుంచి డిగ్రీ పట్టా పొందారు..? ఏ కళాశాల అయినా తన విద్యార్థి దేశానికి ప్రధాని అయితే గర్వపడుతుంది. ప్రధాని తమ కాలేజీలోనే చదివారు అంటూ గొప్పగా చెప్పుకుంటుంది. అయితే మోడీ చదివిన కళాశాలకు ఆ గర్వం ఎందుకు కలగలేదు..?' అంటూ ఉద్ధవ్ ప్రశ్నించారు.

ఖాకీ కావరం...

భార్యాభర్తలు,వృద్ధుడిపై జైల్ కానిస్టేబుల్ దాడి

- ఇష్టానుసారంగా కొట్టడంతో గాయపడ్డ మహిళ
- ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

కూలీ చేసుకుని జీవనం సాగించే భార్యాభర్తలు, వృద్ధుడిపై పోలీసనే అధికారంతో జైల్ కానిస్టేబుల్ లాఠీ ఝుళిపించడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ వృద్ధుడు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా సిద్దిపేట అర్బన్ మండలం ఏన్సాన్‌పల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, సర్పంచ్ రవీందర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏన్సాన్‌పల్లి గ్రామ పరిధిలో సబ్ జైలు కోసం ప్రభుత్వ భూమిని కేటాయించారు. కేటాయించిన స్థలం పరిధి చూసుకోవడానికి సబ్ జైల్‌కు చెందిన సిబ్బందిలో నుంచి ఒకరిని వాచ్‌మెన్‌గా పెట్టారు. జైలుకు కేటాయించిన స్థలం ఖాళీగా ఉండటంతో



కొన్ని రోజుల నుంచి మెగా సంస్థకు చెందిన వ్యక్తులు అక్కడ తమ సామగ్రిని ఉంచుకొని పనులను కొనసాగించుకుంటున్నారు. ఈ మధ్యకాలంలో వారు అక్కడి నుంచి ఖాళీ చేసి వెళ్లిపోయారు. వారు వెళ్లిపోయిన తర్వాత అక్కడ వదిలి వెళ్లిన చిన్న చిన్న ఇనుప ముక్కలను ఏరుకొని అమ్ముకోవడానికి గ్రామ పరిధిలోని తిప్పరబోయిన కాలనీకి చెందిన భార్యాభర్తలు తిప్పర బోయిన ఎల్లయ్య, మణెమ్మ, తిప్పరబోయిన నరసయ్య (వృద్ధుడు)తో కలిసి ఆదివారం అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో అక్కడ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి ఇక్కడికి రావద్దంటూ బెదిరించాడు. దాంతో వారు అతనితో వాగ్వాదానికి దిగారు. తాను కానిస్టేబుల్‌నని, తనతోనే ఇష్టానుసారంగా మాట్లాడతారా.. అంటూ తన చేతిలో ఉన్నలాఠీతో మొదటగా భార్యాభర్తలపై, తర్వాత వృద్ధుడిపై దాడి చేసి గాయపరిచారు. వృద్ధుడు నరసయ్యను కడుపులో కొట్టడంతో అతన్ని వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తాము ఇనుప ముక్కలు ఏరుకోవడానికి వచ్చామని చెబుతున్నా వినకుండా లాఠీతో కొట్టి కాళ్లతో ఇష్టానుసారంగా తన్నాడని బాధితులు తెలిపారు. కానిస్టేబుల్‌తో వచ్చిన అతని భార్య కూడా దాడిలో పాల్గొన్నట్టు తెలిపారు. ఈ విషయమై బాధితులు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని సీఐ భానుప్రకాష్, సర్పంచ్ రవీందర్ గౌడ్ పరిశీలించారు. పోలీసులు పంచనామా నిర్వహిం చారు. బాధితులు ఫిర్యాదు మేరకు, పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విచ్చలవిడిగా మద్యం

- మహిళలపై పెరుగుతున్న దాడులు
- పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు ఝాన్సీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యాన్ని పారించటం వల్లనే మహిళలపై లైంగిక దాడులు పెరిగి పోతున్నాయని ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షులు జి ఝాన్సీ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో ఆ సంఘం రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ మద్యం మత్తులో మహిళలపై కుటుంబ హింస, లైంగిక దాడులు పెద్ద ఎత్తున పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంతో పోలిస్తే మద్యం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయం ఇప్పుడు మూడు రెట్లు పెరిగిందన్నారు. సుమారు రూ. 35 వేల కోట్లు ఆదాయాన్ని సర్కారు ఆర్జించిందని తెలిపారు. నేరాలు అరికట్టేందుకు నిరంతరం శ్రమిస్తున్నట్టు అధికారులు చెబుతున్నప్పటికీ..క్రైం రేటు పెరిగిందని తెలిపారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రంలో మద్య నిషేధాన్ని అమలు చేయాలనీ, తద్వారా పెరిగిన హింసను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, ఉపాధ్యక్షులు అనసూయ, జ్యోతి, కార్యదర్శి ఆర్ సీత, గీత తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో తండ్రి మృతదేహం..

- పుట్టెడు దు:ఖంతో టెన్త్ పరీక్ష రాసిన విద్యార్థి



నవతెలంగాణ- కడెం

అనారోగ్యంతో తండ్రి మృతిచెందాడు.. ఇదే సమయంలో తన భవిష్యత్‌కు బాటలు వేసే పరీక్ష ప్రారంభం.. ఈ క్రమంలో తండ్రి మృతదేహం ఇంట్లో ఉండగానే.. పుట్టెడు దుఃఖంతో విద్యార్థి పరీక్షకు హాజరయ్యాడు. వివరాలిలా ఉన్నాయి.. నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మొర్రిగూడెం గ్రామానికి చెందిన తక్కళ్ల వెంకటి(38) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతిచెందాడు. సోమవారం అంత్యక్రియలు జరపాల్సి ఉంది. అయితే, అతని కొడుకు తక్కళ్ల రోహిత్ పదో తరగతి పరీక్ష రాయాల్సి ఉంది. దుఃఖాన్ని దిగమింగుకుని.. గుండె నిండా బాధతోనే రోహిత్ పరీక్షకు హాజరయ్యాడు. పరీక్ష అనంతరం తండ్రి అంత్యక్రియలు నిర్వహించారు.

మనీష్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని సీబీఐ కోర్టు ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించింది. కేసు దర్యాప్తు కీలక దశలో ఉందని సీబీఐ కోర్టుకు తెలిపింది. దర్యాప్తు సంస్థ వాదనలు విన్న కోర్టు కస్టడీని పొడిగించింది. మద్యం పాలసీ వ్యవహారంలో ఫిబ్రవరి 26న మనీష్ సిసోడియా సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దాదాపు ఎనిమిది గంటలకుపైగా విచారించిన ఆయనను అరెస్టు చేసినట్లు సీబీఐ ప్రకటించింది. ఆ తర్వాత ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచింది. ఆ తర్వాత సీబీఐ కస్టడీకి ఇచ్చింది. విచారణ అనంతరం ఆయనను జ్యుడీషియల్ కస్టడీపై జైలుకు పంపింది. ఇదే కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సైతం అరెస్టు చేసింది. ఈడీ కేసులో మనీశ్ సిసోడియా బెయిల్ కోసం దరఖాస్తు చేయగా.. ఈ నెల 5న విచారణ జరుగనున్నది.

విద్యుద్ఘాతంతో విద్యార్థిని మృతి

- వికారాబాద్ జిల్లాలో ఘటన



నవతెలంగాణ-పూడూర్

పాఠశాలలో విద్యుద్ఘాతంతో ఓ విద్యార్థిని ప్రాణం కోల్పోయింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండల పరిధిలోని మంచన్పల్లి గ్రామంలో సోమవారం ఉదయం జరిగింది. స్థానికులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం..

మంచన్పల్లి గ్రామానికి చెందిన మంగలి నరసింహులు-లక్ష్మీ కూతురు మంగలి దీక్షిత(9) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లింది. అక్కడ మూత్రశాలకు వెళ్లి వస్తుండగా విద్యుత్ తీగ తగిలింది. గమనించిన ఉపాధ్యాయులు వెంటనే దీక్షితను పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. విద్యుత్ యర్త్ కోసం స్తంభం నుంచి వైర్‌ను మూత్రశాలల పక్కన పెట్టారు. ఆ తీగ తగలడం వల్లే విద్యుద్ఘాతానికి గురై విద్యార్థిని మృతిచెందింది. విద్యుత్ అధికారులు, ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా ఈ ఘటన జరిగిందని గ్రామస్తులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఇథనాల్ పరిశ్రమపై కొనసాగుతున్న వ్యతిరేకత

- వద్దంటూ కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని పాశిగామ, స్తంభంపల్లి మధ్య ఏర్పాటు చేయనున్న ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా నాలుగు రోజులుగా ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చేస్తూనే ఉన్నారు. మూడ్రోజుల కిందట ఇథనాల్ పరిశ్రమ కోసం కేటాయించిన భూమిని చదును చేసే పనులను మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించగా ప్రజలు అడ్డుకుని పెద్దఎత్తున ఆందోళన చేశారు. ఆదివారం ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. తోపులాటలో కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రజల ఆందోళన కొనసాగుతుండటంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఉండటంతో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు పాశిగామ, స్తంభంపల్లి గ్రామాల వారు పెద్దఎత్తున జగిత్యాల కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఇథనాల్ పరిశ్రమ వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పోలీసులు కలెక్టరేట్ ముందు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తీర్మార్ మల్లన్నకు వారెంట్ ఇవ్వొద్దు పోలీసులకు హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ - హైదరాబాద్

చింతపండు నవీన్‌కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్నపై నమోదైన కేసుల్లో బెయిల్ ఇవ్వాలనే పిటిషన్లపై మంగళవారం విచారణ జరగనున్న నేపథ్యంలో ఆయనపై ఆ కేసుల్లో పోలీసులు వారెంట్ జారీ చేయరాదని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. తిరిగి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఈ మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని పేర్కొంది. విచారణను ఈ నెల పదో తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం ఆదేశాలిచ్చారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తన భర్తను అరెస్టు చేశారని, ఏడేండ్లలోపు శిక్షలు పడే కేసుల్లో నోటీసులివ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించినా పోలీసులు వాటిని అమలు చేయలేదని నవీన్ భార్య మాతమ్మ వేసిన పిటిషన్ తరపున లాయర్ వాదించారు. ఏదోఒక విధంగా నవీన్‌ను ఇబ్బందులకు గురిచేయాలంటూ పోలీసులు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. మద్యం కుంభకోణం పేరుతో కేసీఆర్, కేటీఆర్, కవితలపై సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా పోస్టింగ్ పెట్టారంటూ ప్రభుత్వ లాయర్ వివరించారు.

వీఆర్‌వోల కేసు 20కి వాయిదా

ధరణి పోర్టల్ ఆవిర్భావం చేసిన కారణంగా వీఆర్‌వోలతో పనిలేదని, అందుకే వారిని వేరే శాఖలకు బదిలీ చేశామని ప్రభుత్వం హైకోర్టుకు చెప్పింది. వేరే శాఖలకు పంపే ముందు వీఆర్‌వోల అభిప్రాయాలు తీసుకోలేదని పిటిషనర్ల వాదన. గతేడాది జులై 23న ప్రభుత్వం జారీ చేసిన జీవోనెంబర్ 121ను రద్దు చేయాలన్నారు. 2007, జనవరి 31న అప్పటి ప్రభుత్వం ఇదే తరహా జీవో ఇస్తే హైకోర్టు రద్దు చేసిందని గుర్తు చేశారు. ఈ వివరాలను నమోదు చేసుకున్న హైకోర్టు తదుపరి విచారణను ఈనెల 20వ తేదీకి వాయిదా వేసింది.

కౌంటర్ దాఖలు చేయండి

సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో గత నెలలో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. గత నెల 17న స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదం జరగడంతో ఆరుగురు మరణించారు. ఈ ఘటనపై దినపత్రికల్లో వచ్చిన వార్తలను హైకోర్టు సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి, జీహెచ్ఎంసీ కమిషనర్, డీజీపీ, హైదరాబాద్ సీపీ తదితరులకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం సోమవారం నోటీసులు జారీ చేసింది. విచారణను జూన్ 26వ తేదీకి వాయిదా వేసింది.

విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి : బండి సంజయ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదవ తరగతి పరీక్షా పత్రం లీకేజీకి ప్రభుత్వమే బాధ్యత వహించాలనీ, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని కార్పొరేట్, ప్రయివేటు యాజమాన్యాలకు తొత్తుగా మారి ప్రభుత్వమే ఇలాంటి చర్యలకు పాల్పడుతుందేమోనని అనుమానం వ్యక్తం చేశారు. మిగిలిన పరీక్షలను విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో రాసుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్‌బీఐ ద్రవ్య పరపతి సమీక్ష ప్రారంభం

ముంబయి : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి ద్రవ్య పరపతి విధాన సమీక్షా సమావేశం సోమవారం ప్రారంభమయ్యింది. ఈ నెల 3, 5, 6 తేదిల్లో మూడు రోజుల పాటు ఇది సాగనుంది. ఈ భేటీలో వడ్డీ రేట్లను మరోసారి పెంచే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. విధాన నిర్ణయాలను శక్తికాంత దాస్ గురువారం మీడియాకు వెల్లడించనున్నారు. ఇప్పటికే రెపోరేటును 6.50 శాతానికి చేర్చారు. నిపుణుల అంచనాలకు అనుగుణంగా మరోసారి 25 బేసిస్ పాయింట్లు పెంచితే కీలక వడ్డీ రేటు 6.75 శాతానికి చేరనుంది. అదే జరిగితే రుణ గ్రహీతలపై మరింత భారం పడనుంది. స్టాక్ మార్కెట్లపై ఒత్తిడి నెలకొననుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

కియా అమ్మకాల్లో 44 శాతం వృద్ధి

న్యూఢిల్లీ :గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23)లో కియా ఇండియా అమ్మకాలు 44 శాతం వృద్ధితో 2,69, 229 యూనిట్లకు చేరాయని ఆ సంస్థ తెలిపింది. క్రితం మార్చితో ముగిసిన త్రైమాసికంలో 24.4 శాతం పెరుగుదలతో 74,735 యూనిట్లను విక్రయించడం ద్వారా వాహన మార్కెట్‌లో 7.4 శాతం మార్కెట్ వాటాను పొందినట్టు పేర్కొంది. ఇదే సమయంలో ఎగుమతుల్లో 24 శాతం వృద్ధిని కనబర్చినట్టు తెలిపింది.

జర్నలిస్ట్ కెఎల్ రెడ్డి పేరిట మెమోరియల్ అవార్డు ఏర్పాటు

నవతెలంగాణ - హైదరాబాద్

ప్రముఖ జర్నలిస్టు కెఎల్ రెడ్డి సంస్మరణార్థం ఉత్తమ జర్నలిస్టు అవార్డు ఏర్పాటైంది. ఈమేరకు తెలంగాణ మీడియా అకాడమీ, కెఎల్ రెడ్డి కుటుంబ సభ్యుల మధ్య ఒప్పందం కుదిరింది. గతంలో కెఎల్ రెడ్డి సంరక్షణార్థం రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రూ.15 లక్షలను మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఆశ్రమంలో ఉంటున్న కెఎల్ రెడ్డి బాగోగులు, వైద్య చికిత్సకు ఈ డబ్బును ఉపయోగించుకోవాలని అప్పట్లో ప్రభుత్వం సూచించింది. కాగా కెఎల్ రెడ్డి నవంబర్ 3న 2022 మరణించారు. దీంతో కెఎల్ రెడ్డి కుటుంబసభ్యులు ఆయన పేరున మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటుచేసి, ప్రభుత్వం ఇచ్చిన రూ.15 లక్షల్లో, రూ.9లక్షలు మీడియా అకాడమీ కిచ్చి, దానిపై వచ్చిన వడ్డీతో, ప్రతి సంవత్సరం "కెఎల్ రెడ్డి మెమోరియల్ ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు" ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి సంవత్సరం నవంబర్ 3న ఇచ్చే ఈ అవార్డు గ్రహీత ఎంపికకు ఒక కమిటీ ఏర్పాటు చేస్తారు. అకాడమీ అధ్యక్షులు చైర్మెన్‌గా ఉండే ఈ కమిటీలో, ఇద్దరు ప్రముఖ జర్న లిస్టులు, కెఎల్ రెడ్డి కుటుంబం నుంచి ఇద్దరు, అకాడమీ కార్యదర్శి సభ్యులుగా ఉండి, అవార్డు గ్రహీతను నిర్ణయి స్తారని అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ తెలియజేసారు.

ఈ మేరకు సోమవారం కెఎల్ రెడ్డి అల్లుడు లింగా రెడ్డి, అకాడమీ కార్యదర్శి వెంకటే శ్వరరావు అకాడమీ చైర్మెన్ అల్లం నారా యణ, కెఎల్ రెడ్డి తమ్ముడు ఇంద్ర సేనా రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

బిజినెస్

ఎస్‌బీఐ ఆన్‌లైన్ సేవల్లో తీవ్ర అంతరాయం



హైదరాబాద్: దేశంలోనే అతి పెద్ద విత్త సంస్థ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సర్వర్ డౌన్ అయ్యింది. దీంతో సోమవారం ఆ బ్యాంక్ ఆన్‌లైన్ సేవల్లో తీవ్ర అంత రాయం చోటు చేసుకుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దాదాపు పూర్తిగా సేవలు నిలిచిపోయాయి. ఎస్‌బీఐ యోనో యాప్, నెట్ బ్యాంకింగ్‌తో పాటు యూపీఐ లావాదేవీలకు వీలు లేకుండా పోయింది. దీంతో ఖాతా దారులు డిజిటల్ చెల్లింపుల్లో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఇదే విషయాన్ని పలువురు ఖాతాదారులు సామాజిక మాధ్యమాల్లో తమ బాధను, ఆందోళనను వ్యక్తం చేశారు. ఆర్థిక సంవత్సరం (2022-23) ముగింపు నేపథ్యంలో ఏప్రిల్ ఒక్కటో తేదిన మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలను అధికారికంగా నిలిపివేసింది. ఆ తర్వాత కూడా ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్టు పలువురు పేర్కొన్నారు.

మెక్ డొనాల్డ్స్ ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన

- అన్ని ఆఫీసుల మూత

వాషింగ్టన్ : ప్రముఖ ఫాస్ట్‌ఫుడ్ రిటైల్ చెయిన్ సంస్థ మెక్‌డొనాల్డ్స్ ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఆ సంస్థ అమెరికాలోని అన్ని కార్యాలయాలను మూడు రోజుల పాటు మూసేసింది. భారీగా ఉద్యోగల తొలగింపు ప్రక్రియలో భాగంగా ఈ చర్యలకు దిగిందని రిపోర్టులు వస్తున్నాయి. తమ కార్పొరేట్ ఉద్యోగులు సోమవారం నుంచి బుధవారం వరకు ఇంటి నుంచి పని చేయాలని ఆదేశాలు జారీ చేసింది. సంస్థలో ఉద్యోగుల విధులకు సంబంధించి కీలక నిర్ణయాలను వెల్లడిస్తామని ఆ సంస్థ తెలిపింది.

కాగా.. ఉద్యోగుల ఉద్వాసనపై ఏప్రిల్ 5న అధికారిక నిర్ణయం వెలువడనుందని సమాచారం. ప్రస్తుతం ఈ సంస్థలో 1.50 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. అమెరికాలో ద్రవ్యోల్బణం 40 ఏండ్ల గరిష్ట స్థాయికి ఎగిసింది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గింది. ఆర్థిక సంక్షోభం క్రమంగా పెరుగుతోంది. దీంతో అనేక కంపెనీలు పొదుపు చర్యలను పాటిస్తున్నాయి. ఇదే బాటలో మెక్ డొనాల్డ్స్ ప్రయాణించనుందని రిపోర్టులు వస్తున్నాయి.

పాల ధరలను పెంచిన సిడ్స్ ఫార్మ్

హైదరాబాద్ : తెలంగాణా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రీమియం డి2సి డెయిరీ బ్రాండ్ సిడ్స్ ఫార్మ్ పాల ధరలను మరోసారి పెంచింది. ఫిబ్రవరిలోనే అర లీటర్ పాలపై రూ.2 పెంచగా.. తాజాగా ఎ2 గేదె పాల ధరను మరో రూ.3 పెంచి రూ.55కి చేర్చింది. ఎ2 డబుల్ టోన్డ్ గేదె పాల ధరను రూ.44గా నిర్ణయించినట్టు ఆ సంస్థ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. కాగా.. ఆవు పాల ధరల్లో ఎలాంటి మార్పు చేయ లేదని పేర్కొంది. ఆరు నెలలుగా ముడి సరుకుల ధరలు భారీగా పెరగడం తో పాటుగా ఎ2 గేదె పాల నాణ్యతను పెంచడానికి ధరలు పెంచాల్సి వచ్చిందని సిడ్స్ ఫార్మ్ ఫౌండర్ డాక్టర్ కిశోర్ ఇందుకూరి తెలిపారు.

డిసెంబర్ కల్లా 15 ప్రీమియం స్టోర్లు

- సామ్‌సంగ్ వెల్లడి

గుర్గావ్ : ప్రస్తుత ఏడాది ముగింపు నాటికి దేశ వ్యాప్తంగా 15 ప్రీమియం ఎక్స్‌పీరియన్స్ స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్టు సామ్‌సంగ్ ఇండియా తెలిపింది. హైదరాబాద్ సహా అన్ని కీలక మెట్రో నగరాల్లో వీటిని అందుబాటులోకి తేనున్నామని పేర్కొంది. వీటిలో సామ్‌సంగ్ బహుళ ఉత్పత్తులను ప్రదర్శన, అమ్మకానికి ఉంచనుంది. ఈ స్టోర్లలో విని యోగదారుల కోసం ఉత్కంఠభరితమైన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకు రావడంతో పాటుగా దేశంలోనే అత్యుత్తమ ఎలక్ట్రానిక్స్ ప్రమాణాలను నెలకొల్పనున్నట్టు తెలిపింది.

జూన్‌లో ఇండస్ట్రీయల్ ఇన్నోవేషన్, టెక్నాలజీ ప్రదర్శన

- ఎఫ్‌టీసీసీఐ నిర్వహణ



హైదరాబాద్ : వచ్చే జూన్‌లో ఇండస్ట్రీయల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ పారిశ్రామిక ప్రదర్శన -2023ను నిర్వహించనున్నామని ఎఫ్‌టీసీసీఐ వెల్లడించింది. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) అధ్యక్షులు అనిల్ అగర్వాల్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మీలా జయదేవ్‌తో కలిసి ఎక్స్‌పో లోగో, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అత్యాధునిక సాంకేతికత, ఆవిష్కరణల వినియోగం ద్వారా ఉత్పత్తిని పెంచాలనే లక్ష్యంతో దీన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని ప్రాంతీయ ఛాంబర్లు, రాష్ట్రాలు పాల్గొనేలా, వారి స్వంత పెవిలియన్లను కలిగి ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. జూన్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు హైటెక్స్‌లో ఈ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నామన్నారు. 150 స్టాల్స్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా ప్యాకేజింగ్, ప్రింటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, విద్యుత్ వాహనాలు, పునరుత్పాదన ఇంధన రంగాల్లోని వారు పాల్గొననున్నారన్నారు.

రాష్ట్రంలో స్వమిత్వ పథకం అమలు చేయాలి

సీఎం కేసీఆర్‌కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామీణ ప్రాంతాల్లో ఇండ్లకు సంబంధించిన ఆస్తి ధృవీకరణ పత్రాలను అందించే స్వమిత్వ పథకం రాష్ట్రంలో అమలు చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన ఐదు గ్రామాల వారికి వారి ఇండ్ల ఆస్తి వివరాలు అందివ్వాలని కోరారు. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం అమలు చేస్తే గ్రామీణ ప్రజల్లో ఆర్థిక స్థిరత్వం ఏర్పడే అవకాశముంటుందని సూచించారు.

లక్ష దాటిన భద్రాద్రి తలంబ్రాల బుకింగ్‌లు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భద్రాద్రి సీతారాముల కల్యాణోత్సవ తలంబ్రాలకు ప్రజల నుంచి మంచి డిమాండ్ వస్తున్నది. ఇప్పటివరకు లక్ష మందికి పైగా ఈ తలంబ్రాల కోసం టీఎస్‌ఆర్టీసీ కార్గో ద్వారా బుకింగ్ చేసుకున్నారు. మొదటి విడతలో 50 వేల మంది భక్తులకు తలంబ్రాలను హోండెలివరీ చేయనున్నారు. ఆదివారం నుంచే ఈ డెలివరీ ప్రక్రియ ప్రారంభమైంది. డిమాండ్ దృష్ట్యా తలంబ్రాల బుకింగ్‌ను ఈ నెల 10 వరకు పొడిగించారు. బుక్ చేసుకున్నవారికి రెండు, మూడు రోజుల్లో తలంబ్రాలను అందచేస్తారు. తలంబ్రాల తొలి బుకింగ్‌ను టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్ అందుకున్నారు. బస్‌భవన్‌లో టీఎస్‌ఆర్టీసీ బిజినెస్ హెడ్(లాజిస్టిక్స్) పి.సంతోష్ కుమార్ ఎమ్‌డీ సజ్జనార్‌కు ముత్యాల తలంబ్రాలను అందజేశారు. అలాగే మంత్రుల నివాస ప్రాంగణంలో చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్ దంపతులకు ఆర్టీసీ అధికారులు తలంబ్రాలను అందచేశారు. రాష్ట్రంలోని అన్ని టీఎస్‌ఆర్టీసీ కార్గో పార్శిల్ కౌంటర్లలో తలంబ్రాలను బుక్ చేసుకోవచ్చని సూచించారు. ఈ సేవలను పొందాలనుకునే భక్తులు టీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగ ఫోన్ నంబర్లు 9177683134, 7382924900, 9154680020ను సంప్రదించాలన్నారు. తమ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు కూడా ఆర్డర్‌ను స్వీకరిస్తారని తెలిపారు.

దుర్భరంగా మత్స్యకారుల జీవితాలు

కార్పొరేట్ల లాభాల కోసం వారి జీవనోపాధిపై వేటు

- బడ్జెట్‌లో మత్స్య పరిశ్రమకు అరకొర కేటాయింపు
- ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యుఎఫ్ పార్లమెంట్ మార్చ్‌లో తపన్ సేన్, హేమలత



న్యూఢిల్లీ :మోడీ పాలనలో దేశంలోని మత్స్య కారులు, కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయని సీఐటీయూ అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.హేమలత, తపన్‌సేన్ విమర్శించారు. కార్పొరేట్ల లాభాల కోసం వారికి సముద్ర తీర ప్రాంతాన్ని తాకట్టుపెట్టి మత్స్యకారుల పొట్ట గొడుతున్నదన్నారు. సోమవారం ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మిక సమాఖ్య (ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యుఎఫ్) ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్ జరిగింది. సీపీఐ(ఎం) ఎంపీలు వి.శివదాసన్, ఎ.ఎ.రహీమ్ సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఎఐఎఫ్ఎఫ్ డబ్ల్యుఎఫ్ జాతీయ అధ్యక్షులు దేబ్‌శిశ్ బర్మన్ అధ్యక్షతన జరిగిన ధర్నాను తపన్ సేన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్ కేటాయింపుల్లో మత్స్య పరిశ్రమ పట్ల మోడీ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. లక్ష కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులు, కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలనీ, పెన్షన్, ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. వారి పిల్లలకు ఉచిత విద్య అందించాలని కోరారు. కె.హేమలత మాట్లాడుతూ చేపలు ఎగుమతి చేసేందుకు మత్స్యకారులను అనుమతించ ట్లేదనీ, సముద్ర ప్రాంతాన్ని వివిధ వ్యాపారాల(హోటళ్లు, రెస్టారెంట్లు, అతిథి గృహాలు వంటి వ్యాపార సంబంధిత వ్యవహారాలు)వారికి అప్పగిస్తున్నారని విమర్శించారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక జైళ్లలో మన దేశ మత్స్యకారులు మగ్గుతున్నారన్నారు. వారిని విడిపించి దేశానికి తీసుకురావాలనే సోయిని మోడీ సర్కారు మరిచిందని విమర్శించారు. మెజార్టీ మత్స్య సహకార సంఘాలు మాఫియా చేతుల్లోకి వెళ్లిపోయాయనీ, మత్స్యకారుల నుంచి అధిక రుసుము వసూలు చేస్తున్నారని విమర్శించారు. చేపలు శుద్ధి చేసే కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వటం లేదనీ, కార్పొరేట్లు మాత్రం లాభాలు పొందుతున్నారని తెలిపారు. ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ మాట్లాడుతూ..మోడీ ప్రభుత్వ విధానాలు మత్స్యకారులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని విమర్శించారు. సాగరమాల ప్రాజెక్టుతో భూములు సేకరిస్తున్నారనీ, దీనివల్ల మత్స్యకారులకు తీవ్ర నష్టం జరుగుతున్నదని చెప్పారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో విదేశాల నుంచి చేపల దిగుమతికి సంతకాలు చేశారనీ, ఇది దేశంలోని మత్స్యకారులకు తీవ్ర నష్టాన్ని తెచ్చిపెడుతున్నదని విమర్శించారు.

ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యుఎఫ్ ప్రధాన కార్యదర్శి పుల్లివెల స్టాన్లీ మాట్లాడుతూ.. ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాల వల్ల మత్స్యకారులు, చేపల విక్రయదారులు, చేపల ప్రాసెసింగ్ కార్మికులు తదితర అన్ని వర్గాల వారు నానా అవస్థలు పడుతున్నారన్నారు. పేదరికం, అప్పులు, కష్టాలలో జీవిస్తున్నారని తెలిపారు. సామాజిక అణచివేతను కూడా ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యుఎఫ్ కోశాధికారి జి.మమత, కేరళ మత్స్య ఫెడ్ చైర్మెన్ టి. మనోహరన్, జాతీయ ఉపాధ్యక్షులు మహఫజ్ రహమాన్, జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, తెలంగాణ నుంచి గోరెంకల నరసింహ, పగడాల నాగేశ్వరరావు, సీహెచ్.శంకర్, విజయ్ కుమార్, ఎం.మోహన్, టి.ఇస్తారి, జి.వెంకట్, ఎం.రమేష్, ఆంధ్రప్రదేశ్ నుంచి సీహెచ్ రమణి, వై.శ్రీనివాస్, ఎస్.కళావతి, పి. నారాయణ, సిహెచ్ రమేష్ పాల్గొన్నారు.

ఈ ధర్నాలో దుబ్బుల కొలుపు కళాకారుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మాటూరి దేవేందర్, జునగరి దుర్గయ్య ఆధ్వర్యంలో వందలాది మంది దుబ్బుల కొలుపు కళాకారులు తమ కళా ప్రదర్శన చేశారు. జాతీయస్థాయిలో దుబ్బుల కొలుపు కళాకారుల వృత్తిని గుర్తించి జాతీయ గెజిట్‌లో ఎక్కించాలని డిమాండ్ చేశారు.

కేంద్ర మంత్రికి వినతి

మత్స్యకారుల సమస్యలపై కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తమ్ రూపాలాను ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యుఎఫ్ బృందం కలిసింది. ఈ సందర్భంగా ఐదు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించింది. మత్స్యకారులకు కిరోసిన్, డీజిల్‌ను సబ్సిడీపై అందించాలనీ, చేపల వేటకు సబ్సిడీల ఉపసంహరణపై డబ్ల్యూటీఓ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేసింది. మెరైన్ ఫిషరీస్ బిల్లు ముసాయిదా, బ్లూ ఎకానమీ పాలసీని ఖరారు చేసే ముందు మత్స్యకారులు, మత్స్య కార్మికుల ప్రతినిధులతో చర్చించాలని కోరింది. చేపల ప్రాసెసింగ్ కార్మికులు, అనుబంధ కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, అన్ని కార్మిక చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేసింది. సముద్ర తీరం, మడ అడవులు, తీర ప్రాంతాలను రక్షించడానికి కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) నియమాలను సమర్థవంతంగా అమలు చేయాలనీ, తీర ప్రాంతాల్లో నివసించే వారు తమ ఇండ్లను ఆధునీకరించుకునేందుకు అనుమతించాలని కోరింది. మత్స్యకారుల సహకార సంఘాలకు నామమాత్రపు ధరలకు ఫిషింగ్ కోసం కేంద్ర ప్రభుత్వ నీటి వనరులను అందించాలని డిమాండ్ చేసింది.

ఉన్నతాధికారులతో సమీక్షలు చాలవు

క్షేత్రస్థాయిలో సమస్యలకు పరిష్కారమెలా?

- చిరుద్యోగుల బాధలు వినేదెవరు?
- బోధనాస్పత్రుల సూపరింటెండెంట్ల తీరుపై విమర్శలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేవలం ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలతో సమస్యలు పరిష్కారం కావు. వ్యవస్థలో పాతుకుపోయిన అంసతృప్తిని తొలగించేందుకు క్షేత్రస్థాయిలో పని చేసే వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి. నిధులు కేటాయిస్తున్నప్పటికీ ఆ మేరకు ఫలితం మాత్రం రావడం లేదు. కింది స్థాయిలో ఉద్యోగులు మరింత ఉత్సాహంగా పని చేయాలి. రోగుల్లో పెరిగిన నమ్మకాన్ని కాపాడుకునేందుకు అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలి. ఇలాంటి ఆలోచనలు, నిర్ణయాలతోనే వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు నెలవారీ సమీక్షలకు శ్రీకారం చుట్టారు. విభాగాల వారీగా ప్రతి నెల సమీక్షలు నిర్వహిస్తూ, నిర్దేశించిన లక్ష్యాలపై ఆరా తీస్తూ, పనితీరు మెరుగైన వారిని అభినందిస్తూ, వెనుకబడిన వారికి సూచనలు, సలహాలిస్తూ జవాబుదారీ తనాన్ని పెంచే ప్రయత్నం చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా క్రమం తప్పకుండా డీఎంఈ, డీహెచ్, టీవీవీపీ, నిమ్స్, నిలోఫర్ తదితర విభాగాల వారీగా నిర్వహిస్తున్న సమీక్షా సమావేశాలు ప్రభుత్వానికి మంచి ఫీడ్ బ్యాక్‌ను ఇచ్చాయనే చెప్పాలి. ఈ సమీక్షల్లో నుంచి వచ్చిన సమాచారం తోనే సి-సెక్షన్లను తగ్గించేందుకు సహజ ప్రసవాలు చేసే వారికి ప్రోత్సాహకాలు అందివ్వాలని నిర్ణయించారు. మంత్రి వరకే పరిమితమైన సమీక్షలు కింద స్థాయిలో అధికారులు అందుకోవడం లేదనే వాదన వినపడుతోంది. ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, అధికారులు రౌండ్స్‌కు తప్పనిసరిగా వెళ్లాలని మంత్రి ఆయా సందర్భాల్లో ఆదేశిస్తూనే ఉన్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఇప్పటికీ చాలా ఆస్పత్రుల్లో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. సమీక్షలు చేయరు అనే విమర్శలే సూపరింటెండెంట్లపై వినపడుతున్నాయి. దీంతో ఒకరిద్దరు ఆస్పత్రి అధికారులు చెప్పే విషయాలపైనే పూర్తి ఆధారపడుతూ "వచ్చామా... వెళ్లామా" అన్నట్టుగా కొందరి వ్యవహారం తయారైంది. కింద స్థాయిలో సమస్యలు నెలల తరబడి పేరుకుపోతున్నా..... వాటికి మోక్షం లభించడం లేదు. పేద ప్రజలకు కోట్లాది రూపాయలు వెచ్చించి మెరుగైన వైద్యం అందించాలనే ప్రభుత్వ సంకల్పానికి ఇలాంటి వారి చర్యలు ఆటంకంగా మారుతున్నాయి. తాగునీరు, పారిశుధ్యం, సెక్యూరిటీ సమస్యలు, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో రోగుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతూనే ఉన్నది.

మంత్రి మాదిరిగా....

మంత్రి నిర్వహిస్తున్నట్టు విభాగాల వారీగా నెలవారీ సమీక్షలు ఆస్పత్రుల్లోనూ నిర్వహిస్తే బాగుంటుందని నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పటికే వైద్యారోగ్యశాఖ ప్రక్షాళన, పనితీరు మెరుగు పరిచేందుకు మంత్రి విస్తృతస్థాయి సమావేశాలు దోహదపడ్డాయని వారు అభిప్రాయపడుతున్నారు. అదే తరహాలో ఆయా ఆస్పత్రుల సూపరింటెం డెంట్లు కేవలం ఒకరిద్దరు ఆర్‌ఎంఓలు, పాలనాధికా రుల సూచనలకే పరిమితం కాకుండా డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, పారిశుధ్య, ఇతర విభాగాల వారీగా కనీసం నెలకు ఒకసారి సమీక్షా సమావేశం నిర్వహిస్తే పనితీరు మరింత మెరుగవు తుందని సూచిస్తున్నారు. సూపరింటెండెంట్ల స్థాయిలో ఉన్నవారు రెగ్యులర్ రౌండ్స్‌కు వెళ్లడం, క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తే క్షేత్రస్థాయి ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెరుగుతుందనీ, కింద స్థాయిలో సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారమై రోగుల్లో అసంతృప్తి పోతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

హైకోర్టు ఉద్యోగ పరీక్షకు సర్వర్ ప్రాబ్లం

- జూనియర్ అసిస్టెంట్ పరీక్ష వాయిదా
- అభ్యర్థులను పరీక్ష కేంద్రంలో కూర్చోబెట్టి బయటకు పంపించిన వైనం
- ఈనెల 5న నిర్వహిస్తామని ప్రకటన

నవతెలంగాణ-నాచారం

తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీతో ఎంతో మంది నిరుద్యోగులు నష్టపోగా.. తీవ్ర నిరాశ.. ఆందోళనతో ఉన్నారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం జరగాల్సిన రాష్ట్ర హైకోర్టు జూనియర్ అసిస్టెంట్ పరీక్షను సర్వర్ డౌన్ వల్ల నిర్వహించలేదు. హైదరాబాద్ నాచారం పరిధిలోని మల్లాపూర్ నోమ అయాన్ డిజిటల్ జోన్ ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 6:45వరకు పరీక్ష జరగాల్సి ఉంది. దీనికి సుమారు 1500 మంది అభ్యర్థులు హాజరైనట్టు సమాచారం. వారి నుంచి అన్ని ఆధారాలు సేకరించి లోపల కూర్చోబెట్టిన అయాన్ డిజిటల్ జోన్ నిర్వాహకులు సర్వర్ సమస్య కారణంగా పరీక్ష కొంత ఆలస్యంగా నిర్వహిస్తామని చెప్పారు. కానీ మొత్తానికే పరీక్ష నిర్వహించకుండానే అభ్యర్థులను పంపించారని అభ్యర్థి సూరజ్ వెల్లడించారు. ఈ క్రమంలో అయాన్ డిజిటల్ జోన్ నిర్వాహకులకు, అభ్యర్థులకు మధ్య కొంత ఘర్షణ వాతావరణం చోటుచేసుకోవడంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేసి చెదరగొట్టారు. మల్లాపూర్ ప్రధాన రహదారిపై బైటాయించే ప్రయత్నం చేయగా అడ్డుకున్నారని అభ్యర్థి సూరజ్ ఆవేదన వ్యక్తం చేశారు.

5వ తేదీన పరీక్ష

మల్లాపూర్ అయాన్ డిజిటల్ జోన్ సెంటర్‌లో సర్వర్ సమస్యతో నిర్వహించలేకపోయిన హైకోర్టు జూనియర్ అసిస్టెంట్ పరీక్షను ఈనెల 5వ తేదీన పెడతామని హైకోర్టు ఫర్ ద స్టేట్ ఆఫ్ తెలంగాణ నోటిఫికేషన్ విడుదల చేశారు. నిరుద్యోగ అభ్యర్థులు విషయాన్ని గమనించి తిరిగి పరీక్షకు హాజరు కావలసిందిగా కోరారు.

దేశానికే ఆదర్శంగా తెలంగాణ వైద్యారోగ్య శాఖ..

- పల్లె నుంచి పట్నం దాకా , పేదల నుంచి పెద్దల వరకు ప్రయివేటుకు ధీటుగా వైద్య సేవలు...
- ప్రైమరీ ఆస్పత్రులే గగనం అనుకున్న రోజుల నుంచి జిల్లాకో మెడికల్ కాలేజీ పెట్టుకునే స్థాయికి..
- జాతీయ ఆరోగ్య సూచికల్లో ప్రగతి సాధించిన తెలంగాణ
- అందరికి ఆరోగ్యమే తెలంగాణ ప్రభుత్వ సంకల్పం - సీఎం కేసీఆర్ ధ్యేయం
- 3 అంచెల వైద్యాన్ని 5 అంచెల వ్యవస్థగా విస్తరణ: రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అందరికి మెరుగైన ఆరోగ్యం అందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నది. ప్రణాళికాయుతంగా ప్రభుత్వం అమలు చేస్తున్న కుటుంబ సంక్షేమ కార్యక్రమాల అమలుతో జాతీయ ఆరోగ్య సూచికల్లో రాష్ట్రం గణనీయ ప్రగతి సాధించింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖ కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ తేడా 2014 తో పోల్చితే స్పష్టంగా కనిపిస్తున్నది. ఒక లక్ష ప్రసవాలకు 2014లో 92గా ఉన్న మాతృ మరణాలు, 2022 నాటికి 56కు తగ్గాయి. 2014లో 39గా ఉన్న శిశుమరణాలు,2022 నాటికి 23కు తగ్గాయి. 2014లో 5 సంవత్సరాల లోపున్న పిల్లల మరణాలు 41 ఉంటే, 2022 నాటికి ఆ సంఖ్య 30కి తగ్గింది. అదే సమయంలో 25గా ఉన్న బాలింత మరణాలు 16కు తగ్గాయి. ఇమ్యూనైజేషన్ వాక్సిన్ విషయానికి వస్తే 2014లో 68 శాతం ఉంటే, 2022 నాటికి 100 శాతానికి చేరింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య 2014లో 30 శాతం ఉంటే, 2022 నాటికి 56 శాతానికి పెరిగింది. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో జరుగుతున్న ప్రసవాల సంఖ్య 98 శాతానికి పెరిగింది.

అన్ని ఆరోగ్య సూచికల్లో తెలంగాణ రాష్ట్రం జాతీయ స్థాయి కంటే మెరుగ్గా ఉంది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన నీతి ఆయోగ్ విడుదల చేసిన 4వ ఆరోగ్య సూచిల్లో తెలంగాణ రాష్ట్రం కేరళ, తమిళనాడు తర్వాత 3వ స్థానానికి చేరింది. తలసరి ప్రభుత్వం చేస్తున్న వైద్యఖర్చుల్లో రూ.1,698 లతో హిమాచల్ ప్రదేశ్, కేరళ తర్వాత తెలంగాణ రాష్ట్రం నిలిచింది. 2022-23 బడ్జెట్లో దానిని రూ.3,091లకు పెంచారు. అలాగే ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన హెల్త్ ఫిట్ నేషన్ కాంపెయిన్‌లో 3 కేటగిరిల్లో అవార్డులు ప్రకటించగా తెలంగాణ రాష్ట్రం 3 అవార్డులు సాధించి అగ్రస్థానంలో నిలిచింది.

వైద్య సదుపాయల విస్తరణ, నిరంతర మానిటరింగ్‌తో పాటు దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకుని అమలుచేస్తున్న కుటుంబ సంక్షేమ పథకాలు - కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కెసిఆర్ కిట్, ఆరోగ్య లక్ష్మి, అమ్మఒడి పథకాల సమ్మిళిత ఫలితాలే జాతీయ స్థాయిలో తెలంగాణ సాధించిన ఆరోగ్య సూచికలుగా పేర్కొనవచ్చు.

గతంలో మూడు అంచెలు- ప్రాథమిక సేవలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ద్వితీయ స్థాయి సేవలకు జిల్లా ఆసుపత్రులు, స్పెషాలిటీ సేవలకు మెడికల్ కాలేజీలుగా ఉన్న వైద్య సేవలు వ్యవస్థకు అదనంగా ప్రివేంటివ్ సేవలకు బస్తీ /పల్లె దవాఖానలు, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలకు టిమ్స్‌లతో 5 అంచెల వ్యవస్థగా మార్చి ప్రజల ముంగిటకే ప్రాథమిక వైద్యాన్ని, పేదలకు అందుబాటులోకి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను తెచ్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కింది. గాంధీ ఆస్పత్రిలో అత్యాధునిక సెంట్రల్ డయాగ్నస్టిక్ లేబరేటరీని ఏర్పాటు చేశారు. మెడికల్ సర్వీసెస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా నెలకొల్పిన ప్రభుత్వ డయాగ్నస్టిక్ కేంద్రాలలో జరుగుతున్న రోగ నిర్ధారణ పరీక్షలను పర్యవేక్షిస్తున్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తుల సౌలభ్యం కొరకు 42 డయాలసిస్ కేంద్రాలను ప్రభుత్వం నెలకొల్పింది. ఈ కేంద్రాల సంఖ్యను 102కు పెంచాలని భావిస్తున్నది. డయాలసిస్ కేంద్రాలకు రోగులు వచ్చే పోయేందుకు ఆర్టీసీ ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించింది.

రాష్ట్ర వ్యాప్తంగా 21 ఆస్పత్రుల్లో సీటీ స్కాన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గుండె సంబంధిత శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు హైదరాబాద్‌తో పాటు ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్‌లలో క్యాథ్‌ల్యాబ్‌లను ప్రభుత్వం నెలకొల్పింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పారిశుధ్య నిర్వహణను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ప్రతి బెడ్‌కు చేస్తున్న ఖర్చును రూ.5,000 నుంచి రూ 7,500 లకు పెంచడం జరిగింది. సాధారణ రోగులకు ఇచ్చే డైట్ ఛార్జిలను రోజుకు రూ.40 నుంచి రూ.80లకు పెంచింది. అంధత్వరహిత తెలంగాణ లక్ష్యంగా నిర్వహించిన "కంటి వెలుగు" 2వ దశ కార్యక్రమం కింద ఇప్పటి వరకు ఒక కోటికి చేరువలో కంటి పరీక్షలు చేసి దృష్టి లోపం ఉన్న వారికి ఉచితంగా కండ్లద్దాలు, మెడిసిన్స్ ఇచ్చారు. ప్రభుత్వ వైద్యంతో పేద మధ్యతరగతి కుటుంబాలకు వేలాది రూపాయలు ఆదా అవుతున్నాయి.

మెడికల్ కాలేజీలు...

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నాటికి తెలంగాణలో ప్రభుత్వపరంగా 5 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవి. మొదటి దశలో ఒక్కొక్కటి రూ.450 కోట్ల వ్యయంతో కొత్తగా మహబూబ్‌నగర్, సిద్ధిపేట, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలు నడుస్తున్నాయి. ప్రతి జిల్లాలో ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. 2021 లో 8 కాలేజీలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో దానికి రూ.510 కోట్ల వ్యయంతో సంగారెడ్డి, వనపర్తి, నాగర్ కర్నూల్, జగిత్యాల, మహబూబాబాద్, కొత్తగూడెం, మంచిర్యాల, రామగుండంలలో మెడికల్ కాలేజీలను ఏర్పాటుచేసింది. రాష్ట్రంలో 2014లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న 700 యంబీబీఎస్ సీట్లు 2021 నాటికి 1,649 సీట్లకు పెరిగాయి. 2014లో 531 ఉన్న పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ సీట్లు 2021 నాటికి 967కు పెరిగాయి. 2014లో 82 ఉన్న సూపర్ స్పెషాలిటీ సీట్లు 2021 నాటికి 153 కు పెరిగాయి. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు అయిన తర్వాత యంబీబీఎస్. సీట్లు 5,240కు, పీజీ మెడికల్ సీట్లు 2,500 లకు, సూపర్ స్పెషాలిటీ సీట్లు 1,000కు చేరుతాయి.

హైదరాబాద్ నగరవాసులతో పాటు ఆధునిక వైద్య సేవలకొరకు చుట్టు పక్కల జిల్లాల నుంచి వచ్చే వారికి అందుబాటులో వుండే విధంగా ఎయిమ్స్ తరహాలో నగరానికి నాలుగు వైపులా తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సస్ (టిమ్స్) పేరున సూపర్ స్పెషలిటీ ఆసుపత్రులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది.

అందులో భాగంగా 1,500 పడకలతో గచ్చిబౌలిలో టిమ్స్ ఆస్పత్రిని ప్రభుత్వం ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది. మొత్తం రూ.2,679 కోట్ల వ్యయంతో ఒక్కొక్కటి 1,000 ఆక్సిజన్ పడకల సామర్థ్యంతో ఆల్వాల్, గడ్డి అన్నారం, ఎర్రగడ్డలలో సూపర్ స్పెషలిటీ ఆసుపత్రుల నిర్మాణానికి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. వీటిలో 300 ఐసీయు పడకలు ఏర్పాటు చేయనున్నారు. ప్రతి టిమ్స్ ఆస్పత్రిలో 26 రకాల ఆపరేషన్ థియేటర్లు, 30 రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల విభాగాలు, 16 స్పెషాలిటీ,15 సూపర్ స్పెషాలిటీ పీజీ మెడికల్ కోర్సులు, నర్సింగ్, పారా మెడికల్ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. నిమ్స్ ను విస్తరించేందుకు, ఇతర టీచింగ్ హాస్పిటల్స్‌లో సీట్లు పెంపుకు ప్రభుత్వం కృషి చేస్తున్నది. పట్టణ పేదలకు నాణ్యమైన ప్రభుత్వ వైద్య సేవలను అందించే లక్ష్యంతో గ్రేటర్ హైదరాబాద్‌లో 256 బస్తీ దవాఖానలను ప్రభుత్వం నడుపుతున్న విషయం విదితమే. వీటి స్ఫూర్తితో 141 మున్సిపాలిటీలలో కొత్తగా 288 బస్తీ దవాఖానలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వ్యాధుల నిర్ధారణలో జరుగుతున్న దోపిడీని అరికట్టేందుకు 57 రకాల రోగానిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేసేందుకు వీలుగా తెలంగాణ డయాగ్నస్టిక్స్ ల్యాబ్‌ను ప్రభుత్వం నెలకొల్పి, ప్రభుత్వ ఆస్పత్రులను అనుసంధానించింది. ప్రాథమిక స్థాయిలో మరింత మెరుగైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా 4,745 సబ్ సెంటర్లను "పల్లె దవాఖానా"లుగా అభివృద్ధి చేయుటకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.